ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు, fb.com/vaartha
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-1-2025 శుక్రవారం సంపుటి: 30 సంచిక: 349 పేజీలు: 12 వెల: 6.50



2లో భారీ ఎన్‌కౌంటర్
19 మంది మృతి
మృతుల్లో పలువురు మావోయిస్టు అగ్రనేతలు

## 8వ వేతన సంఘానికి కేంద్రం
# గ్రీన్‌సిగ్నల్



### త్వరలో చైర్మన్ నియామకం: కేబినెట్ నిర్ణయం
### ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు భారీగా పెరిగే అవకాశం

**న్యూఢిల్లీ, జనవరి 16:** బడ్జెట్‌కు ముందే కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎగిరి గంతేసే న్యూస్ చెప్పింది. గురువారం జరిగిన కేంద్రమంత్రివర్గ భేటీలో 8వ వేతన సంఘం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్ల కరవు భత్యం 53 శాతానికి పెరిగిన తరుణంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. 8వ వేతన సంఘం ఎప్పుడు వేస్తారా.. అని కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లు చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు దీనిపై మోడీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త వేతన సంఘం అమలుకు సంబంధించి పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినప్పుడల్లా ప్రభుత్వం అలాంటి ప్రతిపాదనలేమీ లేవని చెబుతూ వచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు హఠాత్తుగా 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

గురువారం ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇందులో కొత్త వేతన సంఘంఏర్పాటుకు సమావేశంలో నిర్ణయం తీసు కున్నట్లు మంత్రి తెలిపారు. కమిషన్ >>2

# ఇక జోరుగా ఆర్థిక వృద్ధి


### 2047నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యం
### విద్యుత్ రంగంలో భారీ సంస్కరణలు
### గేమ్ ఛేంజర్‌గా మారనున్న 'పి-4': సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ మార్చడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.ప్రస్తుతం రూ.2.6లక్షలుగా ఉన్న తలసరి ఆదాయం, అప్పటికి రూ.58.14లక్షలు అవుతుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎపిజిఎస్డిపి ఫస్ట్ అడ్వాన్స్ ఎస్టిమెట్ 2024- 25పై సిఎం మీడియాతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తూ మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో అమరావతిని భ్రష్టుపట్టించారన్నారు వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి, పోలవరం నిర్మాణం ఆగిపోయాయన్నారు.

90లలో వచ్చిన ఆర్థిక, ఐటీ సంస్కరణలు అందిపుచ్చుకున్నామని వ్యాఖ్యానించారు. వాటిని ఆచరించి రెండో దశ సంస్కరణలు అమలు చేశామన్నారు. విద్యుత్, ఓపెన్ స్కై పాలసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు ఇలా వేర్వేరు మోలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. వీటన్నిటి వల్లే సంపద వచ్చింది, ఆదాయం పెరిగిందని గుర్తు చేశారు. పాలనలో టెక్నాలజీని సమన్వయం చేశామన్న సిఎం ఇప్పుడు ఐటీ ప్రజలను అగ్రపథాన నిలుపుతోందని తెలిపారు. సంపద సృష్టిస్తాం, ఆదాయం పెంచుతామని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి వల్ల సంపద వచ్చి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని, ఆదాయం పెరిగితే పథకాల ద్వారా పేదరికం నిర్మూలించవచ్చని తెలిపారు.ఈ లక్ష్యంతోనే తమ ప్రభుత్వం విద్యుత్, ఓపెన్ స్కై పాలసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు ఇలా వేర్వేరు మోలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. పాలనలో టెక్నాలజీని సమన్వయం చేశామన్న సిఎం ఇప్పుడు ఐటీ ప్రజలను అగ్రపథాన నిలుపుతోందని తెలిపారు. సంపద సృష్టిస్తాం, ఆదాయం >>2




# ఉపగ్రహాల అనుసంధానం సక్సెస్



రోదశీలో రెండు ఉపగ్రహాల అనుసంధానం దృశ్యం

### శ్రీహరికోటలో మూడో లాంచ్‌ప్యాడ్‌కు కేంద్రం ఆమోదం
### రూ. 3985 కోట్లతో నిర్మాణం

**శ్రీహరికోట (తడ), జనవరి 16 ప్రభాతవార్త:** గగనతలంలో మరోసారి ఇస్రో గేమ్ ఛేంజర్ అయింది. ఒకేరోజు భారత జాతి మొత్తాన్ని ప్రపంచం తమ వైపు తిప్పుకునేలా చేసింది. గత నెల 30వ తేదీన శ్రీహరికోట నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి60 రాకెట్ రెండు ఉపగ్రహాలను రోదశిలోకి ప్రవేశపెట్టింది. వాటి అనుసంధాన ప్రక్రియ కొంత ఆలస్యమైనప్పటికీ గురువారం దిగ్విజయంగా ఆ ఘట్టాన్ని మన శాస్త్రవేత్తలు పూర్తి చేశారు. మూడురోజుల ముందే ఇస్రో నూతన సారధిగా బాధ్యతలు >>2

## నేడు మంత్రివర్గ సమావేశం

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నేడు ఏపీ కేబినెట్ భేటీ జరగనుంది. రేపు ఉదయం 11 గంటలకు క్యాబినెట్ సమావేశం ప్రారంభమవుతుంది. అయితే ఈ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలను తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం పైన భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన నాటి నుండి చెబుతున్న >>2

## విశాఖ స్టీల్‌కు కేంద్రం
# భారీ ప్యాకేజి!

### రూ. 11,500 కోట్ల ఆర్థిక సాయానికి కేబినెట్ ఆమోదం

**విశాఖపట్నం జనవరి 16 ప్రభాతవార్త:** విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్ల ఆర్థిక ప్యాకేజి ప్రకటిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్యాకేజి నిధుల రూపంలో కాకుండా, సాంకేతిక సహాయంగా అందించనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ప్లాంట్‌లో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉన్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా రెండే పనిచేస్తున్నాయి. ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు, కొత్తగా మూడు ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేసులు ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఒక్కో ఫర్నేస్ ఏర్పాటుకు సుమారు రూ.2,500 నుండి రూ.3,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా. మొత్తం రూ.7,500 కోట్ల వ్యయంతో ఈప్రాజెక్టును చేపట్టనున్నారు.
ఈ ప్రతిపాదన ప్రకారం, ఉత్పత్తి సామ >>2



17-01pg2exHMNWJQE.qxd:17-01pg2exHMNWJQE.qxd 01/01/01 9:27 AM Page 1





గురువారం ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా సందర్భంగా భారీ స్థాయిలో జరిగిన భక్తుల పుణ్యస్నానాల దృశ్యం

# ఇక జోరుగా ఆర్థిక వృద్ధి

>> పెంచుతామని చంద్రబాబు అన్నారు. అభివృద్ధి వల్ల సంపద వచ్చి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని, ఆదాయం పెరిగితే పథకాల ద్వారా పేదరికం నిర్మూలించవచ్చని తెలిపారు.

టిడిపి పాలనలో 13.5 శాతం గ్రోత్ ఉంది.. ఇకపై ఈ గ్రోత్ రేట్ 15 శాతం పెంచాలని చూస్తున్నాం. 2047 నాటికి ఈ వృద్ధి సాధిస్తే 58 లక్షల14 వేలు 916 కోట్ల తలసరి ఆధాయం సాధిస్తాం. ఏపీ నుంచి అమెరికా వెళ్లిన వారు అక్కడి వారి కన్నా ఎక్కువ సంపాదిస్తున్నారు. ఆ ఎన్విరాన్మెంట్ ఇక్కడ కూడా కల్పిస్తే మన ఆదాయం కూడా భారీగా పెరుగుతుంది. వృద్ధిరేటును డబుల్ చేస్తే నాలుగున్నర రెట్లు ఆదాయం పెరిగిపోతుంది. గత ఏడాది కంటే ఈ ఏడు 4.03 శాతం వృద్ధి రేటు పెరిగింది. 1 శాతం ఆదాయం పెరిగితే ఏటికేడు ఆధాయంలో పెరుగుదల వస్తుంది. ఈ ఏడాది గ్రోత్ రేటు 12. 94శాతం పెరిగింది. రాష్ట్ర సొంత ఆదాయం, అటు ఎఫ్ఆర్‌బీఎం కూడా ఇలా వెళితే భారిగా పెరుగుతుంది. ఈ వృద్ధి రేటు సాధించకపోతే అప్పు చేయాలి అప్పుడు డెట్ ట్రాప్‌లోకి వెళ్లిపోతాం. ఆదాయం పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. గత ఏడాది వృద్ధి రేటు 8.20 ఉంటే ఇప్పుడు 12.94 శాతంకు చేరింది. ఆల్ ఇండియా గ్రోత్ కంటే 3.24 శాతం అధనంగా గ్రో అయ్యాయి. 2019-24 కాలంలో పర్ క్యాపిటా ఇన్ కం కూడా పడిపోయింది.స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ద్వారా రాష్ట్ర ప్రగతికి ప్రణాళికలు చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి, వారి కుటుంబం అన్న స్థాయిలో పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. సామాజిక సంక్షేమం కోసం పెన్షన్లు పెంచి ఇస్తున్నామని గుర్తు చేసారు. కుటుంబ వ్యవస్థ భారత్‌లో బలంగా ఉందన్న ముఖ్యమంత్రి ప్రతీ ఇంటినీ జియో ట్యాగింగ్ చేయడంతో పాటు ప్రతీ వ్యక్తిని అనుసంధానం చేస్తున్నామని తెలిపారు స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ద్వారా రాష్ట్ర ప్రగతికి ప్రణాళికలు చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతీ వ్యక్తి, వారి కుటుంబం అన్న స్థాయిలో పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. సామాజిక సంక్షేమం కోసం పెన్షన్లు పెంచి ఇస్తున్నామని గుర్తు చేసారు. కుటుంబ వ్యవస్థ భారత్‌లో బలంగా ఉందన్న ముఖ్యమంత్రి ప్రతీ ఇంటినీ జియో ట్యాగింగ్ చేయడంతో పాటు ప్రతీ వ్యక్తిని అనుసంధానం చేస్తున్నామని తెలిపారు.ప్రతీ వ్యక్తి , కుటుంబం, సమాజం ఆనందంగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. అందుకే పి4 విధానం అమలు చేయాలని నిర్ణయించామన్నారు. పి4 ఒక గేమ్ ఛేంజర్ అవుతోందని పేర్కొన్నారు. గతంలో పి3 సంపద సృష్టికి ఉపయోగపడిందని గుర్తు చేసారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగిందన్నారు. ప్రతీ అంశంలోనూ ప్రజలను భాగస్వాములను చేస్తామని తెలిపారు.

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌కు 16 లక్షల మంది స్పందించారని జాతీయ విజన్ డాక్యుమెంట్‌కు కూడా అన్ని స్పందనలు రాలేదన్నారు. దాని ఆధారంగానే 10 సూత్రాలు రూపొందించామని తెలిపారు. ఎపికి పోలవరం జీవనాడి అని.. కానీ వైసీపీ హయాంలో పోలవరాన్ని గోదావరిలో కలిపేశారని మండిపడ్డారు. గత పాలకులు రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలో వైసీపీ హయాంలో వ్యవస్థలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. రాష్ట్రానికి రావాలంటే భయపడ్డారన్నారు. పారిశ్రామిక వేత్తలను కూడా భయపెట్టారని తెలిపారు. సంపద సృష్టించి, ఆదాయాన్ని పెంచుతామని.. ఆదాయం పెరిగితే పేదవాళ్లకు సంక్షేమ పథకాలను అమలు చేసి పెద్దవాళ్లను పైకి తీసుకురావచ్చని చెప్పుకొచ్చారు. అప్పట్లో ఆర్థిక సంస్కరణలు ఫలితాలను ఇచ్చాయన్నారు. తాను వాటిని మనసా వాచా నమ్మానన్నారు. విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి వెలుగులు పెంచానని.. కానీ తాను అధికారాన్ని కోల్పోయానని తెలిపారు. ఐటీని తీసుకువచ్చానని.. ఈరోజు ఐటీ అనేక కుటుంబాల్లో జీవనోపాధి కలిపించిందన్నారు. హైదరాబాద్.. ఇండియాలో నెంబర్ 1 అయ్యి తెలంగాణకు బ్యాక్ బోన్‌గా మారిందని.. తెలంగాణకు హైదరాబాద్ ద్వారా అత్యధిక తలసరి ఆదాయం వస్తుందన్నారు. ఐటీ తిండి పెడుతుందా అని చాలా మంది ఎగతాళి చేశారని.. ఐటీ ఇప్పుడు ఎక్కడికో తీసుకెళ్తోందన్నారు. ఆర్థిక సంస్కరణలు అప్పట్లో వేరే మార్గం లేకుండా చేశారని.. అయితే రెండో తరం సంస్కరణలను తాను మొదలుపెట్టినట్లు తెలిపారు. పవర్ సెక్టార్ రిఫార్మ్స్, విమానాశ్రయాలకు ఓపెన్ స్కై పాలసీ, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, రోడ్లకు శ్రీకారం చుట్టామన్నారు. నెల్లూరు నుంచి చెన్నైకి తరువాత గోల్డెన్ క్వార్డలైటర్‌లు వచ్చాయని... సంపద వచ్చింది ఆదాయం పెరిగిందని తెలిపారు. నేను పెన్షన్ పెంచాను.. దీని వలన వారిని చూసేందుకు పిల్లలు ముందుకు వస్తున్నారు. మనుషలను మనుషులుగా ట్రీట్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులను అందరినీ కనెక్ట్ చేస్తున్నాను. ఇల్లు అన్నింటికీ జియో ట్యాగింగ్ చేయిస్తున్నాను. ఎందుకంటే ఇవన్నీ కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలు కోసమే. పి4 అనేది ఒక గేమ్ చేంజర్‌గా మారుతుంది. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన వారు అట్టడుగు స్థాయి ఉన్నవారిని పైకి తీసుకురావాల్సి ఉంటుంది. ఇందుకోసం జీఎస్‌డీపీ ముఖ్యం. నేను అనుకున్న లక్ష్యానికి భవిష్యత్తులో రీచ్ అవుతాము. మేము తయారు చేసిన విజన్ డాక్యుమెంట్‌పై 16 లక్షల మంది తమ అభిప్రాయాలను ఇచ్చారు. చివరకు కేంద్రం వికసిత భారత్‌కు కూడా అన్ని అభిప్రాయాలు రాలేద్ను అని ముఖ్యమంత్రి అన్నారు.

తలసరి ఆదాయం 58 లక్షల కోట్ల మేర పెరిగే అవకాశం ఉంది. ప్రజలకు ఇవన్నీ అర్థం కాకపోయినా వారి జీవన ప్రమాణాలతో ముడిపడి ఉన్న అంశం ఇది అని సిఎం పేర్కొన్నారు. ప్రస్తుతం జీఎస్డీపీ రూ. 16,06,109 కోట్లుగా ఉంది.. 12.94 శాతం వృద్ధిరేటు ఉంది. 2014-19 మధ్య 13.5 శాతం వృద్ధి రేటు నమోదు అయ్యింది. 2019-24 మధ్య అది 10.93 శాతానికి మాత్రమే పరిమితం అయిందని సిఎం చంద్రబాబు తెలిపారు. జాతీయ వృద్ధి రేటుతో పోలిస్తే ఎపి వృద్ధి రేటు 2.8 శాతం ఎక్కువగా నమోదు అయిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రస్తుత ధరల ప్రకారం 3,169 డాలర్ల తలసరి ఆదాయం ఉందని చెప్పారు. ప్రస్తుత ధరల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2,68,653 తలసరి ఆదాయం నమోదు అయిందన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో 15.86 వృద్ధి నమోదు అయ్యింది. ఆక్వా కల్చర్ రంగంలోనూ ఎక్కువ వృద్ధి నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దేశంలో జనాభా తగ్గుతోంది. సౌత్ ఇండియా జనాభాలో డేంజర్ జోన్‌లో ఉంది. సంపద కాదు జనాభాను కూడా సృష్టించాలన్నారు. సంపదతో పాటు జనాభా సృష్టి జరగాలని సీఎం పేర్కొన్నారు.

# కేంద్రం గ్రీన్‌సిగ్నల్

>> చైర్మన్‌ను త్వరలోనే నియమిస్తామన్నారు. ఈ కమిషన్ వచ్చే యేడాది అంటే 2026 నాటికి తన నివేదికను సమర్పిస్తుందని తెలిపారు.

**2016లో అమల్లోకి వచ్చిన 7వ వేతన సంఘం..**

పే కమిషన్ చరిత్రను పరిశీలిస్తే.. 7వ వేతన సంఘం కంటే ముందు ప్రతి 10 సంవతర్సాలకు ఒకసారి 4వ,5వ, 6వ వేతన కమిషన్‌ల కాలవ్యవధి సమానంగా 10 సంవత్సరాలు ఉండేది. ప్రస్తుతం అమలులో ఉన్న 7వ వేతన సంఘం.. 2016లో అమలులోకి వచ్చింది. 2025 డిసెంబరుతో 10 సంవత్సరాలు పూర్తవుతుంది. అయితే ఈ గడువు కంటే ముందే.. ప్రభుత్వం ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

**కొత్త పే కమిషన్‌లో కనీస వేతనం ఎంత..?**

8వ వేతన సంఘం అమల్లోకి వచ్చిన తర్వాత కేంద్ర ఉద్యోగుల జీతాలు భారీగా పెరిగే అకాశం ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ కనీసం 2.86గా నిర్ణయించే అవకాశం ఉంటుందట. ఇదే జరిగితే, ఉద్యోగులు కనీస బేసిక్ జీతంలో పెరుగుదల భారీగా ఉంటుంది. అంటే కనీసం.. రూ. 51,480 ఉండొచ్చు. ప్రస్తుతం కనీస మూల వేతనం రూ. 18,000 ఉంది. దీంతోపాటు.. పెన్షనర్ల కనీస పెన్షన్ ప్రస్తుతం ఉన్న రూ. 9,000 నుంచి రూ. 25,740 కి పెరిగే అవకాశం ఉంది. కేంద్ర ఉద్యోగుల వేతనాన్ని నిర్ణయించడంలో ఈ ఫిట్‌మెంట్ అంశం కీలక పోషిస్తుండడం గమనార్హం. 7వ వేతన సంఘం లెక్కలను పరిశీలిస్తే, ఉద్యోగులకు అందే అన్ని అలవెన్సులు కాకుండా బేసిక్ జీతం, ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ ఆధారంగా వారికి అందే మొత్తం జీతం నిర్ణయించబడుతుంది.

**7వ వేతన సంఘం అమలు వల్లే..**

2016 జనవరి నుంచి నరేంద్రమోడీ నేతృత్వంలోని ప్రభుత్వం 6వ వేతన సంఘం సిఫార్సులకు బదులు 7వ వేతన సంఘం సిఫారసులను అమలులోకి తెచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సంఘం కింద 2.57 ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ వర్తించబడింది. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల బేసిక్ శాలరీ 2.57తో గుణించబడుతుంది. ఇది ఉద్యోగుల ప్రాథమిక వేతనంలో 2.57 శాతం పెరుగుదలకు సమానం. మునుపటి పే కమిషన్‌లో ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 1.86. ఇది ప్రభుత్వ ఉద్యోగుల మూల వేతనంలో 1.86 శాతం పెరుగుదల ఉంది.

# భారీ ప్యాకేజి!

>> ర్థ్యాన్ని పెంచి, అంతర్జాతీయ మార్కెట్లో నాణ్యమైన ఉక్కును ఎగుమతి చేయాలనే లక్ష్యం ఉంది. ఇప్పటికే సిఎం చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యి, స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక సహాయం కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్రం శుక్రవారం అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. అయితే, కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు ఈ ప్యాకేజీపై మిశ్రమ స్పందన వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌కు ఇది కొత్త ఊపిరి ఇస్తుందనేవారి కంటే, దీని వల్ల ప్రైవేటీకరణకు మార్గం సుగమమవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు. ప్రధాని మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా ఈ ప్యాకేజీపై స్పష్టత రానున్నట్టు సమాచారం. ఈ నిర్ణయం ప్లాంట్ భవిష్యత్తుపై ఎంతవరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. దీనిపై స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకుడు అయోధ్య రామ్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంటుకు ఆర్థిక సహకారం కాకుండా సెయిల్‌లో విలీనం చేయటం ఒకటే మార్గమని అన్నారు.

# కృష్ణా జలాల పంపిణీలో ఎపికి ఊరట

**విజయవాడ.జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా నది జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. నీటి వాటాల పంపిణీపై కృష్ణా నదీ జలాల ట్రిబ్యునల్‌లో ఉపశమనం లభించింది. ఈ విషయంలో ఎపి వాద నలతో ట్రిబ్యునల్ ఏకీభవించింది. 2023 ఆర్డినెన్స్ ప్రకారం నీటి కేటాయింపులపై.. విడివిడిగా వాదనలు వినేందుకు ట్రిబ్యునల్ సమ్మతి తెలిపింది. ఫిబ్రవరి 19, 20, 21 తేదీల్లో మూడు రోజులపాటు.. రాష్ట్ర వాదనలు వినేందుకు ట్రిబ్యునల్ అంగీకారం తెలిపింది.

తొలుత విభజన చట్టంలోని సెక్షన్ 89 మేరకు.. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై వాదనలు వినిపించారు. 811 టిఎంసిల్లో ఎపి వాటా 512 టిఎంసిలను కొనసాగించాలన్న ఎపి వాదనలు వినేందుకు ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. అయితే, ఈ మొత్తం నీటిలో తెలంగాణకు 299 టిఎంసిలు మాత్రమే దక్కుతాయని ఎపి వాదనలు వినిపించ నుంది.



న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వద్ద సింగపూర్ అధ్యక్షుడు షణ్ముగరత్నం దంపతులకు స్వాగతం పలుకుతున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ

# భారీ ఎన్‌కౌంటర్

## 19 మంది మృతి
## మృతుల్లో పలువురు మావోయిస్టు అగ్రనేతలు

**చర్ల, జనవరి16, ప్రభాతవార్త :** తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ అటవీ ప్రాంతంలో గురువారం మావోయిస్టులకు భద్రతా బలగాల మధ్య హోరాహోరీ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 19 మంది మావోయిస్టులు మృతిచెందారు. తెలంగాణ సరిహద్దుకు కూత వేటు దూరంలో ఉన్న పూజరి కాంకేర్ అటవి ప్రాంతంలో మావోయిస్టులు సమావేశం అయ్యారన్న పక్కా సమాచారంతో చత్తీస్‌గఢ్ చెందిన డిఆర్జీ ఎస్టీఫ్ సిఆర్‌పిఎఫ్ కోబ్రా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టుల రహస్య ప్రాంతాన్ని చుట్టు ముట్టిన బలగాలు వారి రాకను గమనించిన మావోలు తప్పించుకునే క్రమంలో భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు సైతం కాల్పులకు దిగారు. ఇరువురి మధ్య హోరాహోరీగా జరిగిన ఎదురుకాల్పుల్లో 19 మంది మావోయిస్టులు మృతిచెందగా మరి కొంత మంది గాయాలపాలైనట్లు తెలిసింది. గడిచిన నెలరోజుల వ్యవధిలో వరుసగా ఎన్ కౌంటర్లు చోటుచేసుకున్నాయి. ఏడాది కాలంలో భద్రతా బలగాలు జరిపిన దాడిలో సుమారు 220 మావోయిస్టులు మృతిచెందగా అనేక మంది లొంగిపోయారు. మావోయిజాకన్ని రెండేళ్లలో కూకటివేళ్లతో పెకిలి స్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చత్తీస్‌గఢ్ ముఖ్య మంత్రి విష్ణుదేవ్ సాయి ప్రకటించిన విధంగానే భద్రతా బలగాలు దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి. ఏడాది కాలంగా మావోయిస్టు లపై పట్టు సాధిస్తున్న బలగాలను ఎలాగైనా ఎదురుదెబ్బ తియ్యాలని భావించిన మావోలు ఐఇడి పేల్చి తొమ్మిది మందిని హతమర్చారు. ఈ ఘటనలో ఎనిమిది మంది డిఆర్జీ బలగాలతో పాటు వాహన డ్రైవర్ మృతిచెందిన సంఘటన తెలిసిందే. మావోయిస్టు చర్యలకు ధీటుగా బదులిస్తామని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ప్రకటిం చిన పదిరోజుల్లోనే పూజర్ కాంకేర్ అటవి ప్రాంతంలో గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో 19 మందిని హతమర్చడం తీవ్ర చర్చంశనీయాంశం అయ్యింది.



# రేపు, ఎల్లుండి రాష్ట్రంలో అమిత్‌షా పర్యటన

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రెండు రోజుల పర్యటించను న్నారు. ఈ నిమిత్తం ఈ నెల 18వ తేదీన ఆయన విజయవాడ (గన్నవరం) విమానాశ్ర యానికి రాబోతున్నారని గురువారం బిజెపి ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా 18వ తేదీ రాత్రి ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోను న్నారు. ఆ రోజు రాత్రి ఉండవల్లిలోని సిఎం చంద్రబాబు నివాసంలో భేటీ అవుతారని.. అనంతరం విజయవాడలోని హోటల్లో బస చేయనున్నారు. 19వ తేదీన కృష్ణా జిల్లా, గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడిఎం ప్రాంగణాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు.

# పాకల సముద్రతీరంలో విషాదం

## సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి

### ఒకరు గల్లంతు, ఒకరిని కాపాడిన మత్స్యకారులు

**సింగరాయకొండ,జనవరి 16,ప్రభాతవార్త:** సరదాగా స్నానం చేసేందుకు వెళ్లి ముగ్గురు మృతి చెంది ఒకరు గల్లంతై, ఒకరిని కాపాడిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, మెరైన్ పోలీసులు తెలిసిన వివరాల మేరకు పొన్నలూరు మండలం , తిమ్మపాలెం గ్రామం శివన్న పాలెంకి చెందిన నోసిన జెస్సికా (15),నోసిన మాధవ (25),నెల్లూరు జిల్లా కందుకూరు మండలంకు చెందిన కల్లగుంటకు చెందిన కొండాబత్తిన యామిని (16)తో కలిసి సంక్రాంతి సంబరాలను ఘనంగా ముగించుకొని గురువారం ఉదయం సింగరాయకొండ మండల పరిధిలోని పాకల సముద్ర తీరంలో సముద్ర స్నానానికి బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో సముద్రంలో అలలు తాకిడితో ఉత్సాహంగా మునిగే సమయంలో అలల ఉధృతి ఎక్కువ కావడంతో నలుగురు గల్లంతయ్యారు. వీరిలో ఒకరిని స్థానిక మత్స్యకారులు సహాయంతో కాపాడారు. వీరిలో ఇద్దరు మహిళలు,ఒక యువకుడి మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. వీరిలో గల్లంతైన ఇంకో యువకుడు సింగరాయకొండ వడ్డిపాలెంకి చెందిన తమ్మిశెట్టి పవన్‌కకుమార్‌గా గుర్తించారు. ఈ గల్లంతైన యువకుడు కోసం మెరైన్ పోలీసులు స్థానిక మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతి చెందిన వారిలో పొన్నలూరు మండలం తిమ్మపాలెం పంచాయతీకి చెందిన జెస్సిక, నోసిన మాధవ, కొండాబత్తిన యామిని ఈ ముగ్గురుని ఒడ్డుకు చేర్చారు. ఈ ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన బంధువులుగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సిఐ హజరత్తయ్య సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి తక్షణ చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన ముగ్గురును పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సముద్రంలో గల్లంతైన తమ్మిశెట్టి పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సింగరాయకొండ పట్టణానికి వచ్చారు. తమ్మిశెట్టి అంకమ్మకు ఒక్కగానొక్క కుమారుడు పవన్‌కుమార్‌కు ఇటీవల ఉద్యోగం కూడా వచ్చిందని ఒక్కగానొక్క కుమారుడు సముద్రంలో గల్లంతు కావడంతో బోరున విలపిస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 17-01-2025, శుక్రవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
చవితి తె.5.31
మఖ మ.12.44
వర్జ్యం : రా.9.26-11.10
దు.ఉ.9.03-9.48, 2) మ.12.47-1.32
శుభసమయం: ఉ.7.00-8.00
మ.4.50-5.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. వివాదాలకు దూరంగా వుండండి. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**వృషభం:** కోర్టుకు సంబంధిత విషయాలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. గృహం కొనుగోలు యత్నాలు.

**మిథునం:** కొత్త వ్యాపారాలను ప్రారంభించానికి గాను కావలసిన వనరులను సమకూర్చుకొనే యత్నాలను ప్రారంభిస్తారు.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**సింహం:** మనోనిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు.

**కన్య :** బంధుమిత్రుల సలహాలు తీసుకొంటారు. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. వాహనయోగం.

**తుల :** కుటుంబసభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి

**వృశ్చికం:** పొగడ్తలకు లొంగిపోతారు. వాటి వెనుక దాగి ఉన్న లోగుట్టును పసిగట్టరు. సోదరుల కలయిక.

**ధనుస్సు:** విద్యా వాణిజ్యరంగములలో ప్రోత్సాహకర వాతావరణము నెలకొంటుంది. మానసిక ప్రశాంతత.

**మకరం:** అతిథి మర్యాదలకు అధికంగా ఖర్చు చేస్తారు. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు.

**కుంభం:** పిల్లలకు వివాహ విషయముల ప్రస్తావన వస్తుంది. రహస్య సమాచారము తెలుస్తుంది.

**మీనం :** తత్ సంబంధీకుల స్వతంత్ర నిర్ణయములు ఇబ్బందిని కలిగించవచ్చును.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అనుసంధానం సక్సెస్

>> చేపట్టిన నారాయణన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగింది. బుధవారం 3985 కోట్ల రూపాయలను శ్రీహరికోటలో మూడవ లాంచ్ ప్యాడ్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర క్యాబినేట్ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టుతో భవిష్యత్‌లో అతి పెద్ద ఉపగ్రహాలను మన రాకెట్ల ద్వారా ప్రయోగించడానికి ఉపయోగం ఏర్పడుతుంది. ఇప్పటికే ఇక్కడ రెండు లాంచ్ ప్యాడ్లు ఉన్నాయి. భవిష్యత్ అవసరాల కోసం మూడవది ఏర్పాటు చేస్తున్నారు. సూళ్లూరుపేట, శ్రీహరికోటతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇప్పటి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని, భారీ ప్రాజెక్టులు వస్తాయని నమ్ముతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో రూ.3,985 కోట్ల పెట్టుబడితో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. అంతరిక్ష మౌలిక సదుపాయాల్లో దేశానికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. మొదటి, రెండో లాంచ్ ప్యాడ్లను పరిశీలిస్తే, ఈ రెండింటి కంటే ఇది చాలా ఎక్కువ సామర్థ్యాన్ని కలిగి ఉంది. కొత్త లాంచ్ ప్యాడ్ ఇస్రో నెక్ట్స్ జనరేషన్ లాంచ్ వెహికల్స్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీహరికోటలో ప్రయోగ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, రెండో లాంచ్ ప్యాడ్‌కు బ్యాకప్‌గా పనిచేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ కొత్త లాంచ్ ప్యాడ్ భవిష్యత్తులో భారత మానవ అంతరిక్ష యాత్రలకు ఇస్రో సామర్థ్యాన్ని పెంచుతుందని, నాలుగేళ్లలో ఇది పూర్తవుతుందని ప్రభుత్వ ప్రకటన తెలిపింది. మూడో లాంచ్ ప్యాడ్ కేవలం నెక్ట్స్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జిఎల్‌వి) మాత్రమే కాకుండా సెమీ క్రయోజనిక్ స్టేజ్‌తో లాంచ్ వెహికల్ మార్క్ 3 (ఎల్వీఎం3) వాహనాలకు, అలాగే ఎన్జీఎల్వీ యొక్క స్కేల్‌అప్ కాన్ఫిగరేషన్లను సపోర్ట్ చేసేలా డిజైన్ చేయబడుతుంది. ఈ ప్రాజెక్టులో విస్తృతమైన పరిశ్రమ భాగస్వామ్యం ఉంటుంది. మునుపటి లాంచ్ ప్యాడ్లను ఏర్పాటు చేయడంలో ఇస్రో అనుభవాన్ని ఉపయోగించడం, ఇప్పటికే ఉన్న లాంచ్ కాంప్లెక్స్ సౌకర్యాలను గరిష్ఠంగా ఉపయోగించడం కూడా ఇందులో భాగం. ఇస్రో స్పాడెక్స్ మిషన్ ఇస్రో తన స్పేస్ డాకింగ్ ఎక్స్ పెరిమెంట్ (స్పాడెక్స్)లో భాగంగా ఉపగ్రహాల డాకింగ్‌ను విజయవంతంగా నిర్వహించింది. డాకింగ్ తరువాత రెండు ఉపగ్రహాలను నియంత్రించడం విజయవంతమైందని సంస్థ ధృవీకరించింది. అంతరిక్ష చరిత్రలో భారత్ పేరు మార్మోగిపోయింది. గుడ్ మార్నింగ్ ఇండియా ఇస్రో స్పాడెక్స్ మిషన్ చారిత్రాత్మక విజయాన్ని సాధించింది. ఈ క్షణాన్ని చూసినందుకు గర్వంగా ఉంది అని ఎక్స్‌లో ఇస్రో తెలిపింది. దీంతో అమెరికా, రష్యా, చైనా తర్వాత శాటిలైట్ డాకింగ్ ను విజయవంతంగా నిర్వహించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. శాటిలైట్ డాకింగ్ పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమనౌకలను ఉపయోగించి స్పేస్ డాకింగ్‌ను పూర్తి చేసింది. అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన సాంకేతిక ప్రదర్శన స్పాడెక్స్ మిషన్ అని ఇస్రో తెలిపింది. అంతరిక్షంలో భాగస్వామ్య లక్ష్యాలను సాధించడానికి బహుళ రాకెట్ ప్రయోగాలు అవసరమయ్యే మిషన్లకు డాకింగ్ టెక్నాలజీ కీలకం. అంతకు ముందు జనవరి 12న ఇస్రో రెండు వ్యోమనౌకలను ఒకదానికొకటి మూడు మీటర్ల దూరంలోకి తీసుకువచ్చి సురక్షిత దూరానికి తరలించే ప్రయోగాన్ని నిర్వహించింది. ఇస్రో 2024 డిసెంబర్ 30న స్పాడెక్స్ మిషన్ను ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి 24 పేలోడ్లతో ఎస్డీఎక్స్01 (ఛేజర్), ఎస్డీఎక్స్ 02 (టార్గెట్) అనే రెండు చిన్న ఉపగ్రహాలను మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. నింగిలోకి దూసుకెళ్లిన 15 నిమిషాల తర్వాత 220 కిలోల బరువున్న రెండు వ్యోమనౌకలను ప్రణాళిక ప్రకారం 475 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టారు.

**ఇస్రో సరికొత్త రికార్డు**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో నూతన ఏడాది ప్రారంభంలోనే మరో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఇటీవల నింగిలోకి పంపిన రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసింది ఇస్రో. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి అయినట్లు ఇస్రో ఈరోజు (గురువారం) ఎక్స్ వేదికగా వెల్లడించింది. గత డిసెంబర్ 30న షార్ నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సీ 60 పీఎస్ఎల్వీలో జంట ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపించింది. ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ బయలుదేరిన 15 గంటల 9 నిమిషాలకు స్పేడెక్స్ 1బీ, 15 గంటల12 నిమిషాలకు స్పేడెక్స్ 1ఏ రాకెట్ నుంచి విడిపోయాయి. ఆ తరువాత వీటి డాకింగ్ కోసం మూడు సార్లు ప్రయత్నించగా పలు కారణాల వల్ల ఇది వాయిదా పడుతూ వచ్చింది. చివరకు గురువారం వీటి అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. ఈ క్రమంలోనే రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్ల నుంచి 3 మీటర్లకు తీసుకువచ్చారు. అక్కడ ఉపగ్రహాలను హోల్డ్ చేసి డాకింగ్‌ను మొదలుపెట్టారు. ఇది విజయవంతం అయినట్లు ఇస్రో తమ పోస్టులో తెలియజేసింది. దీని కోసం శ్రమించిన సాంకేతిక బృందానికి, యావత్ భారతీయులకు అభినందనలు తెలిపింది. ఇప్పటి వరకు చైనా, రష్యా, అమెరికా మాత్రమే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేస్తున్నాయి. ఈ ప్రయోగంతో ఈ తరహా సాంకేతికతలో భారత్ కూడా వాటి సరసన చేరింది. మొత్తానికి ఇస్రో మరో మైలురాయి చేరింది. రెండు ఉపగ్రహాలను సాంకేతికంగా అనుసంధానం చేసే వరుసలో భారత్ చేరింది. అంతరిక్షంలో స్పేడెక్స్ డాకింగ్ అనేది శాస్త్ర, సాంకేతికపరంగా చాలా క్లిష్టమని చెప్పుకోవచ్చు. కానీ ఇస్రో మాత్రం స్పేడెక్స్ డాకింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసి అంతరిక్షంలో రెండు శాటిలైట్స్‌ను దగ్గరకు చేర్చి మరోసారి ప్రపంచ దేశాలకు భారత్ సత్తా ఏంటో చూపించింది. చైనా, రష్యా, అమెరికా సరసన భారత్‌ను చేర్చడం గర్వకారణం. దాదాపు వందకిలోల మీటర్ల వేగాన్ని ఒక్కసారిగా 0.013 కిలోమీటర్ల వేగానికి తగ్గించి అనుసంధానం చేయాల్సి ఉంటుంది. 220 కేజీల బరువున్న ఒక్కో శాటిలైట్‌ను ఒక్కచోటకు చేర్చి కలిపారు. రెండు ఉపగ్రహాలను ఒకదగ్గరకు చేర్చడంలో ఇస్రో సక్సెస్ అవడంతో ఇస్రోలో సంబరాలు చేసుకుంటున్నారు. గగనంలో అద్భుత ప్రయోగం విజయవంతం కావడం, మరోపక్క కేంద్రం మూడవ లాంచ్ ప్యాడ్‌కు ఆమోదం తెలపడం ఇస్రో చరిత్రలో మరుపురాని ఘటనలుగా శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# నేడు మంత్రివర్గ సమావేశం

>> ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తారని అంతా భావించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఏ పండుగ వచ్చినా ఎపిలో మహిళలు ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ సంక్రాంతికి మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం అందిస్తారని భావించినప్పటికీ సంక్రాంతికి కూడా ఈ పథకాన్ని అందించలేకపోయారు.

ఇప్పుడు ప్రజలు ఉగాది పైన ఆశలు పెట్టుకున్న వేళ శుక్రవారం జరగనున్న క్యాబినెట్ భేటీలో ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం పైన చర్చ జరపనున్నారు. ఇది మాత్రమే కాకుండా రైతు భరోసా హామీలు, పలు కంపెనీలకు భూ కేటాయింపులు, వైన్ షాపుల్లో 10శాతం గీత కార్మికులకు కేటాయించటం తదితర అంశాల పైన కూడా క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు పైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న వేళ ఈ విషయం పైన కూడా క్యాబినెట్ భేటీలో మంత్రులు చర్చించనున్నారు. ఇక ఇదే సమయంలో వాలంటీర్ల వ్యవస్థను ఏపీ ప్రభుత్వం పక్కన పెట్టడంతో రేపు వాలంటీర్లు అమరావతిలో జరిగే ఏపీ క్యాబినెట్ భేటీకి వెళ్లి సీఎం చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం కూడా ఇవ్వాలని నిర్ణయించారు.

17-01Pg3exHMNWJQER.qxd:17-01Pg3exHMNWJQER.qxd 01/01/01 8:08 AM Page 1



## మౌంట్ అబూలో జర్నలిస్టుల జాతీయ మహాసభలు..

**విజయవాడ జనవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** పెన్ జాతీయ సంఘం నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ న్యూఢిల్లీ సంఘ జాతీయ మహాసభలు రాజస్థాన్ స్టేట్, మౌంట్ అబూలో నిర్వహిస్తున్నట్లు ఎన్ యు జే (న్యూఢిల్లీ) కార్యదర్శి బడే ప్రభాకర్ తెలిపారు. ఫిబ్రవరి నెల 16 నుంచి 18 వరకు 3 రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు పలువురు కేంద్ర మంత్రులు, రాజస్థాన్ స్టేట్ నేతలు, జాతీయ మీడియా ప్రతినిధులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పాత్రికేయులు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రయాణానికి సంబంధించి ఫ్లైట్/ట్రైన్ టిక్కెట్లు ముందుగా రిజర్వేషన్ చేసుకోవలసి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆ సభలకు విచ్చేసి ప్రింట్అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంఘ సభ్యులు తమ పేర్లను రెండు రోజుల్లో నమోదు చేసుకోవలసినదిగా ప్రభాకర్ పేర్కొన్నారు. వివరాలకు పెన్ సంఘ నేతలను సంప్రదించ వచ్చన్నారు. సమావేశాలు అనంతరం పర్యాటక ప్రదేశాల సందర్శన ఉంటుందన్నారు. సమావేశాలకు రాదలుచుకున్న సభ్యులు వెంటనే స్పందించి వివరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కొల్లేరు సరస్సు సరిహద్దుల వ్యవహారం..

### సుప్రీంకోర్టులో విచారణ..



**విజయవాడ జనవరి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కొల్లేరు సరస్సు సరిహద్దుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత ఏడాది డిసెంబర్లో విచారణ తరువాత చేపట్టిన కార్యాచరణను ఏపీ రాష్ట్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చింది. సరిహద్దులను వచ్చే మూడు నెలల్లో ఖరారు చేయనున్నాట్లు కోర్టుకు చెప్పింది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు సుమారు 5 వేల ఎకరాల్లో ఆక్రమణలు తొలగించినట్లు పేర్కొంది. మిగిలిన ఆక్రమణలు కూడా తొలగించే పనిలో ఉన్నట్లు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అఫిడవిట్ని పరిశీలించిన సుప్రీంకోర్టు తదుపరి నివేదిక దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది. అప్పటి లోపు మిగిలిన వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## టోకెన్ కోసం క్యూలైన్‌లో దివ్యాంగురాలు ఇబ్బంది

**- ప్రత్యేకలైన్‌లో అనుమతించని టిటిడి సెక్యూరిటీ**



**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** రండి... రండి పదిరోజుల వైకుంఠద్వార దర్శనం చేసుకోండి...సామాన్యభక్తులకు సకల సౌకర్యాలు కల్పించాం...ఆఫ్‌లైన్‌లో టిటిడి అన్ని వసతులతో టోకెన్లు అందిస్తున్నామంటూ ప్రకటనలు చేసినా క్రిందిస్థాయిలో టిటిడి సెక్యూరిటీ సిబ్బంది అమలుచేయడంలో విఫలమయ్యారు. ఇందుకు నిదర్శనంగా వైకుంఠద్వారదర్శన టోకెన్లకోసం వృద్ధులు, దివ్యాంగులను ప్రత్యేక క్యూలైన్‌లో అనుమతించాల్సి ఉన్నా తిరుపతి శ్రీనివాసంలోని టిటిడి సెక్యూరిటీ వారిని ఏమాత్రం ప్రత్యేక లైన్‌లో అనుమతించక సాధారణలైన్‌లోనే రావాలని చెప్పడంతో దివ్యాంగురాలు కుటుంబం చేసేది లేక అవస్థలు పడాల్సి వచ్చింది. చివరిరోజులుగా వైకుంఠద్వార దర్శనాలకు 18,19వతేదీ టోకెన్లు అందుకునేందుకు గురువారం భక్తులు అనూహ్యంగా శ్రీనివాసం కౌంటర్ల వద్దకు వచ్చారు. ఇక్కడ సెక్యూరిటీ సిబ్బంది బెంగుళూరునుండి వచ్చిన దివ్యాంగురాలు బృంద కుటుంబసభ్యులను ప్రత్యేకంగా వెలుపలగేట్‌ద్వారా పంపాల్సి ఉన్నా అనుమతించకపోవడం వారి ఆవేదనకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు చివరిరోజు టోకెన్లకు భక్తులు భారీగా రావడంతో చవిచూడాల్సి వచ్చింది. కొందరు సెక్యూరిటీ సిబ్బంది టిటిడి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, సిబ్బందిని ప్రత్యేకంగా లైన్లలో లోపలకు తీసుకోవడంచ,దివ్యాంగురాలికి అది వర్తించదని చెప్పడం కొసమెరుపు.



# చివరి రెండు రోజుల వైకుంఠద్వార దర్శనాలకు భారీ డిమాండ్

**- ఆఫ్‌లైన్‌లో టోకెన్లకు అనూహ్యంగా పెరిగిన భక్తులు**

**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ధనుర్మాసంలో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు చివరిరెండురోజులు భక్తుల నుండి భారీగా డిమాండ్ కనిపించింది. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్ మూడుప్రాంతాల్లో ఆఫ్‌లైన్‌లో టిటిడి వైకుంఠద్వార దర్శన టోకెన్లు జారీచేస్తున్న విషయం విదితమే. ఒకరోజు ముందు దర్శనటోకెన్లను భక్తులు అందుకునేలా చూస్తున్నారు. ఈనెల 10వతేదీ వేకువజామున వెంకన్న ఆలయంలో ఆగమోక్తంగా తెరచుకున్న వైకుంఠద్వారంలో 10వతేదీ వైకుంఠ ఏకాదశి, 11న ద్వాదశి పర్వదినాలతో బాటు మరో ఎనిమిదిరోజులు ఈ ద్వారాలను తెరచివుంచి భక్తులను అనుమతిస్తున్నారు. వరుసగా నాలుగు రోజులు సెలవులు వచ్చినా 12,13,14,15 తేదీల్లో తిరుమలకు సామాన్యభక్తులు పెద్దగా చేరుకోలేదు. పైగా ఆన్‌లైన్‌లో రోజువారీగా విడుదల చేసి భక్తులు 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు 14వేలు, శ్రీవాణి బ్రేక్ 2వేలు టిక్కెట్లు, ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో 43వేలవరకు టోకెన్లు పొందిన భక్తులు మాత్రమే ఆలయంలోనికి చేరుకుని వైకుంఠద్వార దర్శనం చేసుకునే వెసలుబాటు కలిగింది. ఇలా గతవారం రోజులు 4.73లక్షలమంది వరకు భక్తులు వైకుంఠద్వార దర్శనాలు చేసుకున్నారు. అయితే చివరగా 18,19వతేదీల్లో రెండురోజులు వైకుంఠద్వార దర్శనాలకు ఆఫ్‌లైన్‌లో టోకెన్లకు భక్తులు అనూహ్యంగా పోటెత్తారు. టిటిడి సమాచారం మేరకు ఒకరోజు ముందు దర్శన టోకెన్లు జారీచేస్తారు. అయితే అనూహ్యంగా భక్తుల రద్దీ పెరగడంతో గురువారం ఉదయం నుండి 18వతేదీకి (9వరోజు వైకుంఠద్వార దర్శనాలు)సంబంధించి టోకెన్లను నిరంతరాయంగా ఏకధాటిగా జారీచేశారు. సాయంత్రం 3.30గంటలవరకు 43వేల టోకెన్లు పూర్తిగా భక్తులు అందుకోవడంతో , ఆ తరువాత నుండి 19వతేదీ చివరిరోజు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించిన టోకెన్లు జారీ చేశారు. తిరుపతిలోని మూడు ప్రాంతాల్లో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో క్యూలైన్లలో బారులుతీరారు. సమాచారం అందుకున్న టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశాలతో ఏవిఎస్ఒ సతీష్‌కుమార్ శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవికాంప్లెక్స్ కౌంటర్ల వద్దకు చేరుకున్నారు. క్యూలైన్లలో భక్తులు సాఫీగా ముందుకు కదిలేలా, ఎక్కడా తోపులాట జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో నియంత్రించారు. క్యూలైన్ల వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు. వైద్యశిబిరాలు కొనసాగించారు. భక్తులు నిరంతరాయంగా శ్రీవారి సేవకులతో సేవలందించారు. కాగా మకరసంక్రాంతి పర్వదినాన శబరిమల అయ్యప్పస్వామి దర్శనం ముగించుకున్న స్వాములు కూడా తిరుమలకు రావడం విశేషం. పెద్దసంఖ్యలో అయ్యప్పస్వాములు తిరుమలకు చేరుకోవడం, గత నాలుగురోజులు భోగి,సంక్రాంతి, కనుమ,ముక్కనుమ పండుగల్లో తెలుగురాష్ట్రాల నుండి ,తమిళనాడు నుండి పెద్దగా భక్తులు రాకపోవడంతో క్యూలైన్లు ఖాళీగా కనిపించాయి. అంతేగాక టోకెన్లు కూడా వచ్చిన భక్తులు వచ్చినట్లే గత మూడురోజులు సంతృప్తిగా అందుకున్నారు. ఒక్కసారిగా గురువారం మధ్యాహ్నానికి తిరుపతిలో టోకెన్లు జారీకేంద్రాల వద్ద భక్తుల సంఖ్య పెరిగింది. మధ్యాహ్నం 2గంటలకు 18వతేదీ రాత్రి 11గంటల దర్శనం స్లాట్ టోకెన్లు 3వేలు మాత్రమే ఉండటంతో వాటిని జారీచేసేశారు.

### పుణ్యక్షేత్రం సమస్యల వలయంగా మారింది

## ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకోండి

### సిఎంకు విన్నవించిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

**శ్రీకాళహస్తి,జనవరి 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం సమస్యల వలయంగా మారింది. అభివృద్ధి చేద్దామంటూ మున్సిపాలిటిలో నిధుల్లేదు.దేవస్థానం నిధులు ఉపయోగించటానికి అధికారులు నిబంధనలు వర్తించవంటున్నారు. కాబట్టి శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో నభూతో అన్నట్లు ప్రజలు తెలుగుదేశం పార్టీకి 43వేల ఓట్లు మెజారిటితో గెలిపించారు. కాబట్టి ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సంక్రాంతి పండగ సంబరాల తరువాత తిరుగుపయనమైన సందర్భంగా మొరబెట్టుకున్నారు. విమానాశ్రయంలో ఎంఎల్ఏ ముఖ్యమంత్రిని కలసి వినతి పత్రం అందించారు. ముఖ్యంగా రైతులకు ఎంతో మేలు చేకూర్చే గోపాలకృష్ణారెడ్డి కలల రూపం సుమారు లక్ష ఎకరాలకు అదనపు ఆయకట్టు సదుపాయం కల్పించే 'సోమశిల-స్వర్ణముఖి' కాలువకు ఓ వైపు నిధుల కొరత, మరో వైపు భూసమస్య చోటు చేసుకుందని దానిని పరిష్కరించాలన్నారు.ఈ ప్రాజెక్టు పూర్తి అయితే శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన రైతులకు సాగునీటితోపాటు తిరుపతి ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించుటకు అవకాశం ఉంటుందని వివరించారు. శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శివరాత్రిని బ్రహ్మోత్సవాలుగా నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో మరో నెల రోజుల్లో శివయ్య పండగ వస్తుంది. కానీ పట్టణ పొలిమేరల్లోని రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో, బొక్కసం పాళెంలలో దేవాలయాలున్నాయి. అక్కడకు సరైన రోడ్డు మార్గాల్లేవు. అలాగే చరిత్ర ప్రసిద్ది చెందిన గుడిమల్లం ఆలయం ఉంది.కానీ అక్కడకు తిరుపతి,శ్రీకాళహస్తి నుంచి వెళ్ళటానికి సరైన రోడ్డు మార్గాల్లేవు.కానీ ఆర్అండ్‌బి వద్ద నిధుల్లేవంటున్నారు. కాబట్టి ప్రత్యేక నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అభ్యర్థించారు.కాగా పుణ్యక్షేత్రానికి సోలార్ ప్రాజెక్టును ప్రత్యేక నిధులతో అనుమతించాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభ్యర్థించారు.ఇక ఇటీవల భారీ వర్షాలకు చెరువులు దెబ్బతిన్నాయి.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందిస్తున్న సుధీర్‌రెడ్డి

## తెలుగు రాష్ట్రాల రైల్వే పిసిసిఎంగా రమేష్



**గుంతకల్లు రైల్వే,జనవరి 16,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్ రమేష్ బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1992బ్యాచ్‌కి చెందిన రమేష్,బ్యాచిలర్ ఆఫ్ సైన్స్,లా(బి.ఎస్సి,బి. ఏ.,ఎల్.ఎల్.బి) లలో పట్టభద్రులు,ప్రస్తుత నియామకానికి ముందు ఆయన నైరుతి రైల్వేలో చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్‌గా విధులను నిర్వర్తించారు. మూడు దశాబ్దాల తన రైల్వే కెరీర్‌లో బెంగళూరు ఆయన డివిజన్‌లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్,సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్,న్యూడిల్లీలోని రైల్వే మంత్రికి డైరెక్టర్/పబ్లిక్ గ్రీవెన్స్,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/కో-ఆర్డినేషన్,నైరుతి రైల్వేలో చీఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్,చీఫ్ కమర్షియల్ మేనేజర్,చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్ వంటి అనేక కీలక పదవులను నిర్వహించారు. ఆయన భారత ప్రభుత్వ జాయింట్ సెక్రటరీగా ఎంపానెల్ చేయబడ్డారు. 2014-2019లో రైల్వే మంత్రి వద్ద ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్/సమన్వయ అధికారిగా పనిచేస్తున్నప్పుడు వ్యయ భాగస్వామ్య ప్రాతిపదికన రైల్వే ప్రాజెక్టులను చేపట్టడానికి భారత రైల్వేలతో ఒక ఏం.ఓ.యు(అవగాహన ఒప్పందం)పై సంతకం చేయడానికి ఆయన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేయడంలో కీలకపాత్ర పోషించారు.

# మళ్లీ రాజుకుంటున్న విశాఖ ఉక్కు ఉద్యమం

## దేశవ్యాప్త ఉద్యమానికి కార్మిక సంఘాల పిలుపు

**విశాఖపట్నం, గాజువాక, జనవరి 16 ప్రభాతవార్త** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు చేసిన వివిధ ఉద్యమాలకు ఉక్కు యాజమాన్యం కానీ కేంద్ర ప్రభుత్వం కానీ స్పందించలేదు. అంతేకాకుండా ఈ నెలాఖరులోగా అధిక సంఖ్యలో ఉద్యోగులకు విఆర్ఎస్ ఇచ్చి బయటకి పంపించడానికి రంగం సిద్ధమైంది. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ సుమారు 1400 రోజులపాటు కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేసినప్పటికీ, ఉక్కు యాజమాన్యం ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. దీంతో దేశంలోని కార్మిక సంఘాలన్నీ ఏకమై దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునివ్వడం అనూహ్యపరిణామం. స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే ఇంత పెద్ద ఉద్యమానికి కార్మిక సంఘాలు పిలుపు ఇచ్చిన దాఖలాలు లేవు. గత నాలుగు నెలలుగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు లేకపోవడంతో పాటు, విఆర్ఎస్ పేరుతో కార్మికులను, ఉద్యోగులను స్టీల్ యాజమాన్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీంతో విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు దేశంలోని ప్లాంట్ల సంఘాల నాయకులను కూడదీసి దేశవ్యాప్త ఉద్యమానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా సిఐటియు జాతీయ ప్రధానకార్యదర్శి తపన్సేన్ ఆధ్వర్యంలో కోల్కతాలో శుక్రవారం కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తప్పన్ సేన్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పై కేంద్ర ప్రభుత్వంలోని బిజెపి తన నిరంకుశ వైఖరిని అత్యంత వేగంగా అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. అందులో భాగంగానే విశాఖ స్టీల్ ప్లాంట్ లో విఆర్ఎస్ ప్రవేశపెట్టి తద్వారా ప్లాంటును తన తాబేదారులకు కట్టబెట్టే ప్రక్రియను ప్రారంభించిందని ఆయన వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతూ దీనికి సొంత ఐరన్ ఓర్ గనులను కేటాయించడమే పరిష్కారమని ఆయన అన్నారు. నేడు ప్రభుత్వం ఒరిస్సాలోని సెయిల్ ఐరన్ ఓర్ గనులను అదాని ప్రైవేటు సంస్థకు కేటాయిస్తూ నిర్ణయం చేశారని, దీనిని వ్యతిరేకిస్తూ అక్కడ ఉద్యమం సాగుతోందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. విశాఖ స్టీల్ కార్మికులకు నాలుగు నెలల నుండి జీతాలు చెల్లించకుండా కార్మికుల పై జరుపుతున్న నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమం చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. కనుక స్టీల్ పరిశ్రమ పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉద్యమాలను మరింత ఉధృతం చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న స్టీల్ కార్మికులు ఉద్యమానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యుడు మాట్లాడుతూ ఈ సమావేశంలో ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యులు జె.అయోధ్య రామ్ దేశంలో ఉన్న బొకారో బిలాయి, రూర్కెలా, సేలం, ఇస్కో, దుర్గాపూర్ తదితర స్టీల్ ప్లాంట్ల కార్మిక సంఘాలతో కలిసి దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపునిచ్చామని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకు గడిచిన నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ఉద్యోగులను భయపెట్టి బయటకు పంపించాలన్న ఆలోచనలో విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఉందని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు

గడిచిన 40 సంవత్సరాల నుంచి సొంత ఓర్, కోల్ మైన్ లు లేకుండా చేసి కర్మగారాన్ని నష్టాలు బాట పట్టించాలని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని సెయిల్ లో విలీనం చేస్తే దేశంలోనే ఉత్తమ స్టీల్ ప్లాంట్ గా గుర్తింపు లభిస్తుందని ప్రయోజనం అన్నారు.

## తెలుగు రాష్ట్రాల రైళ్ల నిర్వహణ ప్రధానాధికారిణిగా తొలి తెలుగు మహిళ!



**గుంతకల్లు రైల్వే,జనవరి 16,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో క్షేత్రస్థాయి నుంచి మొదలు జాతీయస్థాయిలో రైల్వే బోర్డుకు మధ్య ప్రధాన సంధానకర్తగా,సమన్వయకర్తగా తెలుగు రాష్ట్రాల నుంచి మొట్టమొదటి మహిళా ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా తొలి తెలుగు మహిళగా కె పద్మజా బాధ్యతలు చేపట్టారు. సికింద్రాబాద్‌లోని జోనల్ ప్రధాన కేంద్రమైన రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్(పిసిఓఎం)గా ఆమెను పూర్తిస్థాయి అధికారిణిగా నియమిస్తూ రైల్వేబోర్డు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పద్మజా పిసిఓఎంగా బాధ్యతలు చేపట్టారు. కె పద్మజా ఐఆర్‌టిఎస్ నేపథ్యం :- 1994లో అప్పటి ఉమ్మడి ఏపిలో రాష్ట్ర డిజిపిగా పనిచేసిన డాక్టర్ ఎం.వి భాస్కరరావు కుమార్తె అయిన పద్మజా తన 24వ ఏటా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్(ఐఆర్‌టిఎస్) క్యాడర్‌కు ఎంపికైన ఆమె బ్యాచిలర్ ఆఫ్ సైన్స్,బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లలో పట్టభద్రులయ్యారు. పిసిఓఎంగా నియామకానికి ముందు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పి.సి.సి.ఎం)గా విధులను నిర్వర్తిస్తూ, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్(పి.సి.ఓ.ఎం)గా అదనపు బాధ్యతలను కూడా నిర్వహించేవారు. భారతీయ రైల్వేలో తన 31సం॥ల రైల్వే సర్వీసును హైదరాబాద్ డివిజన్‌లో సహాయ కమర్షియల్ సూపరింటెండెంట్‌గా 1994జనవరి 3న ప్రారంభం నాటి నుంచి తన కెరీర్‌ను ప్రారంభించారు.

# తిరుమల సమాచారం

## మహాకుంభమేళాలో శ్రీవారికి స్నపనతిరుమంజనం, చక్రస్నానం



**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సమ్మేళనమైన ప్రయాగ్‌రాజ్ మహాకుంభ మేళా దశాశ్వమేధ ఘాట్ వద్ద గురువారం ఉత్సవ మూర్తులకు స్నపన తిరు మంజనం, చక్రస్నానం వేడుకగా నిర్వహించారు. మహాకుంభమేళా భక్తుల సౌలభ్యం కోసం టిటిడి అక్కడ శ్రీవారి నమూనా ఆలయాన్ని నిర్మించి భక్తులకు స్వామివారి సేవలు, నిత్యకైంకర్యాలు జరిపింపజేస్తోంది. గురువారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానఅర్చకుడు వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పవిత్రంగా నది ఒడ్డున కన్నుల పండువగా స్నపనతిరుమంజనం నిర్వహించారు.

గంగానదిలో చక్రస్నాన మహోత్సవం భక్తులను భక్తిపారవశ్యానికి లోనుచేసింది. వేదపండితులు శ్రీసూక్తం, భూసూక్తం, పురుషసూక్తం, నారాయణసూక్తం తతదితర సూక్తాలను అర్చకులు వల్లించారు. అభిషేకానంతరం తులసీమాలలతో ఉత్సవమూర్తులను అలంకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామ్‌రఘునాథ్, ఎస్టేట్ అధికారి గుణభూషన్‌రెడ్డి, సూపరింటెండెంట్ గురురాజస్వామి, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ నెల ఆర్జితసేవ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో రేపు విడుదల

**-18న ఎలక్ట్రానిక్ డిప్, 21న ఆర్జితసేవా టిక్కెట్లు**

**-23న అంగప్రదక్షిణ, సీనియర్ సిటిజన్స్‌కు..**

**తిరుమల,జనవరి 16ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలు తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న ఏప్రిల్ నెలకు గాను ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ఆర్జితసేవలకు సంబంధించిన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తోంది. ఏప్రిల్ నెల ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్‌లో ఈనెల 18వతేదీ శనివారం ఉదయం 10గంటలకు విడుదల చేస్తుండగా 20వతేదీ వరకు బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. 22వతేదీ మధ్యాహ్నం వరకు సొమ్ముచెల్లించాల్సి ఉంటుంది. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపా లంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. ఇక ఆర్జితసేవల టిక్కెట్లు వర్చువల్‌విధానంలో ఆరోజు మధ్యాహ్నం 3గంటలకు బుకింగ్ అందుబాటులో ఉంటుంది. అంగప్రదక్షణ టోకెన్లను 23వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. వృద్ధులు, సీనియర్‌సిటిజన్స్, దివ్యాంగులకు మధ్యాహ్నం 3గంటలకు విడుదల చేస్తుంది. 24వతేదీ ఉదయం 10గంటలకు 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా విడుదల చేస్తారు. వసతి కల్పన అదేరోజు మధ్యాహ్నం విడుదల చేస్తారు. ఇదిలా ఉండగా శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో 23వతేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు.

## ప్రధానమంత్రి విశిష్ట పురస్కారాన్ని దక్కించుకున్న అబ్కారీ, నిషేధ శాఖ సంచాలకులు నిశాంత్ కుమార్



**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా పరిపాలనలో మెరుగైన సేవలు అందించినందుకుగాను అబ్కారీ, నిషేధ శాఖ సంచాలకులు నిషాంత్ కుమార్ కు ప్రతిష్టాత్మక ప్రధానమంత్రి పురస్కారం లభించింది. కేంద్ర ప్రభుత్వ పరిపాలనా సంస్కరణల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఈ మేరకు నిషాంత్ కుమార్‌కు సమాచారం అందించారు. పార్వతీపురం మన్యం కలెక్టంగా ప్రిజం 10" అమలులో మెరుగైన పనితీరును ప్రదర్శించి నందుకు 2023 సంవత్సరానికి గాను ఈ విశిష్ట పురస్కారం లభించింది.

ప్రజాసేవలో మమేకమై ఆ జిల్లాకు అందించిన విశిష్ట సేవలకు గాను నిషాంత్ కుమార్ కు కేంద్ర ప్రభుత్వం ఈ గుర్తింపును ఇచ్చింది. దేశ వ్యాప్తంగా ఉన్న సివిల్ సర్వెంట్ల అత్యుత్తమ కృషిని గుర్తించి, పోటీ తత్వాన్ని, ఆవిష్కరణలను, ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించేందుకు ఈ అవార్డు నిర్దేశించగా, నిషాంత్ కుమార్ చేపట్టిన "ప్రిజం 10" కార్యక్రమం ఇన్నోవేషన్‌డిస్ట్రిక్ట్" విభాగంలో ప్రధానమంత్రి పురస్కారాన్ని దక్కించుకుంది. ఇది ప్రజా పరిపాలనలో ఉన్నతత సాధన కోసం నిషాంత్ చేసిన కృషిని ప్రతిబింబిస్తుంది.

## బస్సు అదుపుతప్పి భారీ ప్రమాదం

# ఇద్దరు మృతి, 28 మందికి తీవ్రగాయాలు

### ప్రత్తిపాడులో దుర్ఘటన

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జనవరి 16 ప్రభాతవార్త:** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి శివారున రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కాకినాడ నుండి సుమారుగా 30 మంది విహారయాత్రగా వాటర్ ఫాల్స్ ను తిలకించేందుకు ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం దగ్గర గల దారపల్లి వాటర్ ఫాల్స్ కు ప్రయాణమయ్యారు. కాసేపట్లో గమ్యం చేరుతామనగానే ఒమ్మంగి శివారు గోపాల చెరువు టర్నింగ్ వద్ద బస్సు అదుపుతప్పి కాలంలో పడిపోయింది. క్షతగాత్రులను హుటాహుటిన దగ్గర్లోని ప్రతిపాడు సిహెచ్సికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించడం జరిగింది.. పూర్తి వివరాల్లోకి వెళ్తే కాకినాడ రూరల్ పరిధిలో తూరంగి చెందిన కోమాకుల శ్రీనివాసరావుకు ముగ్గురు కుమార్తె లు ఉన్నారు. వారిలో వరలక్ష్మి ,శిరీష,అంజలి,వివాహాలు అయ్యాయి. వేరు వేరు ప్రాంతాల్లో ఉంటున్న ముగ్గురు కుటుంబాలతో కలిసి 30 మంది 17 సీట్లు గల వినాయక ట్రావెల్స్‌కి చెందిన టెంపో వాహనంలో మండలంలో దారపల్లి జలపాతానికి బయలుదేరారు. ఒమ్మంగి గోపాలుడు చెరువు మలుపు వద్దకు వచ్చేసరికి వాహనవేగం అదుపులోకి రాక కాలువ లోకి దూసుకు పోయింది.ఈ సంఘటనలో కోమాకుల చంద్రావతి (45)బత్తిన లక్ష్మి సురేఖ (19)



మృతి చెందారు. ఈ సంఘటన లో గాయపడిన డ్రైవర్ డొక్కాడ రాంబాబు తో సహా 27 మంది గాయపడ్డారు. వీరిని ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు, పోలీస్ జీపు లో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కి తరలించారు. వీరందరినీ ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడలో ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. మృత దేహాలను పోస్ట్ మార్టానికి తరలించారు. ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో చికిత్స పొందుతున్న క్షత గాత్రులను స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు.

## సమయపాలనలో వందశాతం మైలురాయికి చేరుకున్న గుంతకల్లు డివిజన్

**గుంతకల్లు రైల్వే,జనవరి 16,ప్రభాతవార్త** రైల్వే బోర్డు నిర్దేశిత లక్ష్యంలో భాగంగా సమయపాలన లక్ష్యాన్ని వందశాతం మైలురాయిని చేరుకొని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ చరిత్రలో సరికొత్త రికార్డు నమోదు చేసింది. దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి 12గంటల నుంచి 15వ తేదీ అర్ధరాత్రి 12గంటల వరకు 24గంటలపాటు తిరిగిన 130మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను అధికార యంత్రాంగం పర్యవేక్షణలో రైలు సిబ్బంది నిర్ణీత వేగంతో రైలు సర్వీసులను నడపడం ద్వారా వందశాతం సమయపాలన మైలురాయిని చేరుకొని సరికొత్త రికార్డును నెలకొల్పింది.

వార్త

ఎవరూ నీకు ప్రావీణ్యాన్ని సంపాదించి పెట్టలేరు. నీకై నీవే దాన్ని సంపాదించుకోవాలి.

న-కార్డినల్ న్యూమాన్

# పసుపు పండుగ

దేశంలోనే ప్రప్రథమంగా పసుపు ఉత్పాదనల ఎగుమతులు పెంచే లక్ష్యంగా పసుపుబోర్డు ఏర్పడడం రైతాంగానికి శుభపరిణామం. రైతులకు సాగులాభదాయకంగా, వినియోగదారులకు నాణ్యమైన పసుపు అందజేయాలన్న తలంపుతో ఏర్పడిన జాతీయ పసుపు బోర్డు లక్ష్యం నెరవేరితే ఇక దేశంలో 'పసుపు పండగే' మరి! దేశంలో ప్రధానంగా తెలంగాణ, మహారాష్ట్ర తమిళనాడు ఆంధ్రప్రదేశ్‌లలో మొత్తం 3.24 లక్షల హెక్టార్లలోఎకరాలలో సాగు చేస్తున్నారు. ఇండియాలో పండించే పసుపులో ఈ రాష్ట్రాలలో సాగు మొత్తం 63.4 శాతంగా నమోదైంది. ఇవిగాక ఒరిస్సా, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, గుజరాత్, మేఘాలయ, అస్సాంలలో కూడా పసుపు పండుతోంది. ఈ సంక్రాంతి కానుకగా దేశంలోని పసుపు సాగు రైతుల కలలసాకారంగా జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. నిర్ణయం తీసుకోవడమే తరువాయిగా నిజామా బాద్ కేంద్రంగా ఆ ప్రాంతంలో పసుపు రైతుల కడగండ్లు తెలిసిన పసుపు రైతునే పసుపు బోర్డు తొలి ఛైర్మన్‌గా నియమించడం ఆహ్వానించదగిన విషయం. ఎన్నో ఏళ్లుగా పసుపు బోర్డు కోసం పసుపు రైతాంగం తపస్సు చేస్తోంది. వారు చాలా ఏళ్లుగా పసుపు ఉత్పత్తులకు, ఎగుమతులకు గిట్టుబాటు ధర లేక, ఆదాయం రాక కొంతమంది పసుపు సాగును వదిలి పెట్టలేక వదిలి ప్రత్యామ్నాయ పంటల సాగులోకి మారారు. ఆ యేటి కాయేడు రైతులు గతఏడాది పసుపు సాగుకు దూరమ య్యే పరిస్థితిలో ఉండగా తాజాగా సరైన సమయానికి కేంద్రం సరైన నిర్ణయం తీసుకొందనే చెప్పాలి. 2019 ఎన్నికల్లో మాత్రం 180 మంది పసుపు రైతులు పసుపు బోర్డు కావాలన్న కోరికకు మద్దతుగా లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్లు వేసి తమ తీవ్ర ఆకాంక్షలను దేశం యావత్తూ తెలియచేసే ప్రయత్నం చేశారు. అప్పట్నించీ రాజకీయ పార్టీలన్నీ కూడా 'పసుపు బోర్డు' కావాలన్న పల్లవిని అందుకున్నాయి. అంతకు ముందే పసుపు బోర్డుకావాలన్న డిమాండ్ ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఇంతకాలం సుగంధ ద్రవ్యాల బోర్డులో 'పసుపు' విభాగం కలిసి ఉండేది ఆ బోర్డు తీసుకునే నిర్ణయాలతో పసుపు రైతులు సంతృప్తిగా లేకపోవడమే కాక తమ గురించి పట్టించుకునే ప్రత్యేక బోర్డు కావాలని పట్టుపట్టారు. నేడు పసుపు బోర్డును ప్రత్యేకంగా ప్రకటించడం పసుపు రైతాంగానికి శుభ సమాచారమే. పసుపు బోర్డువల్ల కేవలం పసుపు రైతులకే కాకుండా పర్యాటకం, ప్యాకేజీ యూనిట్లు తదితర ఏర్పాటు ద్వారా ఉపాధి కలుగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి పసుపు బోర్డు, పసుపు విరివిగా సాగు చేస్తున్న నిజామాబాద్‌లో దాని కార్యస్థానాన్ని ఏర్పాటు చేయడం, పసుపు రైతునే దానిక ధిపతిగా నియమించడం వల్ల పసుపు బోర్డు దేశవ్యాప్త పసుపు సాగుదారులకు విశేషమైన మేలు చేయగలదు. ఇప్పుడు తాజాగా నిజామాబాద్ కేంద్ర స్థానంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు పసుపు రైతులకు మరింత అందుబాటులో వుండి వారి సమస్యలకు పరిష్కారం చూపగలదన్న విశ్వాసం రైతుల్లో కలుగుతోంది. పసుపు బోర్డు ఏర్పాటు, ఆ వెంటనే దాని కార్యాచరణకు అవసరమైన ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ తన భుజస్కందాలమీద వేసుకున్నారు. ఈ బోర్డు ఏర్పాటు పసుపు సాగుదారుల్లో ఎంతో ఆనందోత్సాహాలు నింపింది. ఇదంతా ఇలా ఉంటే వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా పసుపు రైతులకు పనిముట్లను రాయితీపై అందించాలని తెలంగాణ రైతు కమిషన్ తమ డిమాండ్‌లనుకేంద్రం ముందుంచింది. పసుపు బోర్డు ఏర్పాటులో దేశంలోని ఏప్రాంతానికి గానీ, ఏ రాష్ట్ర ప్రభుత్వానికిగానీ ఏ పసుపు రైతాంగ సంఘాలకు గానీ భిన్నాభిప్రాయంలేనే లేదు. కాగా దేశంలోనిచాలా ప్రాంతాలలో పసుపు సాగులో అత్యాధునిక పద్ధతులను ఉపయోగించడం లేదు. పాత పద్ధతుల్లోనే సాగు నిర్వహణ, యాజమాన్యం పద్ధతులు లేవని రైతాంగం వాపోతోంది. కూలీల కొరత, అధునాతన యంత్రాల లేమి రైతులకు సాగువ్యయం ఎక్కువవుతోంది. ఇంకా సాంప్రదాయ పద్ధతులను వారు విడనాడలేదు. వారు సాగుచేస్తున్నారు. దేశ కాల మానపరిస్థితుల రీత్యా వ్యవసాయాభివృద్ధిలో చోటు చేసుకున్న మార్పుల కనుగుణంగా సాగు యాజమాన్యం ఉండాలని పసుపు రైతు భావిస్తున్నాడు. పసుపుబోర్డు ఏర్పాటులో ఎవరి ప్రమేయమున్నా ఎవరి పట్టు ఉన్నా దానిని పూర్తిస్థాయి బోర్డుగా తీర్చిదిద్దడంలో అందరూకలిసి సానుకూలంగా ముందుకు కదలాలి. కేంద్ర రాష్ట్ర వ్యవసాయశాఖలు, రెండూ సమన్వయంగా నిజామాబాద్‌ను అంతర్జాతీయ స్థాయికి ఎదిగేటట్లు చేయగల ప్రణాళికలతో పసుపు బోర్డును తీర్చిదిద్దాలి. ఇక ఈబోర్డు నిర్వహణకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయింపు, సిబ్బంది, అధికారులను నియమిస్తామని కేంద్ర మంత్రి భరోసా కూడాఉంది. ఈలోగా రెండేళ్లలో పసుపు ఉత్పత్తులను రెండింతలుచేసే లక్ష్యంతో బోర్డు ముందుకుసాగాల్సి ఉంది. వీటికితోడు అన్నిరాష్ట్రాల పసుపురైతులు, పరిశోధనా కేంద్రాలు, వ్యవసాయ శాఖలను చేరదీసి ఉమ్మడి కార్యాచరణతో బోర్డు నాయకత్వంలో ముందడుగు వేయడం బోర్డుముందున్న లక్ష్యం. కొత్త వంగడాల రూపకల్పన, అధికోత్పత్తి నివ్వగల విత్తనాల సరఫరాతో పాటు ధరల స్థిరీకరణ, మార్కెటింగ్ వంటి అంశాలపై చొరవచూపడం పుసుపు బోర్డు చేపట్టాల్సిన తక్షణ కర్తవ్యంగా భావిస్తే అదే దేశానికి నిజమైన పసుపు పండగగా భావిద్దాం.

మాటకు మాట ప్రతీకారం కాదు, మౌనమే దానికి సమాధానం.



ప్లినీ

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు.ఎమర్సన్

# ప్రజావాక్కు



## వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి

వయసు నిర్ధారణ పత్రాలు అన్నిసచివాలయాల్లో ఇవ్వాలి ఆంధ్రప్రదేశ్‌లోని కొంతమంది వృద్ధులకు ఆధార్ కార్డులో వయసు తప్పుగా నమోదు జరిగింది. వారికి 75 లేదా ,65 సంవత్సరాలు వయసు ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో 45,56,58,సం.లు ఉన్నట్టుగా నమోదు అయింది.! ఆ కారణంగా పలువురు వృద్ధులకు వృద్ధా ప్య పింఛను పొందే అర్హత కోల్పోయారు. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్‌లు పెట్టి వృద్ధులకు వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి. ఈ కౌంటర్‌లు నిరంతరం పనిచేయాలి. ఇవి పనిచేసే తీరుపై జిల్లా కలెక్టర్‌లు పర్యవేక్షణ ఉండాలని అర్హత వున్న వారికి వయసు నిర్ధారణ పత్రాలు ఇవ్వాలి.

-శీరాపు శ్రీనివాసరావు, విజయనగరం

## జాతీయ హోదా ఇవ్వాలి

నిజామాబాద్‌కి పసుపు బోర్డ్ ప్రకటించి తెలంగాణకు కేంద్రం సంక్రాంతి బహుమతి అందించింది. కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ మామూనూర్ లో విమానాశ్రయం వరంగల్‌కి పత్తి పరిశోధన కేంద్రం మంజూరు చేయడం ద్వారా తెలంగాణ అభివృద్ధికి కేంద్రం బాసటగా నిలుస్తుంది అనే సందేశాన్నికేంద్రం తెలంగాణ ప్రజలకు ఇచ్చినట్టు అయింది. ఇక నిన్నటికి నిన్న రీజనల్ రింగ్ రోడ్ దక్షి ణ భాగానికి పచ్చజెండా ఊపడం గొప్ప అయితే మరిన్ని ప్రాజెక్ట్స్ మిగిలిపోయి ఉన్నాయి. ఒకటి రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం, ఐటీ ఐఆర్ ప్రాజెక్ట్ కరీంనగర్ లో ఏఇ ట్రిబుల్ఈ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వవల్సి ఉంది.

-భారత అవినాష్, జనగామ

## చట్టపరమైన చర్యలు ఏవి?

పల్నాడు జిల్లాలో సరస్వతీ ఇండస్ట్రీస్ సంస్థ అటవీ శాఖ భూములను ఆక్రమించడం, దళితులకు ప్రభుత్వం ఇచ్చిన ఎస్సైన్డ్ భూములు కొనుగోలు చేయడాన్ని రెవెన్యూ శాఖ అధికారులు విచారించి ధృవీకరించారు.అలాగే కడప జిల్లాలో వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి అటవీ శాఖ భూములను ఆక్రమించినట్లు పత్రికల్లో కథనాలు వస్తున్నాయి.ఇలాంటిచట్టవిరుద్ధమైన ఆక్రమణలపై అటవీ శాఖ మౌనం వహించడం ఆశ్చర్యంగాఉంది. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దీనిపై దృష్టి సారించాలి!

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణా జిల్లా

## నిర్విఘ్నంగా సాగుతున్న కుంభమేళా

జనవరి 13వ తేదీన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ లో ప్రారంభమైన మహా కుంభమేళా ఆద్యంతం ఆనందంగా ముగిసింది. దాదాపు కోటిన్నరపైగా భక్తులు, గంగా,యమునా, అంతర్వాహిని అయిన సరస్వతి త్రివేణి సంగమంలో అత్యంత చలిలో స్నానం చేయడం విశేషం.రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం, భక్తులు కూడా కట్టుబాట్లు పాటించడంవలన అంతటి జనసమోహంఉన్నా ఏప్రమాదం లేకుండా మొదటి రోజు నిర్విఘ్నంగా సాగిపోయింది.ఫిబ్రవరి 26 ఆఖరి రోజువరకు ఇలాగే కొనసాగితే అంతకన్నా కావాలసిందే మిటి? భక్తులు, దాతలవల్ల నాలుగు లక్షల కోట్లరూపాయల పైనే ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ మహా మేళా మరల నూట నలభై నాలుగు సంవత్సరాల తరువాత వస్తుందట.

-ఎన్. రామలక్ష్మి సికింద్రాబాద్

## పోలీసులకు బెదరింపులా!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ గాడిన పడుతున్నదని భావిస్తున్న తరుణంలో కొంతమంది ఎమ్మెల్యేలువారిపై బెదిరింపులకు దిగటం చూస్తున్నాం! అధికారపక్షానికి చెందిన గుడివాడ ఎమ్మెల్యే అనుచరులు ఏకంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులను గుడివాడ రండి,మీ అంతు చూస్తాం అనేవరకు వెళ్లారు! అదీ ఒక నిందితుడ్ని విచారిస్తున్న సమయంలో! సదరు ఎమ్మెల్యే ఇలా అరాచక శక్తులను చేరదీయడం,ప్రోత్సహించడం ఆశ్చర్యంగా ఉంది! అలాగే పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ విధి నిర్వహణలో ఉన్న డిఎస్‌పిని పిలిపించిమరీ బెదిరించారు! ఇలా పోలీసులను బెదిరించడం నేరం, ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయి?

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## మానవత్వం చూపుదాం

నేడు ఎందరో నిర్భాగ్యులు పట్టెడన్నం దొరకక ఆకలికి అలమటిస్తూ ధీనంగా రోడ్డు ప్రక్కన బ్రతుకుతున్నారు.మరికొందరు అనాధాశ్రయాలలో కాలం వెళ్లదీస్తున్నారు. కొందరు దాతలు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు వారి ఆకలి తీరుస్తున్నారు.కానీ అది సరిపోవడంలేదు. మనం రోజు మనకోసం ఎంతోఖర్చుచేస్తాం. వాటిలో కొన్ని అనవసర ఖర్చులు ఉంటాయి. ఆ డబ్బులతో పేదవాళ్ల ఆకలి తీరిస్తే భగవంతుడు కూడా సంతోషిస్తాడు. కాబట్టి ప్రతిఒక్కరు తమకున్నంతలో ఇతరులకు సహాయపడాలి.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భక్తినే కొలబద్దగా పరిగణించాలి!

**ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి ఇష్టాలు వారివి. కాలానుగుణంగా నిబంధనలు, పాత సాంప్రదాయాలను కాదని మార్చినా తప్పులేదు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగనంత వరకూ, భక్తికి ఏనిబంధన అడ్డురానంతవరకూ ఇలాంటి సున్నిత విషయాలలో జోక్యం ప్రభుత్వపరంగా బహు తక్కువగా ఉండటం సబబుగా ఉంటుంది. సంస్కార పూరితమైన సాంప్రదాయాలను కాదనకూడదు. మార్పును ప్రతిబింబించే నిబంధనలూ కాదనకూడదు. భక్తి ముఖ్యం. దేవాలయంలో శుచీ-శుభ్రత ముఖ్యం. భక్తుడు ఏకాగ్రత కోల్పోకుండా దేవుడిని కొలవటమే కొలబద్దగా గుర్తించాలి.**



రావులపాటి సీతారాంరావు

పవిత్రంగా దేవుడ్ని, దేవాలయాలలో ప్రార్థించటం ముఖ్యమా? ఆడా, మగా, ఆ మాట కొస్తే అందరు భక్తులు 'డ్రెస్ కోడ్' గుళ్లల్లో పాటించడం ముఖ్యమా అన్న అంశం ఈ మధ్యకాలంలో ప్రాధాన్యత సంతరించుకుంది.బళ్లల్లో 'డ్రెస్ కోడ్'ను ఆచరించటం చాలావరకు విధాయకంగా మారింది. అందరూ ముఖ్యంగా బాల్యంలో భేదభావాలు లేని విధంగా పెరగటం, చదువుకోవటం ముఖ్యమని ఆచరణలో ఆ సూత్రాన్ని పాటించడం తప్పు లేదు. కానీ గుళ్లకు 'డ్రెస్‌కోడ్' నియమం అవసరమా అన్నది లోతుగా విశ్లేషించటంలో తప్పులేదేమో అని అనిపిస్తున్నది. పూర్వకాలంలో మగవారు ధోతులూ,అంగవస్త్రాలను ధరించే వారు. మహా అయితే చొక్కాలు ఆచ్ఛాదన కోసం వేసుకొనే వారు. కాలక్రమేణా వస్త్రధారణలో మార్పులొచ్చాయి. మన దేశంలోనే అనేక ప్రాంతాలలో వస్త్రధారణ విభిన్న రీతులలో ఉండటం గమనిస్తూనేఉన్నాం.చలి విపరీతంగా ఉండే ఉత్తర దేశంలోని ప్రాంతాలలో గుళ్లల్లో పూజారులు పూర్తిగా శరీరమంతటా వస్త్రాలు ధరించే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్కడ పవిత్రతకూ, శుచికే, శుభ్రతకే ప్రాధాన్యం ఇస్తారు కానీ, కేవలం చొక్కాలూ లేకుండా, శరీరాలపైనా ఎలాంటి ఆచ్ఛాదన లేకుండా దేవాలయాలు దర్శించాలనే నిబంధనలు అక్కడి వాతావర ణానికి అనుకూలం కాకపోవడంవల్ల పాటించడం లేదు. కానీ దక్షిణాదిన మాత్రం శుచీ, శుభ్రతతోపాటు వస్త్ర నియమాలు కొన్ని గుళ్లల్లో కఠినంగా అమలు చేస్తుండటం ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం. పోను పోను ఇదివరిటికంటే మరింత కఠినంగా నిబంధనలు మార్చి పవిత్రతకూ, ప్రార్థనకూ ఉండే ప్రాధాన్యతను గమనించని రీతిలో ఆచారాల పేరిట, సాంప్రదాయాల పేరిట కొన్ని దేవాలయాల్లో దర్శనాలు అనుమతిస్తుండటం కాలానుగుణ మార్పులను పరిగణనలోకి తీసుకోకపోవడం వల్లనే. ఈ సందర్భంగా మీడియాలో కూడా కొన్ని వార్తలు రావటం గమనార్హం.కేరళలోని శ్రీ నారాయణ ధర్మసంఘం ట్రస్ట్ అధిపతి స్వామి సచ్చితానంద కొన్ని వారాల క్రిందట గుళ్లల్లోకి మగవారు చొక్కాలు ధరించి దైవదర్శనాలు చేసుకోవడం కేరళలో అనుమతించాలని కోరారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఆయనను సపోర్ట్ చేశారు. ఈ ఆలోచన సహజంగానే కొంత వివాదానికి దారితీసింది. కొంతమంది కాలానుగుణంగా ఈ మార్పును దేవాలయాలల్లో అనుమతించాలని, మరికొందరు సాంప్రదాయ రీతిని కాదనకూడదని భిన్నాభిప్రాయాలు వెలువరించారు. 2017 సంవత్సరంలో కేరళ ప్రభుత్వం నాన్- బ్రాహ్మిన్ పూజారులను దేవాలయాలలో పూజలకు అనుమతినిచ్చింది. ప్రస్తుతం ఈ వస్త్రధారణ విషయంలో కేరళలో వివాదాలు మొదలయ్యాయి. కేరళలో కమ్యూనిస్టు సిద్ధాం తం ఎంత పటిష్టంగా ఉందో, అంత పటిష్టంగా సాంప్రదా యాలు పాటించాలనే పట్టింపు కూడా ఉండడం అక్కడి సమాజంలోని భిన్న ఆలోచనలకు అద్దం పడుతున్నది.అయితే కేరళలో దేవాలయాల్లో ఒకే తరహా పద్ధతిని పాటించని దాఖలాలు కూడా ఉన్నాయి. గురువాయూర్ విషయంలో ఆ విషయం స్పష్టపడుతూనే ఉంది. ఆడవారి వస్త్రధారణ విషయంలో 2013వరకూ కేవలం చీరెలు ధరించిన మహిళలనే దేవాలయంలోకి అనుమతించే వారు. తర్వాత సాల్వార్స్ వేసుకోవడం అనుమతించడానికి ప్రత్యేక కారణం ఉత్తరదేశంలోని ఆడవారు ఎక్కువగా ఆ డ్రెస్‌లు వాడటంవల్లనే. ఈ మధ్యన దక్షణాది ప్రాంతాలలో



ని కొన్ని దేవాలయాలలో ఈ డ్రెస్ నిబంధనలుకఠినతరంగా అమలు చేస్తున్నారు. భక్తిముఖ్యం, వస్త్రధారణకాదు, ప్రార్థన ముఖ్యం కాలంచెల్లిన సాంప్రదాయాలుకాదు. దేవునిముందు అందరూ సమానులే అందరికి ఆరాధనచేసే హక్కు ఉంటుంది. ఉండాలి. అంతేకాని ఇలాంటి విషయాలకు ప్రాధాన్యత నిస్తూ సమాజంలోని ఎక్కువ మందిని దేవాలయాలకూ, దేవుళ్లకూ దూరం చేయకూడదనే ఆలోచన ఈమధ్య దేశంలో బలం పుంజుకుంటున్నది. శుచీ,శుభ్రత లాంటి నియమాల ఆచరణకు ఎవరికీ అభ్యంతరం ఉండకూడదు. పూర్వకాలంలో తడిబట్టలతో పూజలు చేసినా, దేవాలయాలను సందర్శించి నా, శుభ్రతను దృష్టిలో పెట్టుకొని ఆ కాలానికి తగ్గట్లు విధించిన నిబంధనలా భావించాలి గాని, సహేతుకత లేని ఏ నిబంధననూ ఈఆధునిక యుగంలో పాటించాలని పట్టుపట్టడం మూఢనమ్మకాలను ఆచరించడానికే అని అను కోకతప్పదు.చర్చిలలో ప్రార్థనలు జరిపేటప్పుడు పాదరక్షల విషయంలో నిబంధనలు లేవు. సిక్కు దేవాలయాలలో తలకు ఆచ్ఛాదన ప్రార్థన చేసేటప్పుడు పాటిస్తారు. అదే విధంగా నమాజ్ చేసేటప్పుడు ముస్లిం మతస్థులు తలమీద టోపీ లాంటిది ధరించి ప్రార్థనలలో పాల్గొనటం మనం గమనిస్తూనే ఉన్నాం. వారి ఆచార వ్యవహారాలనూ, సాంప్రదాయాలను అనుసరించి ఆ విధమైన పద్ధతులు, ఆ మతస్థులు ఎవరూ సహేతుక కారణాలతో అభ్యంతరం పెట్టనంతవరకూ ఎవరికి ఎందుకు అభ్యంతరం ఉండాలి? అదే విధంగా సనాతన సాంప్రదాయాలు, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా భక్తిని మరింత పెంచేవిధంగా ఉన్నంతవరకూ సనాతన భావాలు అంటూ చీటికిమాటికి విజ్ఞత లోపించిన వారు తప్పుపట్టడం అవివేకం. మూర్ఖత్వం అని భావించక తప్పదు. ఎవరి మతం వారిది. ఎవరి నిబంధనలు వారివి. అన్యమత ద్వేషంతో, లౌకిక రాజ్యాంగాన్ని ఆమోదించిన మనదేశంలో అకారణంగా ఆచార సంపదను తక్కువ చేయడం ఎవరూ హర్షించరు. అంతర్లీనంగా దేవాలయాలకు సంబంధించిన ఇలాంటి విభేదాలు ఇతర రాష్ట్రాలలో అంతగా బయటకు రావు. కానీ కేరళలో మొదటి నుంచీ లిట్రసీరేట్ ఎక్కువగా ఉండటం వల్లనోఏమో సమాజపరంగా ఉన్న సమస్యలు బాహాటంగానే చర్చించుకొనే సత్సాంప్రదాయం ఉండటంవల్ల ఇట్టే బయటపడతాయి. నంబూద్రిపాద్‌బ్రాహ్మణుడైనా, కమ్యూనిస్టు సిద్ధాంతాలను కాచి వడబోసి ముఖ్యమంత్రిస్థానంలోకి వెళ్లిన వాడవటంచేత తన కులాన్ని ఎన్నడూ వెనకేసుకొని రాలేదు. అట్టడుగు వర్గాల వారికే ఆయన అధికారంలో ఉన్నంతవరకూ అండగాఉన్నారనే పేరు సంపాదించుకున్నారు. కేరళలోని సాంప్రదాయ వాదులూ వారి వాదాన్ని వదులుకోలేదు. అగ్రవర్ణాలకు చెందినవారు ఇలాంటి విషయాలల్లో వెనక్కు తగ్గిన దాఖలాలులేవు. ఉదాహరణకు సుగిన్ జి.నాయర్ అనే ఆయన ఎర్నా కులంలోని శివుని దేవాలయం నుంచి ప్రార్థనలు చేస్తూ బయటకు వచ్చినప్పుడు ఒక మాట ఈ వస్త్రధారణ విషయంలో మీడియా వారు అడిగితే చెప్పారట! 'నేను ఎన్నో ఏళ్లనుంచి పై శరీరం మీద వస్త్రం లేకుండా దేవాలయంలో పూజ చేసుకోవడానికి అలవాటుపడ్డాను. నిబంధనలు మార్చి నన్ను షర్టుతో దేవాలయంలోకి అనుమతించినా, నా పద్ధతే నేను పాటిస్తాను. షర్టులేకుండా గర్భగుడి ప్రవేశ ద్వారం దగ్గర భక్తితో ప్రార్థన చేయడం నాకు ఇష్టం. అదే చేస్తాను. రూల్స్ మారినంత మాత్రాన నేను షర్టుతోనే భగవంతుడ్ని ప్రార్థించాలని నన్ను ఎవరూ బలవంతపెట్టలేదు గదా! అని తాపీగా భుజం మీద ఉన్న షర్టును ఆలయం బయట వేసుకొని తాపీగా ఏవో శ్లోకాలు చదువుకుంటూ వెళ్లిపోయారట. ఎవరి నమ్మకాలు వారివి. ఎవరి ఇష్టాలు వారివి. కాలానుగుణంగా నిబంధనలు, పాత సాంప్రదాయాలను కాదని మార్చినా తప్పులేదు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగనంతవరకూ, భక్తికి ఏనిబంధన అడ్డురానంతవరకూ ఇలాంటి సున్నిత విషయాలలో జోక్యం ప్రభుత్వపరంగా బహు తక్కువగా ఉండటం సబబుగా ఉంటుంది. సంస్కార పూరితమైన సాంప్రదాయాలను కాదనకూడదు. మార్పును ప్రతిబింబించే నిబంధనలూ కాదనకూడదు. భక్తి ముఖ్యం. దేవాలయంలో శుచీ-శుభ్రత ముఖ్యం. భక్తుడు ఏకాగ్రత కోల్పోకుండా దేవుడిని కొలవటమే కొలబద్దగా గుర్తించాలి. ●

# జమిలి ఎన్నికలు సాధ్యమేనా?

డాక్టర్ మోటె చిరంజీవి

దేశంలో జమిలీ ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది.'వన్ నేషన్ వన్ ఎలక్షన్' బిల్లు త్వరలోనే పార్లమెంట్‌లో ముందుకు రానుంది. దీనికి సంబంధించి రాజ్యాంగంలోని 129వ సవరణ బిల్లు సైతం ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం జమిలికే మొగ్గ చూపుతుండడంతో దీనికోసం ఉన్న అడ్డంకులన్నీ తొలగించుకునేందుకు సన్నద్ధమవుతోంది. పార్లమెంట్ నుండి పంచాయితీ ఎన్నికలు అన్నీ ఒకేసారి నిర్వహించేందుకు సమాయత్తం చేస్తోంది. మొత్తం రెండు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి.తొలి దశలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు, అవిపూర్తైన వంద రోజుల్లోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయి. దీనికోసం దేశవ్యాప్తంగా ఒకే ఓటరు జాబితాను ఉపయోగించబోతున్నారు. జమిలి ఎన్నికలు అంటే వన్ నేషన్, వన్ ఎలక్షన్. దేశానికి ఒక్కసారే ఎన్నికలు, మిగిలిన ఐదేళ్లు పరిపాలనపై దృష్టిపెట్టాలన్న దృక్పథంతో జమిలిని తెరపైకి తీసుకొచ్చారు. గతంలో జమిలి ఎన్నికలకు సంబంధించి కోవింద్ కమిటీ సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదించడంతో ఇక రెండు ప్రక్రియలు మిగిలున్నాయి. ఈ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి. ఈ శీతాకాల సమావేశాల్లోనే ఈబిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. బిల్లు అమల్లోకి రావాలంటే రాజ్యాంగంలోని ఆరు ఆర్టికల్స్ సవరణ చేయాల్సి ఉంది. రాజ్యాంగ సవరణలు చుసినట్లయితే లోక్‌సభ, రాజ్యసభ కాలపరిమితి చెందిన ఆర్టికల్ 83, రాష్ట్రాల అసెంబ్లీకు ఐదేళ్లగడువుని నిర్దేశించే ఆర్టికల్ 172(1)సవరణ. ఎమర్జెన్సీ పరిస్థితులొస్తే సభ కాలపరిమితిని ఏడాది దాట కుంటా వీలు కల్పించే ఆర్టికల్ 83(2) సవరణ.లోక్‌సభను





రద్దు చేసేలా రాష్ట్రపతికి అధికారాలిచ్చే ఆర్టికల్ 85(2) సవరణ. రాష్ట్రాల అసెంబ్లీ రద్దు అధికారాన్ని గవర్నర్‌కుఇచ్చే ఆర్టికల్ 174(2) సవరణ. రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలనకువీలు కల్పించే ఆర్టికల్ 356సవరణ ఇలా కొన్ని ఉన్నాయి. ఎన్నికల కమీషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 324సవరణచేశారు. దేశంలో ఇప్పటి వరకూ అంటే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1957, 1962, 1967లో ఒకేసారి ఎన్నికలు జరిగాయి. ఆ తరువాత పరిస్థితులుమారి అడపా దడపా జరుగుతున్నాయి. జమిలి ఎన్నికల ప్రతిపాదన తొలిసారిగా 1980లో వచ్చింది. ఆ తరువాత 1999లో లా కమీషన్ కూడా జమిలి ఎన్నికలకు ఓకే చెప్పింది. పార్లమెంట్‌లోబిల్లు ఆమోదం పొందడంతో పాటు ఆరు ఆర్టికల్స్ సవరించాల్సి ఉంది. ఆ తరువాత సగం రాష్ట్రాలు ఒకే చెప్పాల్సి ఉంది. అన్నీ అనుకూలిస్తే 2027లో జమిలి ఎన్నికలు నిర్వహించాలనేది కేంద్రం ఆలోచనగా ఉంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. గతంలో జరిగిన, ఆ తర్వాత వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు,రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసన సభలను బర్తరఫ్ చేయడం, తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరుగుతున్నాయి. జమిలి ఎన్నికలు జరుగాలంటే దాదాపు 18 రాజ్యాంగ సవరణలు, ప్రజాప్రాతినిధ్య చట్టంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నదని కోవింద్ కమిటీ తాజా నివేదికలో స్పష్టం చేసింది. ముఖ్యంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఆర్టికల్ 324, ఆర్టికల్ 83(2), ఆర్టికల్ 172(1), ఆర్టికల్ 83కు సంబం ధించి పలు సవరణలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ●

# తిరుపతి తొక్కిసలాటలో తప్పెవరిది?

ఎం కె కుమార్

తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకెన్ల జారీ సమయంలో చోటుచేసుకున్న తొక్కిసలాట భక్తుల హృదయాలను కలచివేసింది. ఈ ఘటనకు పలు కారణాలు ఉన్నప్పటికీ, ముఖ్యంగా భక్తుల నియంత్రణలోపం, భద్రతా చర్యలలోపం, భారీ భక్తులరద్దీ, టోకెన్ల జారీ ప్రక్రియలో పొరపాట్లు, గేట్ల అకస్మాత్తుగా తెరవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. క్యూలైన్లలో ఉన్న భక్తులను ఒకేసారి పెద్దసంఖ్యలో విడుదల చేయడం గందరగోళానికి దారితీసింది. భద్రతా సిబ్బంది తక్కువగా ఉండటం, భక్తులకు తగిన మార్గదర్శనం అందించకపోవడం పరిస్థితిని మరింత వేగంగా విషమం చేసింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఏర్పాట్లు తక్కువయ్యాయి. టోకెన్ల జారీని తిరుపతిలోనే పరిమితం చేయడం వల్ల గందరగోళం మరింత పెరిగింది. పోలీసు అధికారి గేట్లను అనాలోచితంగా తెరవడంవల్ల ఈ సంఘటన చోటుచేసుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ విషాదానికి స్పందనగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిలు బాధితులను పరామర్శించారు. అయితే, ఈ ఘటన రాజకీయ విమర్శలకు వేదికగా మారింది. విపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపగా, అధికార పక్షం బాధ్యత తీసుకున్నట్లు ప్రకటించింది. టోకెన్ల కోసం భక్తులు పెద్ద సంఖ్యలో గేటు వద్ద గుమికూడడంతో తొక్కిసలాట జరిగింది. సాక్షుల కథనాల ప్రకారం, భక్తులు వెనుక నుంచి బలవంతంగా ముందుకు తోసుకోవడం వల్ల పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. భాషా అడ్డంకులు కూడా కీలక పాత్ర పోషించాయి, ఎందుకంటే తమిళం, కన్నడ మాట్లాడే భక్తులు, పోలీసుల సూచనలు అర్థం చేసుకోలేకపోయారు. పోలీసులు మైక్ ద్వారా భక్తులను వెనక్కి జరగమని పలుమార్లు హెచ్చరించినా, వారు వినిపించుకోలేదు. మధ్యాహ్నం నుంచే భక్తుల రాక పెరిగిపోవడంతో గేటు ముందు భారీ గుంపు ఏర్పడింది. అయితే వెనుక భాగం ఖాళీగానే ఉండిపోయింది. గేట్లు తెరవకముందే భక్తులు ముందుకు దూసుకురావడం వల్ల పరిస్థితి అదుపు తప్పింది. ఈ గందరగోళంలో భక్తులు కిందపడిపోయి ఊపిరాడక మృతి చెందిన ఘటన తీవ్ర విషాదకరంగా మారింది. సమన్వయం లోపం, నిర్వాహకుల తగిన జాగ్రత్తలేని నిర్వహణ ఈ ఘోరానికి దారితీశాయి. ఈ సంఘటన తర్వాత తిరుమలలో రాజకీయ పోరాటాలు, అధికారి విభేదాలు, సమన్వయ లోపాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా టీటీడీ ఛైర్మన్, ఈవో మధ్య జరిగిన వివాదం అధికార వ్యవస్థలో విభేదాల తీవ్రతను చూపించింది. తిరుమలలో ఉన్నత పదవులపై అధికారుల మధ్య ఆధిపత్య పోరు భక్తులకు సౌకర్యాల క్రమం తప్పడానికీ, దేవుడి సేవలో గౌరవాన్ని తగ్గించడానికీ దారితీస్తోంది. ఈ పరిణామాలు కేవలం భక్తి కోసం వచ్చిన భక్తుల జీవితాలకు ముప్పుగా మారడమే కాకుండా, తిరుపతి చరిత్రలో ఈ సంఘటనచెడు గుర్తింపును తీసుకొచ్చింది. దీనిని దృష్టిలో ఉంచుకొని పాలకులు, అధికారులు వారి ధర్మబద్ధమైన విధులను సమర్థంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. టీటీడీ పాలక మండలి, అధికారుల మధ్య నెలకొన్న విభేదాలు తొలగించడం, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో సమన్వయాన్ని పెంపొందించడం కీలకంగా మారింది. వైకుంఠ ఏకాదశి రోజున జరిగిన ప్రమాదం విధ్వంసానికి కారణమైన లోపాలను గుర్తించి, బాధ్యత వహించాల్సిన వారు బాధ్యత స్వీకరించాలి. మృతుల కుటుంబసభ్యులు తీవ్ర శోకంలో మునిగిపోగా, గాయపడిన భక్తులు స్విమ్స్ ఆసుపత్రి, పద్మావతి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ప్రకటించినా, ఆ ప్రాణనష్టాన్ని పూడ్చలేకపోవడం బాధాకరం. ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ప్రభుత్వం వెల్లడించింది. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాల కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో, 90 కౌంటర్లను తొమ్మిది ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. మంగాపురం వంటి ఇతర ప్రాంతాల్లో టోకెన్లు జారీ చేయకపోవడం వల్ల తిరుపతిలో భక్తుల రద్దీ భారీగా పెరిగిందని పలువురు భక్తులు తెలిపారు. పురుషులు, మహిళలు, చిన్నపిల్లలు ఉన్నారని కూడా చూడకుండా, కొందరు భక్తులు బలవంతంగా ముందుకు దూసుకువెళ్లారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచే టోకెన్ల కోసం భారీగా భక్తులు కేంద్రాలవద్ద గుమికూడగా, రాత్రి 8గంటల వరకు ఒత్తిడి తారాస్థాయికి చేరింది. రాత్రి 9గంటల నుండి క్యూలైన్లలో ప్రవేశం ప్రారంభించడంతో, బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాలవద్ద తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. ఈఘటన భక్తుల భద్రతాపరమైన ఏర్పాట్లలో లోపాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. భక్తులు, బాధితుల కుటుంబాలు ఈ విషాదానికి కారణమైన నిర్వాకంపై తీవ్రఆవేదనవ్యక్తం చేస్తున్నారు.తిరుపతిలో జరిగిన తొక్కిసలాట వంటి దుర్ఘటనలు భక్తులభద్రతను సవాలుగా నిలిపాయి.ఈ సమస్యల పరిష్కారానికి కొన్నిమార్గాలను సూచించడం అవసరం.టోకెన్ల జారీ పద్ధతిలో మార్పులు ముఖ్యమైనవి.భక్తులు ఆన్ లైన్‌లోనే టోకెన్లుపొందే విధానం అమలుచేస్తే కౌంటర్ల వద్దగుమికూడే పరిస్థితి తగ్గుతుంది. జాబితా ప్రకారం సమయ స్లాట్లు కేటాయించడం, ప్రత్యేకమైన అవసరాలు ఉన్నవారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించడం ప్రయోజనకరం. ప్రత్యక్ష కౌంటర్ల సంఖ్యను పెంచి, చుట్టుపక్కల ప్రాంతాల్లో వాటిని విస్తరించడమూ ఆవశ్యకం. టోకెన్ల సమయ నియంత్రణ ద్వారా భారీ సంఖ్యలో భక్తులను ఒకేసారి అనుమతించడం తగ్గించి, నియంత్రణతో దర్శనం అనుమతించవచ్చు. భద్రతా చర్యల్లో పోలీసుల సంఖ్యను పెంచి, క్యూలైన్‌లను సులభంగా నియంత్రించగల విధానా లు తీసుకోవాలి. ఎమర్జెన్సీ పరిస్థితుల కోసం మెడికల్ టీమ్స్‌ను సిద్ధంగా ఉంచడం కూడా కీలకం. సమాచార వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల భక్తులకు అవగాహన పెరుగుతుంది. స్పీకర్ల ద్వారా దిశానిర్దేశం చేసి గేట్లు తెరవడం లేదా క్యూలైన్ నియమాలు స్పష్టంగా తెలియజేయ వచ్చు. ప్రవాహ నియంత్రణలో భాగంగా, చిన్నచిన్న సమూహాలను మాత్రమే క్రమపద్ధతిలో అనుమతిస్తే, తొక్కిసలాట ముప్పు తక్కువ అవుతుంది. సంక్షిప్తంగా, భక్తుల సంఖ్య తగ్గించే ప్రయత్నాలు, భద్రతా సిబ్బంది మెరుగుదల, సాంకేతిక పరిష్కారాలు, స్పష్టమైన సమాచార మార్గాలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా నియంత్రించవచ్చు. ●

## బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దుదాం: కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్(డీఆర్సీ)ను ఏర్పాటు చేసి(కలెక్టరేట్‌లో) ప్రతి డిపార్టుమెంట్ నుంచి ఒకరిని ఈ డీఆర్సీలో డిప్యూటేషన్‌గా ఉంచి జిల్లాలోని చిల్డ్రన్ గుర్తించి వారిని తిరిగి స్కూల్స్‌లో గాని వారి వయస్సును బట్టి స్కిల్ డవలప్‌మెంట్‌లో చేర్చి ఆరిని సమాజంలో భాగస్వాములుగా మంచి గుర్పింపు పొందేలాగా వారి కుటుంబాలు ఉన్నతంగా ఉండేలా చేయాలని ఆదేశించారు. ఈ డిస్ట్రిక్ రిసోర్స్ సెంటర్(డీఆర్సీ) లోని ఉద్యోగులకు ట్రైనింగ్ ఏర్పాటు చేసి ఏ డిపార్టుమెంట్ వారు ఏ కార్యక్రమాలు చేయాలో వారికి చెప్పి



జిల్లాలోని బాల కార్మికుల, బాల్య వివాహాలు బాలలపై ఎటువంటి అగయిత్యాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని అందకు జిల్లా అధికారులు అందరూ భాగస్వాములు కావాలని కొరియున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళల, శిశు సంక్షేమ శాఖ అధికారిణి హెన సుజన్, జీడ్పీ సీఈఓ చింజీవి, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, డీసీపీఓ పి.దినేష్ కుమార్, డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మన్ నాయక్, ఎస్ఏఆర్‌డీఎస్ ఎన్జీవో సునీల్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అయినముక్కల వద్ద కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిపై వెలుగొండ ప్రాజెక్టు తీగలేరు కాలువకు బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో..?

పెద్దదోర్నాల, జనవరి 16, ప్రభాతవార్త



వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన తీగలేరు కాలువపై కర్నూలు- గుంటూరు జాతీయ రహదారిపై అయినముక్కల వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన గుంత అధికారుల పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం పడుతుంది. రెండు దశాబ్దాల క్రితం కాలువ తవ్వి పట్టారు. కర్నూలు- గుంటూరు నాలుగు లైన్ల జాతీయ రహదారి పక్కన గుంతలు తవి పెట్టి బ్రిడ్జి నిర్మాణం మరిచిపోయారు. దీంతో గుంతల వలన ప్రమాదం పొంచి ఉంది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు పక్కన ఉన్న గుంతలతో ప్రమాదం పొంచి ఉంది. అయితే ఆ గుంతతలకు చిల్లకంప ఏపుగా పెరిగిపోయింది. అయితే పట్టించుకునే నాధుడే లేదు. వెలుగొండ ప్రాజెక్టులో కీలకమైన తీగలేరు కాలువ ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గ పొలాలకు సాగునీరు అందుతాయి. అదే క్రమంలో ఆ ప్రాంత ప్రజలకు తాగునీరు కూడా అందుతాయి. ఇంత ప్రాధాన్యత ఉన్న తీగలేరు కాలువ అయినముక్కల వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోక పాలకుల అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. అప్పట్లో బ్రిడ్జి నిర్మాణం కోసం గుంతలు తవ్వారు. కర్నూలు- గుంటూరు జాతీయ రహదారి పక్కకు డైవర్షన్ చేస్తూ తారు రోడ్డు సైతం నిర్మించారు. నాసి రకం నిర్మాణం జరగడంతో అక్కడ వర్షానికి తారు రోడ్డు కొట్టుకుపోయింది. ఆ ప్రాంతం గుంతలు పూడిపోయి చెట్లు పెరిగాయి. ఏళ్ల తరబడి గాలికి వదిలేశారు. తీగలేరు కాలువపై బ్రిడ్జి నిర్మాణం దేవుడు ఎరుగు. తీగలేరు కాలువ మాత్రం చిల్లకంపతో పూడిపోయింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలంటే కనీసం సంవత్సరం పడుతుంది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలంటే కనీసం సంవత్సరం పడుతుంది. ఇదిగో పూర్తయింది. అదుగో ప్రారంభమంటూ వెలుగొండ ప్రాజెక్టుపై నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను మభ్యపెడుతున్నారు. తీగలేరు కాలువ మాత్రం క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉంది. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం చేసి ప్రజలలో చులకనయ్యారు. తీగలేరు కాలువ పూర్తికాకుండానే యర్రగొండపాలెం నియోజకవర్గానికి సాగు తాగునీరు ఎలా అందుతాయో పాలకులే తెలపాలని ప్రజలు అడుగుతున్నారు. ఆ ప్రభుత్వంలో ప్రజలకు మాయమాటలు చెప్పారని ఇప్పుడు అంటున్నఈ పాలకులు ఆయన చేసిన తప్పు వీరు చేయకుండా ఇప్పటికైనా తీగలేరు కాలువపై స్ట్రక్చర్ పనులు, అసంపూర్ణంగా ఉన్న కాలువ పనులు చేపట్టి పాలకులు అనిపించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## డయాలసిస్ పేషెంట్స్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### - ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

**కనిగిరి, జనవరి 16, ప్రభాతవార్త**



డయాలసిస్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి కిడ్నీ రోగులను అడిగి తెలుసుకున్నారు. అధునాతన డయాలసిస్ పరికరాల ద్వారా వైద్య సేవలను మెరుగుపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యమైన ప్రభుత్వ వైద్యశాలలో సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన లకు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆరు నెలల వ్యవధిలో దాతల సహాయంతో కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, వైద్యులు తిరుపతిరెడ్డి, సునీత, వైద్య సిబ్బంది, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు గుల్లబాల బాబు, షేక్ రెహమాన్, కొలిపర్తి మారుతికుమార్, పోలంరెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తాం

### '- గిద్దలూరు రూరల్ సిఐ రామకోటయ్య

**రాచర్ల, జనవరి 16 ప్రభాతవార్త :**



వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జే రామకోటయ్య అన్నారు. రాచర్ల సబ్ ఇన్‌స్పెక్టర్ పి కోటేశ్వరరావుతో కలిసి గురువారం సాయంత్రం ఆయన గుడిమెట్ట పంచాయితీలోని జి కొత్తపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్‌లో పచ్చి పొగాకు లోడు తీసుకుని వెళ్ళడం మంచిదేనని ఆ లోడ్‌పై కూలీలను ఎక్కించుకుని పోవడం ఏమిటని ఆయన డ్రైవర్‌ను ప్రశ్నించారు. ట్రాక్టర్‌కు ట్రాలీకి మధ్యన కూలీలను ఎక్కించుకోవడం, డ్రైవర్ ప్రక్కన కూర్చోబెట్టుకోవడం పచ్చి ఆకు లోడ్‌పై కూలీలను ఉంచడం సరికాదని ఏవైనా జరగరాని ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏమిటని ఆయన అన్నారు. ఇకపై ఇలాంటి ఆలోచనలకు స్వస్తి పలకాలని లగేజ్ వాహనాలపై కూలీలను కానీ, ప్రయాణికులను కానీ ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇష్టాను సారంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నారని వాహనదారుల నిర్లక్ష్యం వలన జరగరానినష్టాలు జరుగుతున్నాయని కాబట్టివాహనదారులు జాగ్రత్తలతోపాటు నిబంధనలు పాటించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులు తీసుకునే చర్యలుతీవ్రంగా ఉంటాయన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను అభినందించిన టీడీపీ నేతలు

**సంతనూతలపాడు, జనవరి 16, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలెం గ్రామంలో గల వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయింపుకు కృషి చేసిన సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్‌ను గ్రామ టీడీపీ నేతలు గురువారం సాయంత్రం ఒంగోలులోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు నలుమాల్పు సుబ్బారెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు కంచి సుధాకర్‌రెడ్డి, కే.నారాయణస్వామిరెడ్డి, కే.వరదారెడ్డి, వెంకటరామిరెడ్డి తదితరులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను కలిసి అభినందించిన వారిలో ఉన్నారు.

# పాకల సముద్రతీరంలో విషాదం

- సముద్ర స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి
- ఒకరు గల్లంతు
- ఒకరిని కాపాడిన మత్స్యకారులు











**సింగరాయకొండ,జనవరి 16,ప్రభాతవార్త**

సరదాగా స్నానం చేసేందుకు వెళ్లి ముగ్గురు మృతి చెంది ఒకరు గల్లంతై, ఒకరిని కాపాడిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు మెరైన్ పోలీసులు తెలిసిన వారు మేరకు పొన్నలూరు మండలం తిమ్మపాలెం గ్రామం శివన్న పాలెంకి చెందిన నోసిన జెస్సికా (15), నోసిన మాధవ (25), నెల్లూరు జిల్లా కందుకూరు మండలంకు చెందిన కల్లగుంటకు చెందిన కొండాబత్తిన యామిని (16)తో కలిసి సంక్రాంతి సంబరాలను ఘనంగా ముగించుకొని గురువారం ఉదయం సింగరాయకొండ మండల పరిధిలోని పాకల సముద్ర తీరంలో సముద్ర స్నానానికి బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో సముద్రంలో అలలు తాకిడితో ఉత్సాహంగా మునిగే సమయంలో అలల ఉధృతి ఎక్కువ కావడంతో నలుగురు గల్లంతయ్యారు. వీరిలో ఒకరిని స్థానిక మత్స్యకారులు సహాయంతో కాపాడారు. వీరిలో ఇద్దరు మహిళలు, ఒక యువకుడు గల్లంతై మృతదేహాలు ఒడ్డుకు చేరాయి. వీరిలో గల్లంతైన ఇంకో యువకుడు సింగరాయకొండ వడ్డిపాలెంకి చెందిన తమ్మిశెట్టి పవన్‌కకుమార్‌గా గుర్తించారు. ఈ గల్లంతైన యువకుడు కోసం మెరైన్ పోలీసులు స్థానిక మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మృతి చెందిన వారిలో పొన్నలూరు మండలం తిమ్మపాలెం పంచాయతీకి చెందిన శివన్న పాలెంకి నోసిన జెస్సిక (15) సంవత్సరాలు నోసిన మాధవ(25)సంవత్సరాలు, నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణం కళ్లగుంటకు చెందిన కొండాబత్తిన యామిని (16) సంవత్సరాలు ఈ ముగ్గురును ఒడ్డుకు చేర్చారు. ఈ ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన బంధువులుగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సిఐ హాజరత్తయ్య సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి తక్షణ చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన ముగ్గురును పోస్టుమార్టం నిమిత ్తం కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతులు కుటుంబాలు వారు ఇక లేరని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు .గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సముద్రంలో గల్లంతైన తమ్మిశెట్టి పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు హైదరాబాదులో నివాసం ఉంటారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సింగరాయకొండ పట్టణానికి వచ్చారు. తమ్మిశెట్టి అంకమ్మకు ఒక్కగానొక్క కుమారుడు పవన్‌కుమార్‌కు ఇటీవల ఉద్యోగం కూడా వచ్చిందని ఒక్కగానొక్క కుమారుడు సముద్రంలో గల్లంతు కావడంతో బోరున విలపిస్తున్నారు.

**ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి..**

పాకల బీచ్‌లో నలుగురు మృతి చెందిన ఘటనపై సా ంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం పాకల సము ద్ర తీర ప్రాంతంలో జిల్లా రెవిన్యూ అధికారి శ్రీలక్ష్మి ,జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ,డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావులతో కలిసి సంఘటన స్థలాన్ని మంత్రి స్వామి స్వయంగా పర్యవేక్షించారు. మృతులు కుటుంబ సభ్యులను చరవాణి ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం చేసేలా చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. బీచ్ దగ్గరే ఉండి మరో మృతదేహం కోసం గాలింపు చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. బీచ్‌లో నలుగురు మృతి చెందడం దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు కూడా బీచ్‌ల దగ్గర అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు, మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు స్థానికులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

### - జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా

**ఒంగోలు, ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బంది చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లాలో రహదారుల భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారుల భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న జాతీయ రహదారులు,



రాష్ట్ర రహదారులలో సంయుక్త తనిఖీలు నిర్వహించి తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఆ మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అమలు చేయాలన్నారు. వాహనాల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బారికేడ్స్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ పై నేషనల్ హైవే, ఆర్ అండ్ బి శాఖలు చేపట్టవలసిన చర్యలపై ఇదివరకే తగు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అందుకు సంబంధించిన పనుల పురోగతిని సమీక్షించారు. జిల్లాలో 2024 సంవత్సరంలో జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించి 872 కేసులు నమోదు కాగా అందులో 389 మంది మరణించడం జరిగిందని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్య కూడలి రద్దీ ప్రదేశాల్లో రహదారుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ట్రాఫిక్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా గత అక్టోబర్ మాసంలో జరిగిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలపై సమావేశంలో అంశాల వారిగా చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో డి.టి.సి. ఆర్.సుశీల, డిఎస్పి సురేష్‌బాబు, ఆర్. అండ్ బి. ఎస్.ఈ. దేవానందం, జి.జి.హెచ్. సూపరింటెండెంట్ డా. జమున, డి.ఎం.హెచ్.ఓ. డా. వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక అధికారి బేబీరాణి, ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. ఆర్.ఎం శ్రీ సుధాకర్, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్, ఎన్హెచ్ఎఐ పిడి విద్యాసాగర్, జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇక ముఖం చూపితేనే సరుకులు..

### - అమల్లోకి కొత్త విధానం
### - అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్

**ఒంగోలు, ప్రభాతవార్త**

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పాటు గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. కేంద్రాలకు రాలేని వారి ఇళ్లకు వెళ్లి సరుకులు అందిస్తున్నారు. ఈ క్రమంలో సరుకులన్ని పక్కదారి పడుతున్నాయని లబ్దిదారులకు అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీటికి చెక్ పెట్టి లబ్దిదారులకు సరుకులు చేరేలా కేంద్ర ప్రభుత్వం నూతన సంస్కరణకు శ్రీకారం చుట్టింది. మరింత పారదర్శకతకు ముఖ ఆధారిత ధృవీకరణ హాజరు విధానం తెచ్చింది.





లబ్దిదారులకు సరుకులు అందించే సమయంలో చరవాణి ద్వారా వారి ముఖ ఆధారిత హాజరు, ఓటీపీ, నమోదు చేసే విధానం అమలుకు సిద్ధమైంది. గతంలో లబ్దిదారులకు సరుకులు అందించే పోషణ్ అభియాన్ రాకర్లో వివరాలు నమోదు చేసేవారు. నూతన విధానంలో మొదటి చరవాణితో లబ్దిదారుల ఫొటో తీసియాప్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత ఆ చరవాణికి వచ్చిన ఓటీపీ సంఖ్య పోషణ్ రాకర్లో నమోదు చేస్తేనే ప్రక్రియ పూర్తవుతుంది. అప్పుడే సరుకులు అందించాల్సి ఉంటుంది. కొత్త విధానం అమలుకు ఇంటర్నెట్ సౌకర్యం తప్పనిసరి. జిల్లాలో 38 మండలాలు, 762 గ్రామాలు ఉన్నాయి. చరవాణి సిగ్నల్స్ లేని కొన్ని మారుమూల గ్రామాలు సుమారు40శాతం వరకు ఉన్నాయి. వీటి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త విధానం అమలు కాస్త కష్టం. ఆలస్యమయ్యే అవకాశం ఉంది. కొందరు నిర్వాహకులు తమ సొంత చరవాణిలను వినియోగిస్తూ వివరాలు నమోదు చేస్తున్నారు. వాటితో పాటు చిన్నారుల ఆధార్ కార్డుల సమస్య కూడా ఈ విధానానికి ఇబ్బందిగా ఉంది. కొందరికి అసలు లేకపోవడం, మరి కొందరికి తప్పులు దొర్లడం వంటి సమస్యలు అధికమించి పోషణ్ రాకర్లో నమోదు చేయాల్సి ఉంది. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం సక్రమంగా అమలుకు నోచుకుంటుంది. కొత్త విధానం పకడ్బందీగా అమలు చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు కృషి ఫలించనుంది. దీని వలన ఎవరికి సరుకులు ఇచ్చాం, ఎంత ఇచ్చాం అనే వివరాలు ఉండటం వల్ల పక్కదారి పట్టడానికి అవకాశమే ఉండదు. సమస్యలు పరిష్కరిస్తూ అన్ని కేంద్రాల్లో అమలయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# ఏపిలో ఆరు నెలలకే అటకెక్కిన ధరల నియంత్రణ పథకం

**- మాయమైన బియ్యం, నూనెల నియంత్రణ**

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కంది పప్పు, వంట నూనె ధరల నియంత్రణ హడావుడి ఆరు నెలలకే ముగిసిపోయింది. మార్కెట్ నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణ ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించిన ఆచరణలో మాత్రం చతికిల పడ్డారు. మిల్లర్లు, హోల్ సేల్ వ్యాపారుల ఒత్తిళ్లకు ప్రభుత్వం యంత్రాంగం తలొగ్గడంతో ధరల నియంత్రణ కాస్త ఆటకెక్కింది. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఏమి జరిగిందనేది అందరితో ఆసక్తి రేకెత్తిస్తుంది. ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతున్నారని, నిత్యవసర వస్తువుల ధరలను కొంతైన తగ్గించేందుకు అధికారంలోకి రాగా గతజులైలో ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పౌరసరఫరాల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు చేపట్టింది. చుక్కలను అంటుతున్న బియ్యం, కంది పప్పు ధరలను నెలకు దించేందుకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత కొద్ది నెలలుగా పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు గత ఏడాది జులైలో ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఒక వైపు వేల కోట్ల రూపాయలు వెచ్చించి పౌరసరఫరాల శాఖల ద్వారా ఇంటింటికి చౌక ధరల బియ్యంతో సరఫరా చేస్తున్న బహిరంగ మార్కెట్లో మాత్రం నాణ్యమైన బియ్యం ధరలు క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. 2023లో మిగ్‌జామ్ తుఫాన్ సమయం నుంచి మిల్లర్లు బియ్యం ధరలను కృతిమంగా పెంచుకుంటూ పోయారు. ఓ దశలో 26 కేజీల బస్తా ధర రూ.1600లు దాటేసింది. రిటైల్ మార్కెట్లో కిలో ధర రూ.70కి చేరువైంది. ఇదే పరిస్థితి కొనసాగితే కిలో ధరను వంద రూపాయలు



స్థిరీకరిస్తారని జనం బెంబేలెత్తిపోయారు. బియ్యం ధరలు కట్టడి విషయంలో వైసీపీ ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడం ఆ పార్టీని నిలువున ముంచేసింది. వేతన జీవులు మధ్యతరగతి ప్రజలు ఎంత మొత్తుకున్నా మొద్దు నిద్రలో నటించారు. ఏపీలో బియ్యం ధరలు పెంచాల్సిన అవసరమే లేకపోయినా బహిరంగ దోపిడికి సహకరించారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరధం పట్టడంతో పౌరసరఫరాల వ్యవస్థను ప్రక్షాళన చేస్తారని అంతా భావించారు. కూటమి ప్రభుత్వం గత ఏడాది జులైలో రైతు బజార్లలో తగ్గించిన ధరలకు కంది పప్పు, బియ్యం విక్రయించాలని నిర్ణయించింది. నిత్యవసరాలైన బియ్యం, కందిపప్పు, స్టీమ్‌డ్ బియ్యం ధరలను తగ్గించి బజార్లలో విక్రయిస్తున్నట్లు గత జులైలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. బహిరంగ మార్కెట్లో కిలో కంది రూ.181లు ఉన్నా రూ.160లు, బియ్యం రూ.52.40 పైసలు ఉంటే రూ.48కి, స్టీమ్‌డు బియ్యం రూ.55.85 లు ఉంటే రూ.49లకు విక్రయిస్తున్నట్లు ప్రకటించారు. రైతు బజార్లల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి బియ్యం, కందిపప్పు, స్టీమ్‌డ్ బియ్యం తగ్గించిన ధరలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. రేషన్ కార్డులపై సరఫరా చేసే బియ్యాన్ని కిలోకు రూ.43.50 లు ఖర్చు చేస్తుంది. అయితే అవ్వన్నీ దొడ్డురకాలు కావడంతో ప్రభుత్వం సరఫరా చేసే బియ్యంలో 80శాతానికి పైగా పక్క దారి పడుతున్నాయి. ఈ క్రమంలో సన్న బియ్యాన్ని తక్కువ ధరకు విక్రయించడం అందరిలో సంతోషం నింపింది. రూ.49లు సన్న బియ్యం విక్రయించాలని, మాల్స్, హోల్ సేల్ వ్యాపారులు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే సరిగ్గా మూడు నెలలు కూడా అమలు కాలేదు. సన్న బియ్యం రకాలు రూ.49లకు విక్రయించే పరిస్థితులు లేవంటూ మిల్లర్లు చేతులెత్తేశారు. వంట నూనెలు, బియ్యం ధరలను తగ్గించడంపై ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని భావించిన వాస్తవానికి అలా జరగలేదు. సివిల్ సప్లై చేపట్టిన అరకొర చర్యలు పెద్దగా ఫలితాన్ని ఇవ్వలేదు. అదే సమయంలో ధరల తగ్గింపుతో తమ వ్యాపారాలకు నష్టం కలుగుతుందని మిల్లర్లు, హోల్ సేల్ వ్యాపారులు ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంలో సక్సెస్ అయ్యారు. దీంతో గత రెండు నెలలుగా మార్కెట్లో ఈ బోర్డులు ధరలు మాయమైపోయాయి. గుట్టుచప్పుడు కాకుండా సబ్సీడీ ధరలకు వంట నూనెలు, బియ్యం, కందిపప్పు అమ్మకాలను మాయం చేశారు. పండుగ సీజన్‌లో అధిక ధరలకు బియ్యం, నూనెలు కొనుగోలు చేసే పరిస్థితి కల్పించారు.

## అద్దంకి పట్టణ సి.ఐగా సుబ్బరాజు – బాధ్యతలు స్వీకరణ



**అద్దంకి , జనవరి 16 , ప్రభాతవార్త**

అద్దంకి పట్టణ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ. సుబ్బరాజు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా ఎస్.సి.ఎస్.టి సెల్ -1, ఎస్‌పిఎస్‌ఆర్‌లో పనిచేస్తూ, బదిలీపై అద్దంకి వచ్చారు. ఆమేరకు ఉన్నతాధికారుల నుండి వెలువడిన ఉత్తర్వులు నేపద్యంలో సి.ఐ. ఏ.సుబ్బరాజు అద్దంకి ఎస్‌హెచ్‌ఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన ముందుగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకొని, స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం విధులలో చేరారు. ఏ.సుబ్బరాజు గతంలో 2019 ఎన్నికల ముందు అద్దంకి ఎస్.ఐ.గా పనిచేశారు. ఇప్పటి వరకు అద్దంకి పట్టణ సి.ఐ.గా పనిచేసిన కృష్ణయ్యను వి.ఆర్‌కు బదిలీ చేశారు.

## వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి – ఎ.ఒ.

**అద్దంకి , జనవరి 16 , ప్రభాతవార్త**



వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. వెంపరాల మరియు చక్రాయపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీలో సాగు చేసిన వరిలో కాండం తొలుచు పురుగును గమనించడం జరిగింది. దాని నివారణ కొరకు కార్బోఫ్యురాన్ 3జి గుళికలు చల్లుకోవాలని సూచించారు. చిరుపొట్ట దశలో పురుగు ఆశించినప్పుడు తెల్ల కంకులు వస్తాయని నష్టం ఎక్కువగా వుంటుందని తెలిపారు. ఈ కార ్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శేషయ్య, సయింపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరికట్లవారిపాలెం, రేణింగవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంపై స్పందించిన ప్రజలు



**జె,పంగులూరు , జనవరి 16 , ప్రభాతవార్త**

మండలంలోని ఆరికట్ల వారిపాలెం, రేణింగవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆధారంగా పంటలు సాగుచేయడం వల్ల ఎరువులు పై పురుగు మందులపై పెట్టు అధిక ఖర్చులు తగ్గించుకోవచ్చనని, పచ్చిరొట్ట పంటలైన జీలుగ, జనుము, మరియు పల్లి పెసరసాగు చేసి పూత దశకు వచ్చినప్పుడు భూమిలో కలియదున్నటం వలన భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందని తద్వారా నేల ఆరోగ్యంగా వుండి పంటలు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రైతులు సాగుచేసిన శనగ, మొక్కజొన్న మరియు మిరప పంటలను ఆయన పరిశీలించారు. రబీ కాలంలో పంటల సాగుచేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని, దీని వలన పండించిన పంటను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవటకు, ప్రకృతి వైపరీత్యాలు వలన పంట నష్టం జరిగితే నష్ట పరిహారం పొందుటకు మరియు స్వచ్ఛందంగా పంటల భీమా చేయించుకున్న వారికి భీమా వర్తింపచేయాలన్న పంటను నమోదు అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో రైతు సేవ కేంద్ర అధికారులు ఎం. అలెగ్జెండర్, శివాని మరియు రైతులు పాల్గొన్నారు.

## రీ సర్వేకు రైతులంతా సహకరించండి – తహశీల్దార్ రవి నాయక్



**బల్లికురవ, జనవరి 16, ప్రభాతవార్త**

భూముల రీస్వేకు రైతులంతా సహకరించిన సర్వే పారదర్శకంగా నిర్వహించేందుకు తమ వంతు శ్రద్ధ చూపాలని తహశీల్దార్ రవి నాయక్ అన్నారు. మండలంలోని అంబడిపూడి గ్రామంలో గురువారం జరిగిన రెండవ భూముల రీ సర్వే ర్యాలీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. స్థానిక సచివాలయం వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ వద్ద నున్న పత్రాలను తీసుకొని రీసర్వే జరిగే సమయంలో సంబంధిత అధికారులకు తమ వంతు సహకారం అందజేయాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా రీ సర్వే కొనసాగుతుందన్నారు. భూములకు హద్దులు నిర్ధారించే సమయంలో సంబంధిత రైతులు అధికారులకు తమ వంతు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు రవికుమార్, ప్రహర్ష, మాజీ సర్పంచ్ మందలపు సుధాకర్, తెలుగు రైతు అధ్యక్షుడు దద్దాల అంజయ్య, బోట్లగుంట హరిబాబు, నీటి సంగం అధ్యక్షుడు దద్దాల విజయ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నదోర్నాల, జమ్మిదోర్నాలలో పొలం పిలుస్తోంది



**పెద్దదోర్నాల, జనవరి 16, ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలంలోని చిన్నదోర్నాలు, జమ్మిదోర్నాల గ్రామాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువాం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామంలో సాగు చేసిన మినుము, జొన్న పంటలను సందర్శించి మినుము పంటలో బూడిద తెగులు నివారణకు వెటబుల్ సల్ఫేర్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు చెప్పారు. అలాగే కాయతొలుచు పురుగు నివారణకు ఫ్లూబెండోమైడ్ 20శాతం ఎస్‌సీ 300 గ్రాములు 500 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు తెలియజేశారు. వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న ఈ పంట నమోదు పథకం, సున్నా వడ్డీ పంట రుణాలు,పీఎం కిసాన్ ఏపీఎస్ఎస్ యాప్ మొదలగు పథకాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఏ.చైతన్య కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.రాజేంద్ర ప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గ్రామస్తులను ఆకట్టుకొన్న చిన్నారుల కోలాటం

**మార్టూరు, జనవరి 16, ప్రభాతవార్త**



మండలంలోని కొలలపూడి సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన కోలాటం గ్రామస్తులను ఆకట్టుకొంది. హైస్కూల్ విద్యార్థులతో కోలాటం నిర్వహించారు. ప్రజా సంఘాల గేయాలు, విద్యార్థుల నృత్యాలు గ్రామస్తులను ఆకర్షించాయి. కోలాటం మాస్టారు రాజా రమేష్, ప్రజా సంఘాలు గాయకుడు అనిల్ పాటలు ఆకట్టుకున్నాయి. రైతుల బాధలు, మహిళల రక్షణాలు, నిరుద్యోగులకు బాధలు తదితర అంశాలతో పాడారు. ఈ కార్యక్రమాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య ప్రారంభించారు. యడవల్లి ప్రసాద్, రమేష్, ఏడుకొండలు, బొడ్డు గంగారావు, దాసరి వసంతరావు, బొడ్డు చంద్రశేఖర్, కండిమల్ల నాగేశ్వరరావు, ప్రభుదాస్, రవి, అమరేశం, శ్రీను, సర్పంచ్ ఎం.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుల నమోదులో తప్పుల సవరణ

**బల్లికురవ, జనవరి 16, ప్రభాతవార్త**



మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కుల నమోదులో తప్పుల సవరణలు కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కందుకూరు పేతురు మాదిగ తెలియజేశారు. వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, గుంటుపల్లి సచివాలయాల పరిధిలో ఎస్సీ మాదిగ కుల గణన, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు సమక్షంలో ఎస్సీ మాదిగ కులస్తుల పేర్లు క్రిస్టియన్స్‌గా నమోదైన పేర్లను ఎస్సీ మాదిగ ఆధార్ కార్డులతో కుల దృవీకరణ పత్రాలతో నమోదు చేశారు. సచివాలయం డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, రెవెన్యూ సిబ్బందికి తప్పుల సవరణ గురించి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కందుకూరి పేతురు వివరించారు.

## నెలాఖరులోగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి



**బల్లికురవ, జనవరి 16, ప్రభాతవార్త**

మండలంలోని వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయాధికారి కుమారి రైతులతో కలిసి వరి, మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెరపురుగును గమణించి నివారణ చర్యలు తెలియజేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూఈ నెలాఖరులోగా సాగు చేసిన పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఖరీఫ్‌లో పండించిన ధాన్యాన్ని అమ్ముకోదలచిన వారు రైతు సేవా కేంద్రం సిబ్బందిని కలిసి షెడ్యూల్ ఇప్పించుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలను అనుసరించి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. తేమ శాతం 17శాతం ఉండేవరకు ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కజొన్న, అలసందల పంటలను పరిశీలించిన ఏఓ శ్రీనివాసులు

**మార్కాపురం రూరల్, జనవరి 16, ప్రభాతవార్త**



మండలంలోని పెద్ద యాచవరం, పెద్ద నాగులవరం గ్రామాల యందు గురువారం మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న, మరియు అలసందల పంటల యందు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. అలాగే మొక్కజొన్న, అలసంద పంటల కోత సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం పెద్ద యాచవరం, పెద్ద నాగులవరం గ్రామాల యందు గ్రామసభలు నిర్వహించి రబీ 2024 సీజన్ యందు రైతులు సాగు చేసిన ప్రతి పంటను రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఈ–పంటలో నమోదు చేపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద యాచవరం, పెద్ద నాగులవరం గ్రామాల రైతుసేవా కేంద్రం సిబ్బంది జయంతి, నవ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## బేస్తవారిపేట వద్ద రోడ్డు ప్రమాదం.. ఇరువురు మృతి.. –పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

**మార్కాపురం రూరల్, జనవరి 16, ప్రభాతవార్త**



మండలంలోని భూపతిపల్లి గ్రామానికి చెందిన రైతు కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ వెనుక డోర్ విరిగి అందులోనుంచి 5మంది కూలీలు కిందపడిన సంఘటన ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం కలగట్ల వద్ద గురువారం జరిగింది. గాయపడిన వారిని హుటాహుటిన కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అందులో గ్రామానికి చెందిన మేడం కాశయ్య, మల్లాపురం శ్రీనులు మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం చోటచేసుకున్న సమయంలో 23మంది ట్రాక్టర్‌లో ఉన్నట్లు సమాచారం. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆసుపత్రికి వెళ్ళి కాశయ్య, శ్రీనులకు నివాళులర్పించారు. జరిగిన ప్రమాద సంఘటన వివరాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని భరోసా కల్పించారు.

## కలగట్ల వద్ద పొగాకు కూలీల ట్రాక్టర్ బోల్తా – ఇరువురు మృతి.. 5 మందికి తీవ్రగాయాలు

**బేస్తవారిపేట, జనవరి 16 ,ప్రభాతవార్త**



మండలంలోని కలగట్ల గ్రామ సమీపంలో పొగాకు కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇరువురు కూలీలు మృతిచెందగా మరో 5 మందికి గాయాలయ్యాయి. మృతులు మార్కాపురం మండలం భూపతిపల్లి గ్రామానికి చెందిన మేడం కాశయ్య, మల్లాపురం శ్రీనులుగా గుర్తించారు. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలందిస్తున్నారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైసీపీ క్యాలెండర్ ఆవిష్కరించిన జడ్పీటీసీ

**వెలిగండ్ల, జనవరి 16, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన వెలిగండ్ల జడ్పీటీసీ కార్యాలయం నందు వైసీపీ 2025 క్యాలెండర్ ప్రకాశం జిల్లా జడ్పీటీసీల సంఘం అధ్యక్షులు వెలిగండ్ల జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి మండల వైఎస్సార్‌పార్టీ నాయకులు ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్‌పార్టీ బలోపేతానికి ప్రతి వైఎస్సార్ పార్టీ నాయకులు, వైఎస్సార్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ మండల అధ్యక్షులు గజ్జల వెంకటరెడ్డి, వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు, తమ్మినేని శివరామయ్య, గంజి రవీంద్రరెడ్డి, ఆవుల నారాయణ, గజ్జల నాగిరెడ్డి, ఎలికా నారాయణ, తాతపూడి నాని, మండల వైఎస్సార్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చినమనగుండం మాజీ సర్పంచ్ రమణయ్య మృతి – పలువురు నాయకులు నివాళులు



**కొనకనమిట్ల, జనవరి 16, ప్రభాతవార్త**

మండలంలోని చినమనగుండం గ్రామ పంచాయతీ సర్పంచ్ కొల్లా రమణయ్య(90) గురువారం మృతి చెందారు. రమణయ్య ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం ఒంగోలు హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు రమణయ్య, చినమనగుండం పంచాయతీ సర్పంచ్‌గా రెండు దఫాలుగా పదవి బాధ్యతలు చేపట్టి పలువురి మన్ననలు పొందారు. అప్పట్లో దివంగత మాజీ ఎమ్మెల్యే కందుల నాగార్జునరెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొందారు. ఈయనకు భార్య సుబ్బమ్మ, ముగ్గురు కుమారులు, మనువళ్లు, మనువరాళ్లు కలరు. రమణయ్య కుమారుడు కొల్లా కోటేశ్వరరావు కూడా చినమనగుండం సర్పంచ్‌గా పదవిలో కొనసాగారు. రమణయ్య భౌతిక కాయాన్ని, మాజీ సర్పంచ్ ఈర్ల బాల వెంకటేశ్వర్లు, గుత్తా శ్రీనివాసులు, చెన్నకేశవులు, తిరుపతయ్య, పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

## మాజీ ఏఎంసీ చైర్మన్ రామలింగయ్య సంస్మరణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కందుల

**కొనకనమిట్ల, జనవరి 16, ప్రభాతవార్త**



మండలంలోని చినమనగుండంలో గురువారం జరిగిన పొదిలి మాజీ ఏఎంసీ చైర్మన్, మాజీ సర్పంచ్ చప్పిడి రామలింగయ్య సంస్మరణ కార్యక్రమానికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి,పలువురు నాయకులు హాజరయ్యారు . ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, మండల మాజీ టీడీపీ కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, వెలుగొండ ఆలయ మాజీ చైర్మన్ కుందురు కాశిరెడ్డి, పొదిలి మాజీ జడ్పీటీసీ కాటూరి నారాయణ, ప్రతాప్, నాయకులు ఏదుబాటి వెంకట నారాయణ చౌదరి, సీహెచ్ చెన్నకేశవులు, గుత్త శ్రీను, మాజీ సర్పంచ్ ఈర్ల బాల వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్లపాడు తిరునాళ్ల







**కురిచేడు, జనవరి 16, ప్రభాతవార్త**

మండలంలోని పొట్లపాడులో వేంచేసి ఉన్న శ్రీ గుత్తికొండ రామయోగిస్వామి తిరునాళ్ల గురువారం ఘనంగా జరిగింది. ఉదయమే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికై బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు సంతానం కోసం స్వామివారి ఎదుట వరపడ్డారు. ఆలయ సమీపంలోనే పొంగళ్లు వండి నైవేద్యంగా స్వామివారికి సమర్పించారు. రాత్రివేళ ఎండుకొబ్బరిని కిలోల కొద్ది కాల్చి స్వామివారి ఊరేగింపు వద్ద తమ భక్తిని చాటుకున్నారు. మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి వాటి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కురిచేడు ఎస్సై ఎన్.శివ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

## బ్రహ్మంగారి ఆలయ ధర్మకర్తల ఎంపిక

**కురిచేడు, జనవరి 16, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన కురిచేడులో దర్శి రోడ్డు నందు గల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ధర్మకర్తల ఎంపిక గురువారం నాడు జరిగింది. అదే ఆలయంలో కురిచేడు మండల విశ్వబ్రాహ్మణ సంఘీయులు, పెద్దలు సమావేశమయ్యారు. అందులో మైలోజి పరబ్రహ్మాచారిని ప్రథమ ధర్మకర్తగా, వెంగాయ పాలెంకు చెందిన పెసరపాటి చిన్నశంకరాచారిని ద్వితీయ ధర్మకర్తగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సదరు ధర్మకర్తలకు ఆలయ నిర్మాణ కమిటీ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బంగారు వీరబ్రహ్మాచారి, శామంతపూడి వీరబ్రహ్మాచారి, కిస్టిపాటి వెంకటరత్నాచారి, పత్తిపాటి అల్లూరయ్య చారి, కురిచేటి శ్రీను, కే.కొండలు, చెరువుగట్టు నాగరాజు, చోడా శేషబ్రహ్మం, గురుకాంతాచారి, ఉప్పులూరి గోపి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటోకు వెనుక డోర్‌ను ఓపెన్ చేయరాదు

**గిద్దలూరు రూరల్, జనవరి 16 ప్రభాతవార్త**



ఆటో డ్రైవర్లు తమ ఆటోలకు వెనుక ఉన్న డోర్‌ను ఓపెన్ చేయరాదని ఒకవేళ వెనుక డోర్‌ను ఓపెన్ చేసినయెడల లేదా ఆటో వెనుక డోర్ మీద ప్రయాణీకులు ప్రయాణం చేసినా ఆ ఆటోకు రూ.500లు జరిమానా విధించడం జరుగుతుందని గిద్దలూరు సిఐ కె సురేష్ హెచ్చరించారు. ఆటోలకు వెనుక ఉన్న డోర్‌లు ఓపెన్ చేసి ప్రయాణీకులను ఎక్కించిన యెడల ఆడోర్‌ను క్లోజ్ చేసి వెల్డింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఆటో డ్రైవర్లు విషయాన్ని గుర్తించి తమ ఆటోలకు ఉన్న డోర్‌లను క్లోజ్ చేసి ఆటోలను నడుపుకోవాలని, వెనుకభాగాన ఆటోలో ప్రయాణీకులను ఎక్కించకుండా ఉండాలని ఆయన సూచించారు.

## పెంపుడు జంతువులను రోడ్లపైకి వదలకుండా యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి – ఎస్సై కే.మాధవ్‌రావు



**హనుమంతునిపాడు, జనవరి 16, ప్రభాతవార్త**

పెంపుడు జంతువులైనటువంటి గేదెలు, ఆవులు, ఎద్దులు, మొదలైనటువంటి వాటిని రోడ్లపైకి వదలకుండా యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై కే.మాధవ్‌రావు సూచించారు. బాధ్యతరహితంగా రోడ్లపైన జంతువులను వదిలేయడం వలన వాటి కారణంగా ఏవైనా రోడ్డు యాక్సిడెంట్‌లు జరిగితే సదరు పెంపుడు జంతువుల యొక్క యజమానుల పైన క్రిమినల్ కేసులు నమోదు పరిచి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై మాధవ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## మిరపలో నాణ్యతకు మెలుకువలు పాటించాలి

**తాళ్లూరు, జనవరి 16, ప్రభాతవార్త**



మిరపను మండలంలో మూడు వందల ఎకరాలకు పైగా వేశారని, ఎక్కువగా తేజ రకం సాగులో ఉందని, ప్రస్తుతం మిరప కోతలు ప్రారంభమై నందున రైతులు మెలుకువలు పాటించి నట్లయితే, నాణ్యమైన ఉత్పత్తులు, అమ్మకానికి వీలుగా ఉంటాయని, మంచి గిరాకీ వస్తుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తున్నందుకు మంచుకు తడవకుండా కళ్ళాల్లో, ఆరబోతలో శ్రద్ధ వహించాలని, పచ్చి కాయలు, పక్వానికి రాని కాయలు, కుళ్ళిన కాయలు, పిందెలు అన్నింటిని వేరు పరిచినట్లయితే, కాయకుళ్ళు, మచ్చలు రాకుండా, పక్వానికి వచ్చిన కాయలు భాగా ఎండుతాయని, తద్వారా నాణ్యత పెరుగుతుందని, అన్ని సమానంగా ఆరిపోయేలా, రాజు 2 సార్లు, కాయులు తిరగవేయాలని తెలిపారు. నాణ్యమైన కాయలు పౌడర్‌గాను, రంగుల తయారీలోను, ఎసెన్స్‌లు గాను, ఇతర దేశాలకు ఎగుమతి చేయబడుతుందని, అందువలన నాణ్యమైన ఉత్పుత్తులకు మంచి డిమాండ్ ఉంటుందని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు అజ్మీర్, సుష్మసుల్తానా, రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టయ్య

**ఒంగోలు,జనవరి 16, ప్రభాతవార్త**



ఆకలితోఉన్నవారికి అన్నం పెట్టయ్య అన్న సూక్తి గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి ప్రభోదించేవారని ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. సంతపేట గొలగమూడి వెంకయ్య స్వామి దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో పొన్నూరు వేంకట శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్త వేదసారాన్ని శ్రీకృష్ణ స్వరూపమైన వేదవ్యాసుడు పరులకు సేవ చేయుటచే పుణ్యమే అని పరులను పీడించటమే పాపమని చెప్పారన్నారు. పాప పుణ్యాలు మనం చేసే కార్యక్రమాల మీద ఆధారపడి ఉంటాయని తెలిపారు. తన ఆధ్యాత్మిక ఉపన్యాసాల ద్వారా ప్రజల్లో మూఢత్వాన్ని తొలగించి హేతుబద్ధమైన భగవత్ ఆరాధన దిశగా ఆధ్యాత్మిక ఉపన్యాసాలు నిర్వహిస్తున్న పొన్నూరు వేంకట శ్రీనివాసులును ఆలయ నిర్వాహకులు ఆవుల బ్రహ్మయ్య భక్త బృందం సత్కరించారు. ఆర్చకస్వామి సూరపురాజు రాముశర్మను ఈ సందర్భంగా సత్కరించారు. గొలగమూడి వెంకయ్యస్వామి వారికి హారతులు ఇచ్చి పూజా కార్యక్రమాన్ని జరిపించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఆవుల బ్రహ్మయ్య ,భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## వార్డు మహిళా పోలీసు జాబు చార్ట్ యాప్‌ను పాటించాలి

**దొనకొండ,జనవరి 16,ప్రభాతవార్త**

ప్రతి ఒక్క గ్రామ వార్డు మహిళా పోలీసు ఈ జాబు చార్టును పాటించి సంబంధిత రోజు ఏవైతే వారికి ఇచ్చిన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని మహిళా పోలీస్ జాబు చార్టు యాప్ నందు పొందుపరచవలసి ఉంటుంది. ఈ విధంగా జాబు చార్ట్ యాప్ నందు పొందుపరిచిన సమాచారాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించి శాంతి భద్రతల సమస్యలు గానీ ,మహిళలు మరియు చిన్నారుల సంరక్షణకు సంబంధించిన సమస్యలు గానీ ఉంటే వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కావున మహిళా పోలీసులు తమ గ్రామ వార్డు పరిధిలోని వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని మహిళా పోలీస్ జాబ్ చార్టు యాప్ నందు పొందుపరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించుటలో పోలీస్ యంత్రాంగానికి సహాయపడాలని సూచిస్తున్నాం అని ఎస్పీ తెలిపారు.



# టీడీపి నాయకులపై దాడి

**కురిచేడు జనవరి 16, ప్రభాతవార్త**
కురిచేడు మండలంలో బుధవారం అర్ధరాత్రి పడమరనాయుడు పాలెం సమీపంలో టీడీపీ నాయకులపై దాడి జరిగింది. తెలిసిన సమాచారం మేరకు.. సంక్రాంతి సందర్భంగా నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో గల సంగంలో రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు పలువురు టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఇందులో టీడీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు కాట్రాజు నాగరాజు, నాయకులు చంద్రారెడ్డి, కాళ్ళ వెంకటేశ్వర్లు, ముప్పగంగవరం కొండలు తదితరులు కారులో ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నెస్పీ కాలువ దాటిన తరువాత కారును అడ్డగించి గుర్తు తెలియని వ్యక్తులు ఇనుపరాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పాల్గొన్నదెవ్వరో ఇంకా తెలియరాలేదు. బాధితులు కురిచేడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# రాచర్ల ఇన్చార్జి తహశీల్దార్‌గా ఆంజనేయరెడ్డి



**రాచర్ల, జనవరి 16 ప్రభాతవార్త**
రాచర్ల ఇన్చార్జి తహశీల్దార్‌గా ఎం ఆంజనేయరెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు . ప్రస్తుతం ఈయన గిద్దలూరు తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాచర్ల తహశీల్దార్ ఎల్ వెంకటేశ్వర్లు గత డిసెంబర్ 26వ తేదీ నుండి సెలవుపై వెళ్ళడంతో జిల్లా అధికారులు ఆంజనేయ రెడ్డికి రాచర్ల ఇన్చార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన రాచర్ల ఇన్చార్జి తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. ఈ మేరకు జిల్లా అధికారులు నుండి రాచర్ల తహశీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు కూడా వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇన్చార్జి తహశీల్దార్ బాధ్యతలు చేపట్టనున్న తహశీల్దార్ ఆంజనేయ రెడ్డిని రాచర్ల డిప్యూటీ తహశీల్దార్ జి భారతిబాయ్, కార్యాలయ సిబ్బందితో కలిసి గిద్దలూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హర్షగౌడ్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, విఆర్వోలు బి కిశోర్ బాబు, ఎస్ రంగయ్య, ఏ శివారెడ్డి, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ నాగార్జున, విఆర్ఏ క్రాంతి దీపక్, తదితరులు పాల్గొన్నారు.

# ఆనాటి ఆ స్నేహం జ్ఞాపకాలు మధురాతి మధురం...

## - ఆ మధుర స్మృతులను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు..



**రాచర్ల, జనవరి 16 ప్రభాతవార్త**
ఆనాటి ఆ స్నేహం మరువ లేనిదంటూ ఆ మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుంటూ అప్పటి విదార్థులు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకుని అప్పటి రోజులను గుర్తు చేసుకోవడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు మంద బాల రాజు అన్నారు. మండలంలోని అనుములవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 - 2000 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక విద్యార్థులు అంతా పాల్గొని తమ ఆత్మీయ అనుభవాలను పంచుకున్నారు. 25సంవత్సరాల (సిల్వర్ జూబ్లీ) అనంతరం ఈ విధంగా కలిసి తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. దాదాపు 25 సంవత్సరాల క్రితం ఇక్కడ చదివి అనంతరం ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాలు వివిధ రంగాలలో స్థిరపడి ఉంటూ వాటన్నింటినీ వదిలి చదువకునే రోజుల అనుభవాన్ని పంచుకోవడం అభినందనీయమన్నారు. నిమిషం తీరికలేని పరిస్థితుల్లో కూడా ఒకరిని ఒకరు సంప్రదించుకొని అందరూ ఒకే సమయంలో ఒకే ప్రాంతంలో ఒకే వేదిక పంచుకోవడం చాలా గొప్ప విషయం అన్నారు. పూర్వపు రోజుల్లో చదువుకు ఎంతో విలువ, గౌరవం ఉండేవని అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు కూడా వాటికి విలువ ఇచ్చి విద్యను బోదించేవారని, విద్య నేర్చుకున్నారని అన్నారు. గురువులంటే విద్యార్థులు కూడా ఎంతో భయభక్తులు కలిగి నడుచుకునే వారని గురువులు కూడా విద్యార్థులను అలాంటి విద్యతో వారిని శిల్పాల్ల మలిచారని అన్నారు. ఈనాడు వారందరూ తాము చదువుకునే రోజులు కూడా తమకు గుర్తుకు వస్తున్నాయని వాటిని నెమరు వేసుకోవడం ఎంతో తృప్తిగా, ఆనందంగా ఉందని అన్నారు. ఆ రోజులు ఇక లేవని, రావని ఆ రోజులే ఎంతో గొప్పవని అన్నారు. నేటి రోజుల్లో స్నేహాలకు, అనుభవాలకు, విద్యకు, ఆత్మీయతలకు, అనుబంధాలకు విలువలు లేకుండా పోయాయని ప్రస్తుతం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో ఇప్పటి విద్యార్థులు కూడా అలాంటి అనుభవాలు పంచుకొని ముందుముందు రోజుల్లో భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలతో చదువుకునే రోజులను అప్పటి స్నేహాలను, అనుభవాలను, ఆత్మీయతలను గుర్తు చేసుకుంటూ ఆ తరానికి గుర్తింపు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను, విద్యార్థులను అందరినీ తమ పాఠశాల తరపున అభినందిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి సన్మానించారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఆత్మీయ అనుభవాలు పంచుకోవడం పలువురిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు చెన్న కృష్ణయ్య, బాబురావు, రంగారెడ్డి, జయమేరి, రంగస్వామి, అచ్చుతరావు, రాధా సుధాకర్, బాష, జయరామిరెడ్డి, పూర్వ విద్యార్థినీ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



# సమాజ పున:నిర్మాణానికి స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా కృషి

**గిద్దలూరు రూరల్, జనవరి 16 ,ప్రభాతవార్త**
దేశంలో 42సంవత్సరాలుగా విద్యార్థి, యువకులను చైతన్య పరచి దైవదేశాలకు అనుగుణంగా సమాజ పున:నిర్మణానికి స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సంసిద్దులను చేస్తుందని ఎంపిజే సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ ఎస్ఎం ఖదీర్ బాషా అన్నారు. విద్యాలయాల్లో నైతిక విలువలను పెంపొందిస్తూ ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ కృషిచేస్తుందని తెలిపారు. ప్రతి వారం చిన్నపిల్లలకు, విద్యార్థులకు, యువకులకు, నైతిక శిక్షణ కొరకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా సంక్రాంతి సెలవులు పురస్కరించుకొని గిద్దలూరులోని చిన్న మజీద్ నందు ప్రతి సంవత్సరం లాగానే ఈ సారి కూడా హైస్కూల్ స్థాయి పిల్లలకు నైతిక శిక్షణ తరగతులను ఎస్ఐఓ నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 13 నుండి 16వ తేదీ వరకు విద్యార్థులకు నైతిక, ఆధ్యాత్మిక, సందేశాత్మక, శిక్షణా తరగతులను ఎస్ఐఓ నిర్వహించిందన్నారు. ఇందులో 50మంది విద్యార్థులు పాల్గొని ప్రయోజనం పొందినట్లు తెలిపారు. గురువారం శిక్షణ తరగతుల ముగింపు సమావేశం నిర్వహించి ఇందులో తరగతులకు హాజరైన విద్యార్థుల్లో విశేష ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ స్థానిక అధ్యక్షులు ఫయాజ్ హుస్సేన్ మరియు సభ్యులు ఇంకా మజీద్ ఇమామ్‌లు అబ్దుల్ రషీద్, మౌలానా అబ్దుల్ హక్, మౌలానా ఉస్మాన్, హాఫీసబ్ పాల్గొన్నారు.



# ముండ్లపాడు రోడ్డులో కలకలం సృష్టించిన నాగుపాము



**గిద్దలూరు రూరల్, జనవరి 16, ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని స్థానిక ముండ్లపాడు రోడ్డులోగల ఒక రేకుల షెడ్‌లో గురువారం నాగుపాము కలకలం సృష్టించింది. రేకుల షెడ్ యజమాని భూపాల్ సమాచారాన్ని స్థానిక అటవీశాఖ అధికారులకు తెలియపరచగా ఎఫ్ఆర్ఓ మధు ప్రియాంక ఆదేశాల మేరకు డిఆర్ఓ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో రెస్క్యూటీమ్ మౌలాలి, ప్రసాద్, శివ ఆ ప్రదేశానికి చేరుకొని చాకచక్యంగా పామును పట్టుకుని స్థానిక అటవీ ప్రాంతంలోకి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా రేకుల షెడ్ యజమాని, స్థానికులు అటవీశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రాచర్ల ఆర్ఐగా బాధ్యతలు స్వీకరించిన హర్షగౌడ్

**రాచర్ల, జనవరి 16, ప్రభాతవార్త**



రాచర్ల మండల ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్)గా హర్షగౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మద్దిపాడు మండల తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై రాచర్ల ఆర్ఐగా రావడం జరిగింది. రాచర్ల మండల తహశిల్దార్ కార్యాలయంలో గత కొంతకాలంగా ఆర్ఐ స్థానం ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఇప్పటివరకు ఇన్చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా బి జాషువా ఇమ్మానుయేల్ బాధ్యతలు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్ఐ హర్షగౌడ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.

# నిబంధనలకు విరుద్దంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తాం

## - రూరల్ సిఐ రామకోటయ్య



**రాచర్ల, జనవరి 16 ప్రభాతవార్త**
వాహనదారులు నిబంధనలకు విరుద్దంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె రామకోటయ్య అన్నారు. రాచర్ల సబ్ ఇన్‌స్పెక్టర్ పి కోటేశ్వరరావుతో కలిసి గురువారం సాయంత్రం ఆయన గుడిమెట్ట పంచాయితీలోని జి కొత్తపల్లి గ్రామంలో నిబంధనలకు విరుద్దంగా తిరుగుతున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్టర్‌లో పచ్చి పొగాకు లోడు తీసుకుని వెళ్ళడం మంచిదేనని ఆ లోడ్‌పై కూలీలను ఎక్కించుకుని పోవడం ఏమిటని ఆయన డ్రైవర్‌ను ప్రశ్నించారు. ట్రాక్టర్‌కు ట్రాలీకి మధ్యన కూలీలను ఎక్కించుకోవడం, డ్రైవర్ ప్రక్కన కూర్చోబెట్టుకోవడం పచ్చి ఆకు లోడ్‌పై కూలీలను ఉంచడం సరికాదని ఏవైనా జరగరాని ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏమిటని ఆయన అన్నారు. ఇకపై ఇలాంటి ఆలోచనలకు స్వస్తి పలకాలని లగేజ్ వాహనాలపై కూలీలను కానీ, ప్రయాణీకులను కానీ ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేసులు నమోదుచేస్తామని ఆయన హెచ్చరించారు. ఇష్టానుసారంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నారని వాహనదారుల నిర్లక్ష్యం వలన జరగరాని నష్టాలు జరుగుతున్నాయని కాబట్టి వాహనదారులు జాగ్రత్తలతో పాటు నిబంధనలు పాటించాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే పోలీసులు తీసుకునే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# వ్యాపారమయంగా మారిన విద్య, వైద్యరంగాలు

## - అంగన్‌వాడీ వర్కర్స్ హెల్ఫర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

**సంతనూతలపాడు, జనవరి 16, ప్రభాతవార్త**



నేడు విద్య, వైద్య రంగాలు వ్యాపారమయంగా మారాయని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్ఫర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ ఆరోపించారు. సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో ఆము ముఖ్య అతిదిగా పాల్గొని ప్రసంగించారు. సామాన్య ప్రజలు నేడు ప్రైవేటు హాస్పిటల్‌లో వైద్యం చేయించుకొనే పరిస్థితి లేదని సుబ్బరావమ్మ పేర్కొన్నారు. వైద్యం ఖరీదైపోయిందని ఆమె ఆరోపించారు. విద్య, వైద్య రంగాలు ప్రైవేటు రంగంపై ఆమె ధ్వజమెత్తారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో హర్షనీయమన్నారు. ప్రభుత్వం వ్యాపార సంస్థలుగా మారిన విద్యా వైద్య రంగాలను కట్టడికి చర్యలు తీసుకోవాలని సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి నల్లూరి వెంకట నరసింహం ఐద్వా నాయకులు ఎస్‌కే నాగూర్ బి. అబ్బూరి బసవమ్మ, మండల ఐద్వా అధ్యక్షురాలు బంక పద్మ, సీఐటీయు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి ఈదర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కులదూషణ ఫిర్యాదు

**బల్లికురవ, జనవరి 16, ప్రభాతవార్త**
మండలంలోని కొత్తూరు గ్రామంలో ఇరువురు యువకుల మధ్య తలెత్తిన వివాదం కుల దూషణ ఫిర్యాదుకు దారితీసింది. గ్రామానికి చెందిన యాకోబు అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన గోవర్ధన్, మరికొందరు కుల దూషణ చేస్తూ దాడి చేశారని గురువారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దాడి చేసిన వ్యక్తులకు సంబంధించిన వాహనాలను కూడా స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. కుల దూషణ చేస్తూ దాడి చేసిన వ్యక్తులపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కందుకూరి పేతురు మాదిగ డిమాండ్ చేశారు.

# ముగ్గులు తదితర పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ



**సంతనూతలపాడు, జనవరి 16, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని జెండా చెట్టు వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ముగ్గులు తదితర పోటీల విజేతలకు ఒంగోలు సిరి హాస్పిటల్ ఎండి డాక్టర్ జే.మధుబిందు, లలిత డెంటల్ హాస్పిటల్ వైద్యులు యు.నరేంద్ర, లలిత, సంతనూతలపాడు జడ్పీటీసీ దుంపా రమణమ్మ, అడ్వకేట్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణారెడ్డి, ఉపాధ్యాయురాలు వేమూరి నాగమణి తదితరులు బహుమతులను పంపిణీ చేశారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా రెడ్డి బజార్ వారి ఆధ్వర్యంలో దుంపా అజయ్ కుమార్‌రెడ్డి, దుంపా మౌనిక, శీలం అయ్యప్ప రెడ్డి, మారెడ్డి అనిల్‌కుమార్ తదితరులు ఈ పోటీలను నిర్వహించారు. గత మూడు రోజులుగా చిన్నారులు, మహిళలకు, ముగ్గుల పోటీలు, తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులచే ప్రదర్శించబడిన కూచిపూడి నృత్యాలు పలువురిన ఆకట్టుకున్నాయి. మూడు రోజుల పాటు వైభవంగా ఈ వేడుకలను రెడ్డి బజార్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సేవాసంకల్ప ట్రస్టు ఆధ్వర్యంలో 35వ వారం పేద వర్గాలకు అన్నదాన వేడుకలు



**సంతనూతలపాడు, జనవరి 16, ప్రభాతవార్త**
సంతనూతలపాడులో గురువారం నాడు సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 35వ వారం దాతలు ట్రస్టు సభ్యులు ఒంగోలుకు చెందిన నల్లూరి శేషయ్య కుమారుడు అనుదీప్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ అన్నదాన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ట్రస్టు సభ్యులు నల్లూరి శేషయ్య కుమారుడు అనుదీప్ కట్ చేశారు. అనంతరం పేవ వర్గాలకు అన్నదాన వేడుకలను నిర్వహించారు. సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఎన్నాఐ పాతూరి సంపత్, ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో దేశ విదేశాల నుండి దాతల ఆధ్వర్యంలో ఒక పక్క సేవలను మరొక పక్క అన్నదాన వేడుకలను నిర్వహిస్తున్నారు. గత 35 వారాల నుండి ఈ అన్నదాన వేడుకలను దాతల ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ శనగల వెంకటరమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్ట్ సెక్రటరీ చివుకుల సుబ్బయ్య, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్టు సభ్యులు శీలం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు హైస్కూల్ విద్యార్థులు ఎంపిక



**సంతనూతలపాడు, జనవరి 16, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కే.వనజ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17నుండి 19వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ హెచ్‌ఎం ఓబుల్, హాకీ క్లబ్ మైనంపాడు అధ్యక్షులు గొడుగు కాలేషా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, హాకీ క్లబ్ మైనంపాడు వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థుల్ని పీఈటీ రవికుమార్‌ని ప్రత్యేకంగా ఇన్‌ఛార్జీ హెచ్‌ఎం ఓబుల్, ఉపాధ్యాయులు, హాకీ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

# ఫిబ్రవరి 15వ తేదీ జరిగే మాలల కళల మహాజాతరలను జయప్రదం చేయండి





**సంతనూతలపాడు, జనవరి 16, ప్రభాతవార్త**
చీమకుర్తి హైస్కూల్‌లో ఫిబ్రవరి 15వ తేదీన జరిగే మాలల కళల మహాజాతరలను జయప్రదం చేయాలని మాలల మహాసభ జాతీయ అధ్యక్షులు, వర్గీకరణ వ్యతిరేక సుప్రీంకోర్టు న్యాయ పోరాట యోధులు మల్లెల వెంకటరావు కోరారు. సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట అంబేద్కర్ నగర్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం జరిగిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమావేశంలో వెంకటరావు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షులు దండేల కృష్ణ అధ్యక్షత వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ వాదులుగా పాలక పార్టీలను, ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న సందర్భంగా బీజేపీ ఆర్ఎస్ఎస్ కుట్టలో భాగంగా ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు, తదితర వర్గీయులు ఎమ్మార్పీఎస్‌కు మద్దతిస్తూ రిజర్వేషన్‌ను ఎత్తివేయాలని కుట్రలు పన్నుతున్నారని వెంకటరావు ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ తదితర పార్టీల కుట్రలను ఎదుర్కొనాలని ఇందుకు తప్పనిసరిగా పోరాటం చేయాలని వెంకటరావు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 15న చీమకుర్తి హైస్కూల్ గ్రౌండ్ నందు మాలల కళల కర్రస్వాము, మల్లా యుద్ధం, కోలాటం, బుర్ర కథ, తదితర 30 ప్రదర్శనలు కలవన్నారు. ఈ జాతర్లకు తెలంగాణ ఎమ్మెల్సీ కవి గాయకులు గోరేటి వెంకన్న, తెలంగాణ ఎమ్మెల్యే జి.వివేక్, సంఘ నాయకులు నాగరాజు, రాజేష్, బాలనాదం తదితరులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చప్పిడి వెంగళరావు, గాయకులు అంబేద్కర్ కళామండలి వ్యవస్థాపకులు సీనియర్ జర్నలిస్టు నూకతోటి శత్‌కుమార్, మాజీ సర్పంచ్ కైలా శేషయ్య, సంఘ నాయకులు దాసరి సుబ్బారావు, నూకతోటి కార్తీక్, సురేష్, మీడిసల దినేష్, దారా నవీన్, అశోక్, నూకతోటి అరుణ్ కుమార్, ఎం.సుబ్బరాయుడు, పి.భాను తదితరులు పాల్గొన్నారు.

# పేర్నమిట్టలో మాజీ ఎంపీపీ గోవిందు కుమారుడు సాయికి

## ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.8,88,797 చెక్కు పంపిణీ

**సంతనూతలపాడు, జనవరి 16, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పాత అంబేద్కర్ నగర్ నందు గురువారం సాయంత్రం మాజీ ఎంపీపీ వివరం గోవిందు తనయుడు వెంకట సాయికి సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ సీఎంరిలీప్ కింద రూ.8,88,797 రూపాయల చెక్కును పంపిణీ చేశారు.ఆయా బాధితుడు గృహం వద్దకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ వెళ్లి ఈ చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి బాబు, మాజీ ఎంపీపీ వివరంగోవిందు,టీడీపీ నాయకులుపోతినేని శ్రీనివాసరావు,నూకతోటి రాఘవరావు, డి.హనుమంతరావు, పెనుబాక బ్రహ్మయ్య, ఎం.పోలయ్య, కైలా శ్రీనివాసరావు, దాసరి కోటేశ్వరరావు, టి.అనిల్,కే.హరిబాబు,ఏ.బ్రహ్మయ్య, జనసేననాయకులు,తిరుమలశెట్టిరాము తదితరులు పాల్గొన్నారు.

# కందుల ప్రవీణ్ అకాల మరణానికి ప్రగాఢ సానుభూతి

**నాగులుప్పలపాడు,జనవరి 16,ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామ వైసీపి నాయకులు పారిశ్రామిక వేత్త కందుల డేనియల్ చిన్నకుమారుడు కందుల ప్రవీణ్(చిన్ని) అకాల మరణానికి చింతిస్తూ సంతనూతలపాడు నియోజకవర్గ వైయస్సార్‌సిపి ఇంచార్జి మాజీ మ ం త్రి ,బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేరుగు నాగార్జున మరియు ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు,దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వారి కుటుంబానికి తమప్రగాఢసానుభూతి తెలియజేశారు.ఆయన అంత్యక్రియలుఆయన స్వగ్రామంలో జరుగుతాయన్నారు.

# త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు

## - ఒంగోలు గాయత్రీ మందిర నిర్వహణలో

**ఒంగోలు,జనవరి 16,ప్రభాతవార్త**
ఒంగోలు త్యాగరాజ సేవాసమితి ఆధ్వర్యంలో మంగమూరుడొంక గాయత్రీ మందిరంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు నేలబొట్ల సౌమ్య శిష్య బృందంచే శ్రీ త్యాగరాజ స్వామి వారి ఉంచవృత్తి కార్య క్రమాలు,సాయంత్రం 6 గంటలకు సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు శ్రీ త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు,జ్యోతి ప్రజ్వలన ,ఆరాధన కార్య క్రమాలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన విజేతలకు మాంటిస్సోరి విద్యా సంస్థల అధినేత పి.ప్రకాష్ వారిచే బహుమతి కార్యక్రమం జరుగుతుంది. కావున సంగీత ప్రియులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు కోరారు.

## మృతుల కుటంబానికి ఎమ్మెల్యే మాలకొండయ్య పరామర్శ

**చీరాల, జనవరి 16, ప్రభాతవార్త**



కళ్లముందే అన్నయ్య గుండె పోటుతో చనిపోవడంతో ఆ మరణ వార్త విని అదే హాస్పిటల్‌లో నిమిషాల వ్యవధిలో తమ్ముడు హఠాన్మరణం చెందిన హృదయ విదారక ఘటన 14వ వార్డు గొల్లపాలెంలో బుధవారం జరిగిన సంగతి తెలిసిందే. అయితే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య గురువారం పట్టణంలోని గొల్లపాలెంలో వారి స్వగృహంకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ వైపు తండ్రి చనిపోయి కుటుంబ భారం మోస్తున్న పెద్ద కొడుకు గుండెపోటుతో మృతి చెందడం, ఆ వెంటనే తమ్ముడు కూడా మృతి చెందడం తన హృదయాన్ని కలచి వేసిందని అన్నారు. ఇలాంటి ఘటన పగవారి ఇంట కూడా జరగకూడదని మానవత్వం మంట కలిసిపోతున్న, ఈ రోజుల్లో ఇలాంటి అన్నదమ్ములు ఉండటం, ఎంతో అరుదు అన్నారు. అలాంటి వారి ఇరువురు మన మధ్య లేకపోవడం ఎంతో దురదృష్టకరమన్నారు. భర్తను కోల్పోవడంతో పాటు తన ఇద్దరి కొడుకులు ఒకే సారి మృతి చెందడంతో ఆ తల్లి బాధ చెప్పలేనిదని అన్నారు. మృతుల కుటుంబానికి తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ఈ కష్ట కాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఆయన వారికి చెప్పారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నేతలు, పలువురు కూటమి నాయకులు ఉన్నారు.



## అతి వేగంతో అదుపు తప్పి లారీ బైకులను ఢీకొట్టిన కారు

**వేటపాలెం, జనవరి 16, ప్రభాతవార్త**



మండల పరిధిలో గల జాతీయ రహదారిపై వేటపాలెం సెయింట్ ఆన్స్ కాలేజీ ఎదురు చీరాల వైపు వెళ్తున్న లారీని, ద్విచక్ర వాహనాన్ని ఒంగోలు వైపు వెళ్తున్న కారు రాంగ్ రూట్లో వచ్చి ఢీకొనడం జరిగింది. బైక్ మీద ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. చీరాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ మణిపాల్ ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## మండల ఆర్ఐగా రాజశేఖర్

**కొనకనమిట్ల, జనవరి 16, ప్రభాతవార్త**



కొనకనమిట్ల మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఇనగంటి రాజశేఖర్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. మర్రిపూడి మండల తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మహదేవారెడ్డి ఇన్‌చార్జ్ ఆర్ఐగా బాధ్యతలు నిర్వహించారు.

## 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**కొనకనమిట్ల, జనవరి 16, ప్రభాతవార్త**

కొనకనమిట్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 20న 11గంటల నుంచి ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

## వరి, కంది పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

**టంగుటూరు, జనవరి 16, ప్రభాతవార్త**




మండలంలోని మర్లపాడు, కందులూరు గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలతో పొలం పిలుస్తోందికార్యక్రమం వ్యవసాయాధికారి జి.స్వర్ణలత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారిణి స్వర్ణలత మాట్లాడుతూ 2024-25రబీ సీజన్ కి ఈ పంట నమోదు చేస్తున్నామని, పంటలు సాగు చేసిన రైతులు తమ వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులకు ఇచ్చి ఈ పంట లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని రైతులకు తెలియజేశారు. గ్రామాల్లో సాగుచేసిన వరి, కంది పంట పొలాలను సందర్శించి ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అగ్గి తెగులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు ట్రైసైక్లోజోల్ అనే పొడి మందు ఒక ఎకరానికి 100 గ్రాములు తగిన నీటిలో కలిపి పిచికారి చేసుకుని అగ్గి తెగులు రాకుండా నివారించుకోవచ్చని సూచించారు. అదేవిదంగా శనగ పంటలోవచ్చే తుప్పు తెగులు నివారణకు చేపట్టాల్సి న చర్యల గురించి వివరించారు. ఒంగోలు రైతు శిక్షణా కేంద్రం డీడీఏ ఎస్.రామమోహన్ మాట్లాడారు. శనగ పంట సాగు ఆలస్యం అవుతున్న కారణంగా తెగుళ్లు వచ్చి దిగుబడులు తగ్గే అవకాశం ఉన్న కారణంగా ప్రత్యామ్నాయ పంటలుగా నువ్వు, జొన్న పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఆర్సీ ఏడీఏ జే.వెంకటరానవు, ఏవో శైలజారాణి, గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు ఏ.శ్రీనివాసరెడ్డి, ఉద్యాన సహాయకురాలు సీహెచ్ సుజాత, విస్తరణ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఇరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్ఓసీ చెక్కు అందజేత

**చీరాల, జనవరి 16, ప్రభాతవార్త**

అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మంజూరైన రూ.1,85,199 ల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య గురువారం అందజేశారు. మండలంలోని తోటవారిపాలెం గ్రామానికి చెందిన రావూరి కోటేశ్వరమ్మకు వైద్య సహాయం నిమత్తం మంజూరైన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.



## తూర్పువెంకటాపురం, లంకోజనపల్లిలో పొలం పిలుస్తోంది

**దర్శి,జనవరి 16, ప్రభాతవార్త**



దర్శి మండలంలో తూర్పు వెంకటాపురం, లంకోజనపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఎంఏఓ బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ రైతులందూ కూడా వ్యవసాయ శాఖ సేవలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ నందు అవలంభిస్తున్నటువంటి పథకాల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా క్షేత్ర సందర్శన జరుగుతుందని పంటలపై ఆశించు చీడపీడలు, తెగుళ్ల గురించి క్షేత్ర ప్రదర్శన ద్వారా తెలియజేయడం జరుగుతుందని తెలియజేశారు. అదే విధంగా వ్యవసాయ శాఖ అవలంభిస్తున్న పంట నమోదు కార్యక్రమం ద్వారా పంట సాగు చేసినటువంటి రైతులందరూ కూడా పంట నమోదు చేయించుకోవాలని తద్వారా అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని, ప్రతి కూల పరిస్థితిల్లో పంట నష్టం వాటిల్లినప్పుడు అదే విధంగా పంటలకు ఇన్సూరెన్స్ వర్తించాలన్న రైతు పండించిన పంటలను మార్కెట్లో గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలన్న పంట నమోదు అవసరమని సూచించారు. ఈ రబీ పంట కాలంలో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా రైతు సోదరులందరూ శనగ, ఇతర పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్నటువంటి డ్రిప్, స్ప్రింక్లర్లు రైతులు వినియోగించుకోవాలన్నారు. పంట మార్పిడి పద్ధతి అలాగే పప్పు దినుసు పంటలైన కంది, మినుము, పెసర సాగు చేయడం వలన నేలకు బలం చేకూరుతుందని, అలాగే ప్రస్తుతం కంది పంటలో ఆశిస్తున్నటువంటి ఆకు ముడత నివారణకు ఎమోమెక్టిన్ బెంజోయేట్ ఎకరాకు 100 గ్రాముల చొప్పున వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు అప్పల సుధాకరరావు, హర్షవర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## మారెళ్ల, జమ్మలమడక గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**ముండ్లమూరు, జనవరి 16, ప్రభాతవార్త**



మారెళ్ల, జమ్మలమడక గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వారు తమ సిబ్బందితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మారెళ్ళ గ్రామంలో వరి, మొక్కజొన్న పొలాలు పరిశీలించారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు నివారణ, మొక్కజొన్నలో కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగుల నివారణ చర్యలను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## అశ్రునయనాలతో మానవత సంస్థ కీలక సభ్యుడు, విశ్రాంత తహశీల్దార్ అంతిమయాత్ర

**దర్శి,జనవరి 16, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలో అందరికి సుపరిచితులు, విశ్రాంత తహశీల్దార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అడ్వైజరి కమిటీ మెంబరు నిన్నటి రోజున గుండెపోటుతో అకాల మరణం చెందియున్నారు. ఈయన రెవెన్యూశాఖలో అంచలంచలుగా ఎదిగి దర్శి, దొనకొండ మండలాలలో డిప్యూటీ తహశీల్దార్‌గా చేసి పదోన్నతిపై పామూరు తహశీల్దార్‌గా పని చేసి అక్కడ పదవీ విరమణ చేసిన తరువాత దర్శికి వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. చాలా సౌమ్యుడిగా పేరున్న గోగు వెంకటేశ్వర్లు గత సంవత్సర కాలంగా స్థానిక వెంకటాచల పుణ్య క్షేత్రమైన శ్రీలక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలోని, హిందువులకు పవిత్రమైన గోశాల అభివృద్ధికి అధ్యక్షుని హోదాలో నిన్నటి వరకు నిరంతరం కృషి చేశారు. ఆయన మరణం దర్శి మానవ స్వచ్ఛంద సేవా సంస్థ కు తీరని లోటని సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి బాదాతప్తహృదయంతో, గత స్మృతులను మననం చేసుకున్నారు. దర్శి తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సహచర ప్రతినిధులు కపురం శ్రీనివాసరెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, గొర్రెపాటి వేణు, సుశీలమ్మ, వాసుదేవరెడ్డి, పట్టణ ప్రముఖులు యావన్మంది అశ్రునయనాలతో ఘనమైన నివాళులు అర్పించి, పార్థివదేహంతో అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత

**ముండ్లమూరు, జనవరి 16, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని పూరిమెట్ల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఉరిమెట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ గెలుపొందిన విజేతలకి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఈదర టీమ్ సాధించగా రెండవ బామ్మర్తి వినుకొండ దగ్గర తెల్లబాడు గ్రామానికి చెందిన టీమ్ సాధించింది. మొదటి బహుమతి రూ.25,116 ఏపీ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అందజేయగా రెండో బహుమతి రూ.15,116, ఎంపీటీసీ చింతలపల్లి వెంకటేశ్వరరావు స్పాన్సర్ చేశారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజయాతులకి టీడీపీ నాయకులు కోడిగా మస్తాన్‌రావు, నారాయణ, నాగేశ్వరరావు, తదితరులు అందజేశారు.

## ఘనంగా పొట్లపాడు తిరునాళ్ల

**కురిచేడు, జనవరి 16, ప్రభాతవార్త**



మండలంలోని పొట్లపాడులో వేంచేసి ఉన్న శ్రీ గుత్తికొండ రామయోగిస్వామి తిరునాళ్ల గురువారం ఘనంగా జరిగింది. ఉదయమే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికై బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు సంతానం కోసం స్వామివారి ఎదుట వరపడ్డారు. ఆలయ సమీపంలోనే పొంగళ్లు వండి నైవేద్యంగా స్వామివారికి సమర్పించారు. రాత్రివేళ ఎండుకొబ్బరిని కిలోల కొద్ది కాల్చి స్వామివారి ఊరేగింపు వద్ద తమ భక్తిని చాటుకున్నారు. మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి వాటి వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కురిచేడు ఎస్సై ఎన్.శివ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

## లేఅవుట్ల అనుమతికి ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

**- ఆర్డీఓ గండ్లూరి కేశవర్ధన్‌రెడ్డి**

**కనిగిరి, జనవరి 16, ప్రభాతవార్త**



కనిగిరిలో అక్రమ లేఅవుట్ల గుర్తింపు, నియంత్రణ, అనుమతులు మంజూరుకు సంబంధించి, ఆర్డీఓ గండ్లూరి కేశవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటి, సబ్ రిజిస్టర్ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశంను గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో అక్రమ లేఅవుట్లను గుర్తించి ప్రాథమిక దశలోనే అడ్డుకోవడం, ప్రభుత్వ నిబందనలు పాటించే వారికి వివిధ సౌకర్యాలు కల్పించడంపై చర్చించారు. అనుమతి లేకుండా లేఅవుట్లు వేసిన వారికి నోటీసులు ఇవ్వడం, ఫైన్‌లు విధించడం, అవసరమైతే కలెక్టర్ ద్వారా చర్యలు తీసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం లేఅవుట్లు వేయడాన్ని ప్రోత్సహించాలన్నారు. మున్సిపాలిటీనే లేఅవుట్‌లకు అనుమతి ఇచ్చే జీవో ప్రకారం అమలు చేయాలని నిర్ణయించారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లను నిర్మించుకోవాలంటే 5 అంతస్తుల వరకు మున్సిపాలిటీ కమీషనర్ అనుమతి పొందాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ రవిశంకర్, కమీషనర్ దానియేల్ జోసెఫ్, టీపీఓ సువర్ణ కుమార్, సబ్ రిజిస్టర్ ఏ.వాసుదేవరెడ్డి, ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ శారదా దేవి, పృద్విఆజ్ పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి

**కనిగిరి, జనవరి 16, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులల్లో మౌలిక వసతులు కల్పనలో ఎక్కడ రాజీలేకుండా ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నామని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణ వార్డు ప్రజలు ఫిర్యాదులు మేరకు గురువారం కనిగిరి పట్టణంలోని 11వ వార్డులోని డ్రైవర్స్ కాలనీలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించగా వార్డులో నీటి సమస్య, వీధి లైట్స్, డ్రైనేజీ కాలువల నిర్మాణం తదితర సమస్యలను తెలియజేయగా దశల వారీగా ప్రజలు సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. వార్డులలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలు సమస్యలను త్వరతగతిన పరిష్కరిస్తామని తెలియజేయగా ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, ఎమినిటీస్ సెక్రటరీ శంషీర్, స్థానిక నాయకులు షేక్ రాజా మస్తాన్ ఖరీమ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరామిరెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బీఎన్

**సంతనూతలపాడు, జనవరి 16, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండలం కండ్లగుంట గ్రామంలో గుదిబండ వెంకటరామిరెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ పాల్గొని ఆయన మృతికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో1 మండల పార్టీ అధ్యక్షులు తెళ్ళ మనోజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, బోస్, పున్నారెడ్డి, పిట్టు సురేష్, పైడి నాగేశ్వరరావు, స్వర్ణ కిషోర్, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 17న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆటలు, ముగ్గుల పోటీలు

**టంగుటూరు, జనవరి 16, ప్రభాతవార్త**

టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ సేవా సమితి వారి ఆధ్వర్యంలో 17వ తేదీ స్థానిక మసీదు దగ్గర చిన్నారులకు, మహిళల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కన్వీనర్ రావూరి తిరుమల రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ మహిళలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం ఎన్టీఆర్ వర్ధంతి సభ, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం, అనంతరం గొప్ప సినీ పాట కచేరి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కావున టంగుటూరులోని నందమూరి అభిమానులు, టీడీపీ అభిమానులు, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

## పేకాటరాయుళ్ల పట్టివేత

**వేటపాలెం, జనవరి 16, ప్రభాతవార్త**



వేటపాలెం మండలం రామన్నపేట గ్రామం శివారుల నందు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం మేరకు వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు, వారి సిబ్బంది కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 3020 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేశారు. మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న ఎడల పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని సమాచారం ఇచ్చిన వ్యక్తుల సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలియజేశారు.

## కులదూషణ ఫిర్యాదు

**బల్లికురవ, జనవరి 16, ప్రభాతవార్త**

మండలంలోని కొత్తూరు గ్రామంలో ఇరువురు యువకుల మధ్య తలెత్తిన వివాదం కులదూషణ ఫిర్యాదుకు దారితీసింది. గ్రామానికి చెందిన యాకోబు అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన గోవర్ధన్,మరికొందరు కుల దూషణ చేస్తూ దాడి చేశారని గురువారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈదాడి చేసిన వ్యక్తులకు సంబంధించిన వాహనాలను కూడా స్థానిక పోలీసుస్టేషన్‌కు అప్పగించారు.కులదూషణ చేస్తూ దాడి చేసిన వ్యక్తులపై చట్టపరంగా కేసులు నమోదు చేసిచర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పేతురు మాదిగ డిమాండ్ చేశారు.

# 111 మంది రైతుల ఆమరణ దీక్ష



## 101 మంది రైతుల ఢిల్లీ ఛలోమార్చ్

**ఛండీఘర్, జనవరి 16:** రైతు సమస్యలపై కేంద్రం ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టినరైతునేత జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా హర్యానా సరిహద్దు ఖనౌరీలో 111 మందిరైతులు నిరవదిక దీక్షను చేపట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు జగ్‌జీత్‌సింగ్ దల్లేవాల్ దీక్షను విరమింపచేసేందుకు కేంద్రం రైతులకిచ్చిన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ మరో 101 మంది రైతులు ఢిల్లీకి శంభు సరిహద్దుల మీదుగా మార్చ్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 21వ తేదీ శంభు సరిహద్దునుంచి ఈ ర్యాలీ జరుగుతుంది, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకే ఈ ర్యాలీచేస్తున్నట్లు రైతులు తెలిపారు. కనీస మద్దతుధరకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకుడు కోఆర్డినేటర్ సర్వన్‌సింగ్ పాంధేర్ మాట్లాడుతూ 101 మంది రైతులు గతంలోమూడు పర్యాయాలు ఢిల్లీకి మార్చ్ నిర్వహించేందుకు సిద్ధం అయ్యారని డిసెంబరు ఆరు, ఎనిమిది, 14వ తేదీల్లో శంభు సరిహద్దునుంచి ఈ ర్యాలీ తీయాలని నిర్ణయించారని, అయితే హర్యానా పోలీసులు ఈర్యాలీని భగ్నం చేసారన్నారు. రైతుల డిమాండ్లను అంగీకరించకపోగా కేంద్రం కావాలనే తిరస్కరిస్తోందని, నిరంతర నిరసన ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఎస్‌కెఎం, కెఎంఎంలు రెండూ కూడా 101 మంది రైతులతో మార్చ్‌ను ఈ నెల 21వ తేదీ నిర్వహించాలని నిర్ణయించాయన్నారు. ప్రభుత్వం డిమాండ్లను పెడచెవిన పెడుతోందని చర్చలు జరిపేందుకు కూడా సిద్ధంగా లేదని ఆయన ఆరోపించారు. అందువల్లనే రెండు రైతు వేదికలుకూడా తమ నిరవధిక ఆందోళనను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీనే 111 మంది రైతులు ఆమరణదీక్షకు పూనుకున్నారు. తమ రైతునేత దల్లేవాల్‌కు మద్దతుగా ఈ దీక్షలుచేస్తున్నట్లు తెలిపారు. రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక దీక్ష గత ఏడాది నవంబరు 26వ తేదీ ఖనౌరి సరిహద్దు వద్ద ఆమరణదీక్షకు పూనుకున్నారు. నేటికి 52 రోజులుగా ఆయన దీక్షలోనే కొనసాగుతున్నారు. ఇదే దీక్షను కొనసాగిస్తే ఆయన కీలక అవయవాలు దెబ్బతినేప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించినా ఆయన పెడచెవిన పెడుతున్నారు. దీనితో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 పరిధిలో హర్యానా పోలీసులు నిషేధాంక్షలు ప్రకటించారు. గతేడాది ఫిబ్రవరి 13వ తేదీనుంచి రైతులు పంజాబ్ హర్యానా సరిహద్దుల్లో దీక్షలుచేస్తున్న సంగతి తెలిసిందే. ఢిల్లీకి మార్చ్ చేయాలని నిర్ణయించినా పోలీసులు భగ్నంచేసారు. తమ పంటలకు గిట్టుబాటుధరలు లభించాలని, అలాగే కనీసమద్దతుధరలను చట్టబద్ధంచేయాలని కోరుతున్న సంగతి తెలిసిందే.



# దేశ చరిత్రను వక్రీకరిస్తున్న ఆర్ఎస్ఎస్

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ధ్వజం

**కోల్‌కత్తా, జనవరి 16:** అయోధ్యలో రామ మందిరం ప్రతిష్టాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇటీవలచేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ దేశచరిత్రను వక్రీకరించడానికి ఆర్ఎస్ఎస్ పన్నుతున్న పథకమని విమర్శించారు. భగవత్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నానని అవిభారత దేశ చరిత్రకు వ్యతిరేకమైనవని ఇటువంటి రాజ్యాంగ వ్యతిరేక అసంబద్ధమైన వ్యాఖ్యలతో దేశ చరిత్రను వక్రీకరించే ప్రయత్నంచేస్తున్నారు. దేశాన్ని మతం ఆధారంగా విభజించాలని చూస్తే మేం ఊరుకోమని దేశం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని మమతా అన్నారు.

ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్‌బాగెల్ మాట్లాడుతూ భగవత్ తన వ్యాఖ్యల ద్వారా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అసంఖ్యాక త్యాగాలుచేసిన వారిని అవమానించారని దుయ్యబట్టారు. ఆయన ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను బిజెపి తప్పుగా వక్రీకరించి ప్రచారంచేస్తోందని విమర్శించారు. దేశానికి నిజమైన స్వాతంత్ర్యం రామమందిరప్రతిష్టాపన రోజునే వచ్చిందని ఇటీవల ఆర్ఎస్ఎస్ చీఫ్‌మోహన్ భగవత్‌చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు.



# బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

## ప్రాణాపాయం లేదన్న వైద్యులు

**ముంబయి, జనవరి 16:** బాలివుడ్ చిత్రపరిశ్రమ ఒక్కసారిగా ఖంగుతిన్నది. ప్రముఖనటుడు సైఫ్ ఆలీఖాన్‌పై చోరీకి వచ్చిన నిందితుడు కత్తిపోట్లకు గురిచేసాడన్న అంశం బాలివుడ్ మొత్తం తెల్లారేసరికి పాకిపోయింది. ముంబయిలోని బాంద్రాలో సైఫ్ ఆలీఖాన్ నివాసంలోనే గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఈ హీరోపై దాడిజరిగింది. సైఫ్ ఆతడి కుటుంబసభ్యులు మంచి నిద్రలో ఉండగా మెట్లమార్గం గుండా ఇంట్లోకి ప్రవేశించిన ఒక దుండగుడిని గుర్తించి సైఫ్ రెండో కుమారుడు జేహ్ కేర్‌టేకర్ అరుపులు కేకలు వేయడంతో సైఫ్ వెంటనే మేలుకొని వచ్చాడు. దుండగుడిని ప్రతిఘటించిన సైఫ్‌పై ఈ దుండగుడు తనవద్ద ఉన్న కత్తితో ఆరుసార్లు పొడిచాడు. ఈక్రమంలోనే సైఫ్ వెన్నుముకలో దుండగుడి కత్తిమొన అలాగే ఉండిపోయిందని వైద్యులు సైతం తెలిపారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి మొత్తం వివరాలను సేకరించారు. పక్కింటి సిసి ఫుటేజిని పరిశీలించినపోలీసులు ఒక ఆగంతకుడు మెట్లు దిగి వెళుతున్నట్లు గుర్తించారు. మెట్లమార్గంతోనే దుండగుడు ప్రవేశించి తిరిగి అలాగే పరారయినట్లు కూడా పోలీసులు గుర్తించారు.

ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి తక్షణమే గాలింపు చర్యలుచేపట్టారు. కాగా అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో వినియోగించే మెట్ల మార్గంలోనే దొంగ సైఫ్ ఇంట్లోకి ప్రవేశించాడని తేలింది. అయితే నిందితుడు దొంగతనం కోసమే వచ్చినట్లు భావిస్తున్నామని ఇప్పటికే నిందితుడిని గుర్తించారని, పదిబృందాలు ఈకేసు దర్యాప్తుకోసం పనిచేస్తునానయని స్థానిక డిసిపి దీక్షిత్ గేడమ్ పేర్కొన్నారు. సైఫ్ కుటుంబంలో పనిచేసేఐదుగురు సిబ్బందిని ప్రశ్నించారు. నటుడుఉండే హౌసింగ్ సొసైటీలో కొన్ని ఇళ్లకు మరమ్మతులు జరుగుతున్నాయి. దీనితో బయటనుంచి పనివారు వచ్చిపోతున్నారు. కాగా ఆరు కత్తిగాయాలు తగలిన సైఫ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు కార్లు సిద్ధంగా లేకపోవడంతో పెద్దకుమారుడు ఇబ్రహీం ఆలీఖాన్ ఆటోలో ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. లీలావతి ఆసుపత్రిలోచేరిన సైఫ్‌కు వైద్యులు వెన్నెముకలో దిగబడిన 2.5 అంగుళాల కత్తిముక్కను వెలికితీసి శస్త్రచికిత్స చేసి ద్రవాలు లీక్ కాకుండా కట్టడిచేసారు. అలాగే మణికట్టు ఇతర భాగాల్లో జరిగిన గాయాలకు కాస్మెటిక్ సర్జరీచేసి అప్పటికప్పుడు తక్షణ చికిత్సలుచేసారు.

అక్కడి ఇళ్లల్లో ఫ్లోర్ పాలిషింగ్‌చేసే కార్మికులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా సైఫ్ ఆలీఖాన్‌పై దాడి బిష్ణోయ్ గ్యాంగ్‌పనే అంటూ వస్తున్న వార్తలను పోలీసులు ఖండించారు. ఈ దాడికి బిష్ణోయ్ గ్యాంగ్‌కు ఎలాంటిసంబంధం లేదని తేల్చి చెప్పారు. నిందితుడు కేవలం సొమ్ములకోసమే ఇంటికి వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. సిసిటివి ఫుటేజి ఆధారంగా నిందితుడి ఫోటోను కూడా విడుదలచేసారు.

కాగా బాలివుడ్ చిత్రపరిశ్రమలోని సీనియర్ నటుడిపై జరిగిన దాడి ఇపుడు రాజకీయ రంగు పులుముకుంది. సాక్షాత్తూ సంపన్నవర్గంలోని ప్రముఖ నటుడికే భద్రత కరువైతే ముంబయిలో సామాన్యమధ్యతరగతిప్రజల సంగతేమిటంటూ థాకరే శివసేన, ఆమ్ ఆద్మీపార్టీ కాంగ్రెస్‌లు బిజెపిపై దుమ్మెత్తిపోస్తున్నాయి. దీనిపై ముఖ్యమంత్రి ఫడ్నవీస్ స్వయంగా రంగంలోకి దిగి కౌంటర్లు ఇస్తుండటం గమనార్హం. యాక్టర్‌పై దాడిని శాంతిభద్రతల సమస్యకు ముడిపెట్టవద్దంటూ ఆయన హితవు పలికారు.

# హిండెన్‌బర్గ్ రిసెర్చి సంస్థకు మూత!

## కార్యకలాపాలు విరమిస్తున్నట్లు ప్రకటించిన నాథన్ ఆండర్సన్



**న్యూఢిల్లీ, జనవరి 16:** హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ. ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ నివేదిక ఏ స్థాయిలో ప్రకంపనల్ని సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దేశ కార్పొరేట్ వర్గాల నుంచి రాజకీయ రంగం దాకా ఈ అంశం కుదిపేసిన విషయం తెలిసిందే. ఆ సంస్థ ఇచ్చిన రిపోర్ట్ దెబ్బకి అదానీ షేర్లు కుదేలయ్యాయి. ఈ సంస్థ రిపోర్ట్ భారత స్టాక్ మార్కెట్లనుకూడా వణికించింది. అయితే తాజాగా ఈ సంస్థ సంచలన నిర్ణయం ప్రకటించింది. కంపెనీ కార్యకలాపాలను మూసివేస్తున్నట్లు సంస్థవ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ తాజాగా ప్రకటించారు. సంస్థ మూసివేత గురించి కొంత కాలంగా తన ఆత్మీయులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులతో చర్చించినట్లు చెప్పారు. అనేక చర్చల అనంతరం సంస్థను మూసివేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మూసివేత వెనుక ఎలాంటి బెదిరింపులు, భయాలు, ఆరోగ్య కారణాలు, వ్యక్తిగత అంశాలూ లేవని స్పష్టం చేశారు. తమ ప్రణాళికలు, ఐడియాలు ముగియడంతోనే ఈ నిర్ణయానికి వచ్చినట్లు వివరించారు.

హిండెన్‌బర్గ్ నా జీవితంలో ఓ అధ్యాయం మాత్రమే. సంస్థ స్థాపించినప్పుడు నన్ను నేను నిరూపించుకునేందుకు ఎంతో కష్టపడేవాడిని. అయితే ఇప్పుడు నేను కంఫర్ట్‌జోన్‌లో ఉన్నానని అనిపిస్తోంది. ఈ సంస్థ వల్ల ఎంతో సాహసం చేశాను. ఎన్నో ఇబ్బందులు, సవాళ్లు, ఒత్తిళ్లను ఎదుర్కొన్నా. అయినప్పటికీ ఎంతో ఉత్సాహంగా పనిచేశా. ఇదంతా నాకో ప్రేమకథలా అనిపిస్తోంది. ఇకపై నా భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి పెడతాను అని నాథన్ అండర్సన్ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం అదానీ గ్రూప్‌పై హిండెన్‌బర్గ్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే.

అదానీ గ్రూప్‌పై 106 పేజీల రిపోర్ట్‌నురిలీజ్ చేసింది. అదానీ గ్రూప్ అవకతవకలకు పాల్పడుతున్నదని, స్టాక్ మార్కెట్లలో గ్రూప్ కంపెనీల షేర్ల విలువ పెరిగేలా అక్రమాలకు దిగుతున్నదని సంచలన ఆరోపణలు చేసింది. దీంతో అదానీగ్రూప్ మార్కెట్ విలువ ఏకంగా రూ.12 లక్షల కోట్లు హరించుకుపోయింది. అదానీ సంస్థల్లో ఆయా కంపెనీల పెట్టుబడులు, ముఖ్యంగా ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసి కొన్న వాటాలపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. చివరకు అదానీ వ్యాపార విస్తరణకు కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ సహకరించిందని, దీనిపై లోతుగా దర్యాప్తు జరగాలని పార్లమెంట్‌లో విపక్షాలన్నీ పట్టుబట్టింది తెలిసిందే.



## కాల్పుల విరమణ ఒప్పందం వేళ..

# గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్

**జెరూసలేం, జనవరి 16:** పదిహేను నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలుకుతూ బుధవారం ఇజ్రాయెల్-హమాస్ ఓ అంగీకారానికి వచ్చినట్లు అధికారిక వర్గాలు వెల్లడించిన కొన్ని గంటల్లోనే ఇజ్రాయెల్ గాజాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. గాజా కాల్పుల విరమణ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ గాజాపై పెద్దఎత్తున విరుచుకుపడింది. ఈ చర్యలతో స్థానికులు భయభ్రాంతులకు గురయినట్లు సివిల్ ఎమర్జెన్సీ సర్వీస్ వెల్లడించింది. దాడిలో పదుల సంఖ్యలో భవనాలు కుప్పకూలగా.. పలువురు గాయపడినట్లు పేర్కొంది.

అక్టోబరు 7, 2023న సరిహద్దులు దాటి ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించి 1200 మంది ఇజ్రాయెల్ పౌరులను హతమార్చి, 250 మందిని బందీలుగా చేసుకోవడంద్వారా హమాస్ మధ్య ఆసియాలోయుద్ధానికి బీజంవేసింది. హమాస్‌కు మద్దతుగా హెజ్‌బొల్లా, హూతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడులకు దిగాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పరస్పర క్షిపణి దాడులకు పాల్పడ్డాయి. 46 వేల మంది పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారు. ఈ యుద్ధాన్ని నివారించడానికి ప్రపంచ దేశాలు కృషిచేస్తున్నాయి. ఈనేపథ్యంలో కొన్ని నెలలుగా కాల్పుల విరమణ కోసం ఈజిప్ట్, ఖతార్ ఇరు పక్షాలతో చర్చలు జరుపుతూ వచ్చాయి.

ఈ ఒప్పందానికి అమెరికా మొదటి నుంచి మద్దతుగా ఉంది. ప్రస్తుతం జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఖతార్ మధ్యవర్తిత్వం వహించింది. ఎట్టకేలకు కాల్పుల విరమణ ప్రతిపాదనకు అంగీకరించినట్లు హమాస్ తెలిపింది. అయితే ఒప్పందం తుది ముసా యిదాపై ఇంకా కసరత్తు జరుగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం పేర్కొంది. మరోవైపు తాజా ఒడంబడికకు నెతన్యాహు కేబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. కొద్ది రోజుల్లోనే ఈ లాంఛనం పూర్తి కావచ్చని భావిస్తున్నారు. ఈ ఒప్పందం ఆదివారం నుంచి అమలులోకి వస్తుందని ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రహ్మాన్ అల్‌థానీ ప్రకటించారు.

# కాశ్మీర్‌లో అంతుచిక్కని మరణాలు

## నెలన్నర వ్యవధిలో 15 మంది మృతి!



**శ్రీనగర్, జనవరి 16:** జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీని అంతుచిక్కని మరణాలు వెంటాడుతున్నాయి. జిల్లాలోని బుధాల్ గ్రామంలో గడిచిన నెలన్నర వ్యవధిలో అనుమానాస్పద రీతిలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 15కు చేరుకుంది. మరో చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. అయితే ఈ మరణాలకు బ్యాక్టీరియా లేదా వైరస్ కారక సాంక్రమిక వ్యాధులు కారణం కాదని ప్రాథమికంగా తేలినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఇక్కడి పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం దర్యాప్తు కోసం 11 మందితో ప్రత్యేకబృందాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. రాజౌరీ జిల్లాలోని బుధాల్ గ్రామంలో గత డిసెంబర్ 7న సహపంక్తి భోజనం నిర్వహించారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ఇక్కడ భోజనం చేసిన అనంతరం అస్వస్థతకు గురికాగా వారిలో అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. డిసెంబర్ 12న మరో కార్యక్రమంలో విందు ఆరగించిన మరో కుటుంబంలోని తొమ్మిదిమంది అనారోగ్యం బారినపడ్డారు. అందులో ముగ్గురు చనిపోయారు. జనవరి మూడోఘటన చోటుచేసుకుంది. ఓ కుటుంబంలోని పదిమంది తీవ్ర అస్వస్థతకు గురికాగా ఆరుగురు చిన్నారులే. వీరిలో ఓ పదేళ్ల బాలిక చనిపోగా 15 ఏళ్ల అబ్బాయి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఇలా గడిచిన నెలన్నర వ్యవధిలోనే మొత్తంగా 15 మంది చనిపోవడం ఆ గ్రామంలో భయాందోళనలకు కారణమైంది. ఈ అంతుచిక్కని మరణాలకు గల కారణాలను గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ముమ్మర ప్రయత్నాలు చేసింది. బాధితుల నుంచి నమూనాలను సేకరించి దేశవ్యాప్తంగా ఉన్న అత్యున్నత ల్యాబ్‌లకు పంపించింది. ఎన్ఐవి, ఎన్‌సిడిసి, ఎన్ఐటిఆర్, డిఆర్‌డిఇతో పాటు చండీగఢ్, జమ్మూలలో ఉన్న పరిశోధక ల్యాబ్‌లలో పరీక్షించినప్పటికీ వైరస్ లేదా బ్యాక్టీరియా కారకాలు లేవని తేలింది. ఐటిఆర్ నిర్వహించిన విశ్లేషణలో మాత్రం ఆ నమూనాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు గుర్తించింది. దీంతో మరింత అప్రమత్తమైన ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని వివిధ శాఖలను ఆదేశించింది. తొలి ఘటన వెలుగు చూసిన మరుసటి రోజే అక్కడి ఆహార, నీటి నమూనాలను సేకరించేందుకు వైద్య బృందాన్ని రంగంలోకి దింపినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. సీనియర్ వైద్యులు, పరిశోధకులు తాజా పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు తెలిపింది. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన చర్యలన్నీ తీసుకుంటోందని జమ్మూ కశ్మీర్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సకీనా ఇటూ పేర్కొన్నారు.



# సమాధిని తవ్వి మృతదేహం వెలికితీత

## కేరళలో ఉద్రిక్తంగా మారిన స్వామి జీవసమాధి

**తిరువనంతపురం, జనవరి 16:** రాష్ట్రరాజధాని తిరువనంతపురంలో గోపన్‌స్వామి అనే వ్యక్తి జీవసమాధి అంశం వివాదాస్పదంగా మారింది. ఆ సమాధిని తవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేయడంతోపోలీసులు సమాధిని తవ్వి ఆయన మృతదేహాన్ని వెలికితీసారు. సమాధి వద్దకు ఉదయం ఏడు గంటల సమయంలో చేరుకున్నామని దానిని తవ్వడాన్ని కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించడంతో భారీ భద్రత నడుమ కాంక్రీటుతో నిర్మించిన గోపన్ స్వామి సమాధిని తవ్వామని పోలీసులు పేర్కొన్నారు. లోపల ఆయన మృతదేహం ధ్యాన స్థితిలో ఉందని, ఛాతివరకూ పూజాసామగ్రి నింపి ఉందని తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువనంతపురంలోని మెడికల్ కళాశాలకు తరలించినట్లు వెల్లడించారు. గోపన్‌స్వామి అలియాస్ మణ్యన్ జీవసమాధి అయ్యారని కొన్ని రోజుల క్రితం ఆయన కుటుంబీకులు పోస్టర్లు ప్రచురించారు. బంధువులు స్థానికులకు తెలియకుండా ఆతడిని నెయ్యటింకర లోని ఓ దేవాలయం సమీపంలో పూడ్చిపెట్టడంతో ఆయన మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఎవరూ చూడకుండా తనను సమాధి చేయాలని గోపన్ చెప్పినట్లు ఆయన కుమారులు సనందన్; రాజేశన్ పేర్కొన్నారు.

ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో సబ్ కలెక్టర్ ఆల్ఫ్రెడ్ ఓవీ తన సిబ్బందితో వెళ్లి సమాధిని తవ్వాలని ఆదేశించారు. ఈ చర్యను గోపన్‌స్వామి భార్య కుమారులు అడ్డుకున్నారు. దీనితో అధికారులు న్యాయపరంగా ముందుకు వెళ్లారు. సమాధిని తవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో మరోసారి ఆప్రాంతంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనపై విచారణ జరిపిన హైకోర్టు సమాధిని తవ్వి తీరాల్సిందేనని ఆదేశించింది.

# ఎన్నికల్లో కృత్రిమ మేధ వినియోగంపై ఇసి నజర్

**న్యూఢిల్లీ, జనవరి 16:** అన్నిరంగాల్లోను కృత్రిమమేధ వినియోగం భారీ ఎత్తున పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఇపుడు ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో కూడా ఆయా పార్టీలు దీన్ని వినియోగిస్తున్నాయి. కొన్నిపర్యాయాలు పార్టీలు సృష్టించే తప్పుడు కంటెంట్ ఓటర్ల అభిప్రాయాలను మార్చే అవకాశం ఉన్నందున ఎన్నికల కమిషన్ అప్రమత్తం అయింది. ఈ క్రమంలోనే అన్ని పార్టీలకు సూచనలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఎఐని వినియోగిస్తున్న పార్టీలు వారు సృష్టించే కంటెంట్ పారదర్శకంగా ఉండాలని ఇసి సూచించింది. అభ్యర్థులు వాటిపై జవాబుదారీతనంతో వ్యవహరించాలని అడ్వయిజరీలో పేర్కొంది. ఈ టెక్నాలజీ ద్వారా క్రియేట్‌చేసిన ఆడియో, విడియోలు చిత్రాలపై ఎఐ జనరేటెడ్, సింథటిక్ కంటెంట్ వంటి సంకేతాల లేబుళ్లు ఉండాలి. ప్రచార ప్రకటనలను వ్యాప్తిచేసే సమయంలో సింథటిక్ కంటెంట్ వినియోగించినా దానికి డిస్‌క్లెయిమర్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కాగా ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీలు ఎఐని వినియోగిస్తున్నాయి. దీనితో నకిలీ కంటెంట్ ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలవేళ బాధ్యతాయుతంగా వ్యవహరించేందుకు కీలక నిర్ణయం తీసుకున్న ఈసీ కొత్త నిబంధనలతో అడ్వయిజరీ జారీచేసింది. అయితే సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లు వేదికగా నైతికత బాధ్యతాయుతంగా నడుచుకోవాలని గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ఇసి మార్గదర్శకాలు జారీచేసింది.

# ట్రంప్ బెదరింపులపై ఎదురుదాడికి కెనడా పిఎం యత్నం



**ఒట్టావా, జనవరి 16:** భరించలేని స్థాయిలో టారిఫ్‌లు విధిస్తానని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదరిస్తున్న నేపథ్యంలో కెనడా ప్రధాని ట్రూడో మరోసారి స్పందించారు. తాము వాణిజ్య యుద్ధాన్ని కోరుకోవడం లేదని.. అవసరమైతే మాత్రం దానికి ప్రతిస్పందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. దేశ రాజధానిలో ఆయన ప్రావిన్షియల్, టెరిటోరియల్ నాయకులతో సమావేశమై అమెరికా నుంచి పొంచి ఉన్న టారిఫ్‌ల ముప్పుపై చర్చించారు. ప్రతిస్పందన విషయంలో ఉన్న ప్రతి అవకాశాన్ని చర్చించినట్లు ట్రూడో పేర్కొన్నారు. దీని వల్ల వచ్చే భారాన్ని కెనడాలోని అన్ని ప్రాంతాలు సమానంగా పంచుకోవాలని.. ఏదో ఒక ప్రాంతంపై మాత్రమే మోపకూడదని నిర్ణయించుకొన్నట్లు చెప్పారు. అమెరికా నుంచి జరిగే దిగుమతి చేసుకొనే స్టీల్, గాజు ఉత్పత్తులపై, ఫ్లోరిడా ఆరెంజ్ జ్యూస్‌పైనా టారీఫ్‌లు విధించాలని నిర్ణయించారు. మరోవైపు అల్బర్టా ప్రావిన్స్ ప్రీమియర్ డేనియల్ స్మిత్ స్పందిస్తూ.. అమెరికాకు చమురు, విద్యుత్తు ఉత్పత్తి తగ్గిపోతే ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కెనడాలోని ఆ ప్రావిన్స్ నుంచే అత్యధికంగా చమురు అమెరికాకు ఎగుమతి అవుతుంది. కానీ, ఒంటారియో ప్రీమియర్ మాత్రం దేశం మొత్తం ఒక్కటిగా ట్రంప్‌ను ఎదుర్కోవాలని పేర్కొన్నారు. ఇక అమెరికా-కెనడాలు కీలక వ్యాపార భాగస్వాములు. అమెరికాలోని 36 రాష్ట్రాలకు అత్యధిక ఎగుమతుల కేంద్రంగా కెనడా నిలిచింది. నిత్యం 3.6 బిలియన్ డాలర్ల విలువైన వస్తుసేవలు సరిహద్దులు దాటి వెళుతుంటాయి. ఇప్పటికే కెనడా ప్రభుత్వం సరిహద్దు భద్రతకు బిలియన్ డాలర్లు వెచ్చించాలని నిర్ణయించింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాను కట్టడి చేయడానికి ఈ మొత్తం వినియోగించనుంది. ట్రంప్ సోమవారం అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

# నేనేమీ నవాజ్‌షరీఫ్‌ను కాదు!

## మాజీ ప్రధానిపై ఇమ్రాన్ సంచలన వ్యాఖ్యలు

**కరాచి, జనవరి 16:** సైన్యంతో ఒప్పందంచేసుకుని జైలునుంచి బయటకు వచ్చేందుకు తానేమీ నవాజ్‌షరీఫ్‌ను కాదని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. ఎటువంటి వ్యూహాలు పన్నినా సైన్యంతో అంగికారానికి వచ్చే ప్రసక్తేలేదన్నారు. జైళ్లలో ఉన్న పిటిఐ పార్టీకార్యకర్తలపట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారని సైన్యం, ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. పిటిఐ పార్టీకి సైనిక మద్దతుగల షెహబాజ్‌షరీఫ్ సర్కారుకు మధ్య సయోధ్య చర్చలుజరుగుతున్న వేళ ఆయన ఈమేరకు ట్వీట్‌చేసారు. పాకిస్థాన్‌లో రాజకీయ ఖైదీలపట్ల అమానవీయంగా ప్రవరిస్తున్నారు.

సైనిక కస్టడీలో ఉన్న మా పార్టీ కార్యకర్తలను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారు. నేను కూడా వేధింపులకు లోనయ్యానని మా పార్టీని అణిచివేసేనక్రమంలో మొత్తం వ్యవస్థనే ఉల్లంఘించారని ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు, ఇతర న్యాయస్థానాలను ఆశ్రయించినా విచారణకు అనుమతించడంలేదన్నారు. అంతర్జాతీయ వేదికలపై గొంతు వినిపించడంతప్ప వేరే మార్గం లేకుండా పోయిందన్నారు.

# గణతంత్ర దినోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

## - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ,జనవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ఈ నెల 26న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్టమైన విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ సన్నాహక ఏర్పాట్లను గురువారం రాష్ట్ర సచివాలయం నుండి వర్చువల్ గా సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ తేదీ ఉదయం 9.గం.లకు మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించ నున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొననున్న దృష్ట్యా పటిష్టమైన బందో బస్తుతో పాటు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈవేడుకలకు హాజరయ్యే ప్రముఖులతో పాటు ప్రతి ఒక్కరికీ తగిన సీటింగ్ ఏర్పాట్లు, అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సిఎస్ ఆదేశించారు. ఈవేడుకల ప్రాంగణంలో తగిన త్రాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగు దొడ్లు, బారీ కేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో రాజ్ భవన్, హైకోర్టు, అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం,సియం క్యాంపు కార్యాలయం సహా ఇతర ముఖ్య భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ఈసారి గణతంత్ర దినోత్సవం ఆదివారం వచ్చినందున ఈ వేడుకలకు పాఠశాల పిల్లలను తరలించే అంశంపై విద్యాశాఖ అధికారులు, విజయవాడ జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. వివిధ శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అంతకు ముందు పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ వివిధ శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివరించారు. వాటిలో ముఖ్యంగా పోలీస్ శాఖ తరపున స్టేడియం లోపల వెలుపల తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి ఏర్పాట్లపై సూచనలు జారీ చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ముఖ్య అతిధి వారి గణతంత్ర దినోత్సవ సందేశం తయారీ మరియు ప్రచురణతో పాటు సరిపడిన ప్రతులు సిద్ధం చేసి అందరికీ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే పటిష్టమైన పబ్లిక్ అడ్రస్ సిష్టం, మీడియా లైవ్ కవరేజికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వీలుగా కనీసం 14 శాఖలకు సంబంధించిన శకటాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు.


గణతంత్ర దినోత్సవేడుకల నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ కె.విజయానంద్



# రాష్ట్రంలో అతిపెద్ద సౌరప్రాజెక్టు

## రూ.10వేల కోట్లపెట్టుబడితో ఏర్పాటు : సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆసియాలోనే అతిపెద్ద సౌర ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు కానున్నట్లు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. గురువారం సౌర విద్యుత్తు అంశంపై మీడియాతో ఆయన ప్రస్తావించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వ సోలార్ ఎనర్జీ ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటుందన్నారు. ఈ క్రమంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 930 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్‌తో పాటు 465 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టును ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మాణ దశలో 1,000 మందికి ప్రత్యక్షంగా 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సెకితో కలిసి ఎన్‌యూ సన్‌టెక్ చేపట్టే ఈ ప్రాజెక్టును 24 నెలల్లో ప్రారంభించాల్సి ఉంటుంది. 25 ఏళ్ల కాలానికి విద్యుత్తు కొనుగోలు చేసేలా సెకి ఒప్పందం కుదుర్చుకోనుంది. ఇక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్తును దేశంలోని వివిధ పంపిణీ సంస్థలకు సరఫరా చేస్తుంది. బిల్డ్‌ఓన్‌ఆపరేట్ (బీఓటీ) విధానంలో ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఏపీలో ప్రతి ఇల్లు, కార్యాలయం సౌరశక్తి ఉత్పత్తి కేంద్రాలుగా మారాలని సీఎం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో త్వరలో సౌరకాంతులు వెదజల్లనున్నాయి. పీఎం సూర్యఘర్ పథకం ఇక్కడ ప్రత్యేకత సంతరించుకోనుంది. ఇక్కడి గృహవిద్యుత్తు కనెక్షన్లను సౌర వ్యవస్థతో అనుసంధానించడానికి చేపట్టనున్న పైలట్ ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానుంది. నియోజకవర్గం పరిధిలో 50 వేల గృహ కనెక్షన్లకు సౌరవిద్యుత్తు ఏర్పాటు లక్ష్యంగా అధికారులు చర్యలు ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గంలో ఎలక్ట్రిక్ కోఆపరేటివ్ సొసైటీ (రెస్కో) కి 1.30 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో గృహవినియోగ కనెక్షన్లు 77 వేలు ఉండగా వాటిలో సరాసరి 50 వేల కనెక్షన్లు సౌర విద్యుత్తు అందించేందుకు ఎస్పీడీసీఎల్, రెస్కో అధికారులు గుర్తించారు. ఇక ఇటీవల ఎన్టీపీసీ విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటెడ్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ కార్యాలయాలపై 300 మెగావాట్ల సౌర విద్యుత్ ఫలకాల ఏర్పాటు కోసం ఒప్పందం చేసుకుంది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్టీపీసీ ఏపీ నెడ్ క్యాప్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలపై సౌర విద్యుత్ ఫలకాలను అమర్చేందుకు వీలుగా ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. 2025 నాటికి ప్రభుత్వ కార్యాలయాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం సౌర ఫలకాలను అమర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధికి రూ.35కోట్లతో మరమ్మతులు

## రెండవ దశలో రూ.120కోట్లు అవసరం: శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు



**శ్రీ కాళ హస్తి,జనవరి 16 ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని క్రీడాంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దుటకు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రణాళిక రూపొం దించి అమలు చేస్తున్నారని శాప్ చైర్మెన్ అనిమిని రవినాయుడు గురువారం తెలిపారు. శ్రీకాళహస్తిలో రూ.35లక్షలతో మూల పడ్డ క్రీడా వికాశ కేంద్రాన్ని మరమ్మత్తులు చేసి గురువారం క్రీడాకారులకు కానుకగా అందించారు. ఈ కేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో చేపట్టిన క్రీడా వికాశ కేంద్రాలను అర్ధాంతరంగా గాలికి వదలి పెట్టారని రవినాయుడు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి క్రీడాకారులకు మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో 50శాతం కన్నా పూర్తి అయిన కెవికేలను మార్చి లోపల పూర్తి చేయుటకు రూ.35కోట్లు కేటాయించినట్లు వివరించారు. 50శాతం కన్నా తక్కువ పూర్తి అయిన వాటిని రెండవ దశలో పూర్తి చేయుటకు సుమారు రూ.120కోట్లు నిధులు అవసరమని శాప్ ప్రతిపాదనలు సిద్ధం చేసిందని వివరించారు. ఈ నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారన్నారు. ఈమేరకు మొదటి దశలో ఉన్న క్రీడా వికాశ కేంద్రాలను పూర్తి చేయటానికి నిర్ణయించామన్నారు. ఈ నేపథ్యంలో మూడు నెలల క్రితం శ్రీకాళహస్తిలో వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన క్రీడా వికాశ కేంద్రాన్ని బాగుకు ఇచ్చిన మాట ప్రకారం రూ.35లక్షలతో బాగు చేసామన్నారు. ఇక్కడ క్రీడాకారులకు బ్యాడ్మింటన్, యోగాహాల్, మల్టీపర్పస్ జిమ్, క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచామని వివరించారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తనకు సెప్టెంబర్ నెలలో శాప్ చైర్మెన్‌గా బాధ్యతలు అప్పగించారన్నారు. తాను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రీడా మైదానాలను పరిశీలించామన్నారు. గత ఐదేళ్ళలో క్రీడా మైదానాలను నిర్లక్ష్యం చేసారన్నారు. అసంపూర్తిగా ఉన్న కేవీపిలను పూర్తి చేయుటకు అంచనా ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించగా వెంటనే నిధులు మంజూరుకు అనుమతించారన్నారు. క్రీడాకారుల భవిష్యత్తు పట్ల శాప్ చిత్తశుద్ధితో ఉందన్నారు. వారికి మెరుగైన క్రీడా వసతులను కల్పించుటకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. క్రీడాంధ్ర ప్రదేశ్ యే లక్ష్యంగా పని చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వోద్యోగాల్లో ప్రస్తుతం క్రీడా కోటా 2శాతం ఉందన్నారు. దానిని 3శాతానికి పెంచామన్నారు. అలాగే క్రీడాకారుల ప్రోత్సాహకాలను భారీగా పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేయుటకు రాష్ట్రంలో అన్ని జిల్లాలోనూ క్రీడా సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెండేళ్ళలో రాష్ట్రంలో అన్ని క్రీడా సదుపాయాలను కల్పించి 2027లో రాష్ట్రంలోనే జాతీయ స్థాయి పోటీలు నిర్వహించుటకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా శాప్‌ను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను క్రీడల పట్ల ఆసక్తి పెంచుటకు ప్రతి పాఠశాలలోనూ క్రీడామైదానాలను ఏర్పాటు చేయాలని లోకేష్ అన్నారు.

# దుర్గమ్మను దర్శించుకున్న డిజిపి



**ఇంద్రకీలాద్రి, జనవరి 16, ప్రభాతవార్త :** దుర్గమ్మవారిని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు దంపతులు గురువారం దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మ దర్శనా నంతరం దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఇఓ కె రామచంద్ర మోహన్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. ఈ సందర్భంగా డిజిపి దంపతులు సంక్రాంతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసిన బొమ్మల కొలువును వీక్షించారు. - నిత్యాన్నదానానికి విరాళం: దుర్గమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి గురువారం తూర్పుగోదావరి జిల్లా వేట్లపాలెంకు చెందిన అమతం శైలేంద్రనాథ్, పద్మావతిలు రు.1లక్ష విరాళాన్ని డిప్యూటి ఇఓ ఎం రత్నరాజుకు అందించారు. వారికి దుర్గమ్మ దర్శనం ఏర్పాటు చేసి అనంతరం దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# యువ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డికి మంత్రి లోకేష్ అభినందనలు

**విజయవాడ,జనవరి 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఆస్ట్రేలియాలో ఇటీవల జరిగిన టెస్ట్ సిరీస్ లో అసమాన ప్రతిభను కనబరిచిన ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు వాడి సత్తా చాటిన నితీష్ ను మంత్రి లోకేష్ అభినందించారు. రాష్ట్రంలో యువ ఔత్సాహక క్రీడాకారులకు నితీష్ స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. నితీష్ ను మంగళగిరి చేనేత శాలువా, జ్ఞాపికతో మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్పోర్ట్స్ పాలసీ చాలా బాగుందని అన్నారు. అయితే అందులో క్రికెట్ ను కూడా చేర్చి యువ క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఇందుకు మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. నితీష్ వెంట ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్ తదితరులు ఉన్నారు.

# ఆర్టీసికి భారీ లాభాలు తీసుకొచ్చిన సంక్రాంతి పండుగ

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీకి సంక్రాంతి పండుగ భారీ లాభాలు తీసుకొచ్చిపెట్టింది. ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికయుతంగా తీసుకున్న నిర్ణయాలు, ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీసులు మంచి ఫలితాన్ని ఇచ్చాయి. ఆర్టీసీకి కాసులు పండించాయి. పండుగ ముగుస్తున్న తరుణంలో ప్రాథమిక అంచనాలను అనుసరించి ఆర్టీసీ ఇప్పటి వరకు రూ.12.5కోట్లు ఆదాయం లభించింది. ఈ ఆదాయం తుది లెక్కలు తరువాత మరింత పెరిగే అవకాశం ఉంది. స్పెషల్ సర్వీసులు, రాయతీలు బాగానే వర్కవుట య్యాయి. ఫలితంగా.. ఏపీఎస్ ఆర్టీసీకి కోట్లల్లో లాభాలు చేకూరాయి. సంక్రాంతి పండుగ అంటేనే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు పెద్ద పండుగ. ఎవరు ఎక్కడ స్థిరపడినా.. పండుగ వేళ స్వగ్రామానికి చేరుకుని.. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. ఇందుకోసం నెలా, రెండు నెలల ముందు నుంచే ట్రైన్ టికెట్లు, బసు టికెట్లు బుక్ చేసుకుంటుంటారు. అయినా సరే చాలా మందికి టికెట్లు దొరకవంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అందుకే.. ప్రయాణికులు సౌకర్యార్థం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపింది. పండుగ సందర్భంగా.. జనవరి 8 నుంచి 13 వరకు 3400 సర్వీసులు నడిపించగా.. జనవరి 16 నుంచి 20వ తేదీ వరకు ఏకంగా 3800 సర్వీసులు నడిపించింది ఏపీఎస్‌ఆర్టీసీ. సంక్రాంతి పండుగకు నడిపే బస్సుల్లో ప్రయాణీకులపై ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయమని సంస్థ ఎండీ ప్రకటించారు. అలాగే..

రానూపోనూ టికెట్లు ఒకేసారి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి 10 శాతం డిస్కౌంట్ కూడా కల్పించింది. ప్రయాణికులకు ఈ రాయితీ నచ్చడంతో ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణానికి మొగ్గుచూపారు.

ఇదే సందర్భంలో సంక్రాంతికి అధిక సంఖ్యలో ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేసి ఏపీఎస్‌ఆర్టీసీ సరికొత్త రికార్డు సాధించింది. దీంతో సంస్థకు కాసుల పంట పండింది. సంక్రాంతి పండుగ కోసమని 7200 బస్సులు రాను పోను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ ఏపీఎస్‌ఆర్టీసీలో సంక్రాంతికి 4 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణాలు సాగించారు.

# చీకటిలో దాగి వెలుగుపై విషం

## అభిమానుల రుణం తీర్చుకోలేనిది!

## సినీహీరో మంచు మనోజ్



**చంద్రగిరి, జనవరి 16 ప్రభాతవార్త:** చీకటిలో దాగి వెలుగుపై విషం చిమ్ముతున్నారంటూ తన కుటుంబ సభ్యుల తీరును సినీ హీరో మంచు మనోజ్ దుయ్యబట్టారు. తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, ఏ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద బుధవారం మంచు మనోజ్ అనుచరులు పళణి, వినాయకలపై హేమాద్రి నాయుడు, కిరణ్ దాడికి పాల్పడినట్లు గురువారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీ ప్రసాద్, సిఐ సుబ్బరామిరెడ్డిలకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు తమపై దాడికి ఉపయోగించిన పోలీస్ లాఠీ వంటి లాఠీని పోలీసులకు అందజేశారు. వీరితో పాటు మంచు మనోజ్, మంచు మౌనిక పోలీస్ స్టేషన్ వచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 8 ఏళ్ళ పాటు సినిమాలకు దూరంగా వున్నప్పటికీ నన్ను ఆధరిస్తున్న అభిమానుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. తన కుమార్తెకు ఇది మొదటి సంక్రాంతి కావడంతో మా ఇంటికి వెళదామని వస్తే అడ్డుకున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తన అనుచరుల ద్వారా తాను వస్తున్నట్లు తెలుసుకుని స్కూల్ వద్దకు పిలిపించుకుని వార్నింగ్ ఇచ్చారన్నారు. బుధవారం తాను తన అభిమానులతో కలసి నారావారిపల్లికి వెళ్ళి నారా లోకేష్, నారా రోహిత్ కలిసినట్లు తెలిపారు. అయితే తన కుటుంబ విషయాలు ఏవీ వారితో చెప్పుకుని సాయం కోరలేదన్నారు. తన అవ్వ తాతలకు నివాళులర్పించేందుకు వెళితే రాళ్ళదాడి చేయించారని ఆవేదన చెందారు. కళాశాలలో, హాస్టల్స్ లోని సమస్యలను తన తండ్రి మోహన్‌బాబుకు చెబుతామంటే కనీసం కలవనీయడంలేదన్నారు. నా తమ్ముళ్ళ వంటి వారిపై దాడి చేయించినందున పోలీసులకు ఫిర్యాదు చేయించినట్లు తెలిపారు. నాకు అభిమానులు దేవుడిచ్చిన వరమని అన్నారు. తాను ఎక్కడికీ పారిపోలేదనీ, వాళ్లే చీకటిలో దాక్కుని తనపై విషం చిమ్ముతున్నట్లు ఆవేదన చెందారు. మీడియా మాట్లాడుతుండగానే ఒక్కసారి కడుపులో కండరాలు పట్టేయడంతో మనోజ్ విలవిలలాడారు.

# వి.సి.ఐ ఇన్‌స్పెక్షన్‌కే పరిమితమైన పశువైద్య ప్రొఫెసర్‌లు

## మళ్లీ డెప్యుటేషన్‌పై తిరుపతి, గన్నవరానికి బదలీ ఉత్తర్వులు

### మూడు నెలల్లోనే 18 మంది ప్రొఫెసర్‌లు వెనక్కి, గరివిడి పశు వైద్యకళాశాలలో దయనీయ పరిస్థితి

**గరివిడి (విజయనగరం జిల్లా),జనవరి 16 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా గరివిడి పశు వైద్య కళాశాల పట్ల ఉన్నతాధికారులు ,పాలకులు ఉదాశీన వైఖరి తో కళాశాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోంది. విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉత్తరాంధ్రలో ఉన్న ఏకైక పశువైద్య కళాశాల పట్ల అటు పాలకులు, ఇటు ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంతో కళాశాలలో ప్రస్తుతం విద్యార్జన చేస్తున్న విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారే పరిస్థితులు సాక్షాత్కరిస్తున్నాయి. గరివిడి పశువైద్య కళాశాల కు 2024 నవంబరు 12,13,14 తేదీల్లో ఢిల్లీ నుంచి కళాశాల ఇనస్పెక్షన్‌కు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (విసిఐ) బృందం వస్తున్నారని ఆగమేఘాల మీద 40 మంది ప్రొఫెసర్‌లను తిరుపతి, గన్నవరం నుండి శ్రీవెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం గరివిడి పశు వైద్య కళాశాలకు బదలీ చేశారు. గరివిడి పశు వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌ల కొరత ఉన్న నేపథ్యంలో పరిపాలన అనుమతులు మంజూరు కి అవరోధం కలగకుండా ఉండేందుకు గాను విసిఐ అధికారులకు చూపించేందుకు గత ఏడాది నవంబరు 11న 40 మంది ప్రొఫెసర్‌లను బదలీ చేశారు. అయితే ఇనస్పెక్షన్ పూర్తి అయిన మూడు నెలల వ్యవధిలోనే మళ్లీ 18 మంది ప్రొఫెసర్‌లను తిరిగి డెప్యూటీషన్‌పై తిరుపతి, గన్నవరం బదలీ చేస్తూ తిరుపతి వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ కె.వి.బ్రహ్మయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే గరివిడి పశువైద్య కళాశాలలో ప్రొఫెసర్‌ల కొరతతో విద్యార్థులకు పాఠాలు బోధించే నాధుడు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్లను బదలీ చేయడం పట్ల పశు వైద్య విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పశువైద్య కళాశాలను కాపాడేందుకు స్తానిక ఎంఎల్ఎ , ఉమ్మడి జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా అడుగులు వేయకపోతే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో విద్యాభ్యాసం పూర్తిచేసే విద్యార్థులు , తరువాతి విద్యా సంవత్సరం విద్యార్థుల పరిస్థితి దారుణంగా మారే అవకాశం ఉంటుంది. కొత్త వారు ఇక్కడ జాయిన్ అయ్యేందుకు సుముఖత చూపే అవకాశం ఉండదు.



బోధకులు కొరత ఉండే కళాశాలలో చేరేందుకు ఉత్సుకత చూపే అవకాశాలు సన్నగిల్లే పరిస్థితులు కల్పించకుండా అధికారులు, పాలకులు గరివిడి పశువైద్య కళాశాలపై దృష్టి సారించాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉన్నాయి. తగినంత మంది ప్రొఫెసర్‌లతో ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన జరిపించాలని విద్యార్థులు తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# రహదారులపై కన్పిస్తున్న రద్దీ

## మళ్లీ నగరబాట పట్టిన ప్రజలు


సంక్రాంతి ముగియడంతో నగరాలకు వెళ్తున్న వారి కార్లతో జాతీయ రహదారులపై రద్దీ

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ సెలవులకు జన్మనిచ్చిన పల్లెలకు,పట్టణాలకు వచ్చిన ప్రజలు తిరిగి నగరబాట పట్టారు. స్వగ్రామాల్లో సంక్రాంతి పండుగ వేడుకల్లో ఉత్సాహంగా ,ఉల్లాసంగా పాల్గొన్న వారంతా తిరిగి హైదరాబాద్ బాట పట్టారు. హైదరాబాదులో ఉంటున్న ఏపీకి చెందిన వారంతా సంక్రాంతి పండుగకు తరలివచ్చారు. పండుగ అనంతరం తిరిగి హైదరాబాదుకు బయలుదేరి వెళ్తున్నారు. దీంతో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరుతున్నాయి. కార్లు బైకులు ఇతర వాహనాలపై తరలి వెళ్తున్నారు. కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ వద్ద వాహనాలు ఒక్కొక్కటిగా హైదరాబాద్ వైపు వెళ్తున్నాయి. నందిగామలోని వై జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ వంతెనకు అనుసంధానంగా రహదారులు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణ పనుల వలన సర్వీస్ రోడ్ నుంచి హైదరాబాద్ వైపు వాహనాలు పంపిస్తున్నారు. సర్వీస్ రోడ్డు మొత్తం గుంతల పడి అధ్వానంగా ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. దీనివల్ల కార్లు ముందుకు వెళ్లడం కష్టంగా ఉంది. ఒకదాని తర్వాత ఒకటి వరుసగా తరలి వెళ్తున్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని పలు ప్రాంతాలకు ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తదితర ప్రాంతాలకు 116 అదనపు సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. అదనపు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొంది. సాధారణ ఛార్జీలే వసూలు చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ తెలిపింది ఏపీ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. దీంతో విజయవాడహైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు బారులు తీరాయి. ఈ క్రమంలోనే కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. కార్లు బైకులు ఇతర వాహనాలపై తరలి వెళ్తున్నారు. కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ వద్ద వాహనాలు ఒక్కొక్కటిగా హైదరాబాద్ వైపు వెళ్తున్నాయి. నందిగామలోని వై జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్ వంతెనకు అనుసంధానంగా రహదారులు నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిర్మాణ పనుల వలన సర్వీస్ రోడ్ నుంచి హైదరాబాద్ వైపు వాహనాలు పంపిస్తున్నారు. సర్వీస్ రోడ్డు మొత్తం గుంతల పడి అధ్వానంగా ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందికరంగా ఉంది. దీనివల్ల కార్లు ముందుకు వెళ్లడం కష్టంగా ఉంది. ఒకదాని తర్వాత ఒకటి వరుసగా తరలి వెళ్తున్నాయి. తెలంగాణలోని పంతంగి టోల్‌ప్లాజా వద్దకు భారీగా వాహనాలు చేరుకుంటున్నాయి. పంతంగి టోల్‌ప్లాజాలోని 12 టోల్‌బూత్‌ల ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ వైపు వాహనాలను అనుమతిస్తున్నారు.

# ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి రూ. నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి : సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతి పనులు జరుగుతున్నాయి. గురువారం ఆయన రాష్ట్రానికి ఆదాయ, అర్జన అంశాలపై సమీక్షను నిర్వహిఇంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధితో పాటు రాష్ట్రానికి ఆదాయాన్ని వృద్ది చేయాలన్నారు. పోలవరం పనులు వేగవంతం చేశాం. అమెరికా సిలికాన్ వ్యాలీలో నీరు లేక రూ. 4 లక్షల కోట్ల ఆస్తి బూడిదయ్యింది. అందుకే నీటి భద్రత చాలా ముఖ్యం. పోలవరం పూర్తయ్యే నాటికి గోదావరి పెన్నా నదుల అనుసంధానం చేస్తాము. టెక్నాలజీ సాయంతో వ్యవసాయం లాభసాటిగా మార్చడంతో పాటు ఖర్చు తగ్గించే విధానాలపై దృష్టి పెట్టాను. ఏపీలో మోలిక సదుపాయాల కల్పనపైన దృష్టి పెట్టాను. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదాన్ని ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళ్తున్నాము. గత ఐదేళ్ల గుంతల రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆరు నెలల్లోనే రోడ్లు వేశాం. సంక్రాంతికి ఇంటికి వెళ్లిన వారందరూ రోడ్లను చూసి సంతోషం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఒక వ్యక్తి ఆనందంగా ఉంటే ఆ కుటుంబం ముందుకుపోతుంది. కొన్ని కుటుంబాల్లో పిల్లలు తల్లిదండ్రులను చూసుకోలేని పరిస్థితి. నేను రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వడంతో ఇప్పుడు తల్లిదండ్రులను పిల్లలు చూసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, కిడ్నీ రోగులకు రూ. 10 వేలు ఇచ్చాం. మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉన్నవారికి రూ. 15 వేలు ఇస్తున్నాము. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సమాధి చేశారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. గత పాలనలో ఎవ్వరికీ స్వేచ్ఛ లేదు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు కూడా రాష్ట్రానికి రావాలన్నా , పెట్టుబడులు పెట్టాలన్నా భయపడ్డారు. కుటుంబ వ్యవస్థ వల్ల భద్రత ఉంటుందని చంద్రబాబు అన్నారు. నేడు ఆధార్ వల్ల ఎవరు ఏంటో వెంటనే తెలిసిపోతోంది. పూర్తి వివరాలు వచ్చేస్తున్నాయి. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పెట్టినా, పెన్షన్ ఇచ్చినా, రైతు భరోసా ఇచ్చినా విడివిడిగా ఇస్తున్నారు.


ఆదాయ అర్జనలపై సీఎం చంద్రబాబు సమీక్ష చేస్తున్న దృశ్యం

## సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన ఇస్రో సైంటిస్ట్ ఎంపికైన జడగం రమేష్

**విజయవాడ,జనవరి16,ప్రభాతవార్తప్రతినిధి:** ఇస్రో ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఆలిండియా 9వ ర్యాంకు సాధించి సైంటిస్ట్‌గా ఎంపికైన తెలుగు యువకుడు జడగం రమేష్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్ తండ్రి శ్రీనివాసులు డ్రైవర్‌గా, తల్లి రామలక్ష్మి టైలర్‌గా పనిచేస్తూ కష్టపడి చదివించారని తెలుసుకున్న ముఖ్యమంత్రి వారిని అభినందించారు. చంద్రయాన్3 ల్యాండర్ మిషన్ టీమ్‌లో ఒకరిగా పనిచేసిన రమేష్, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

17-1P□g7exHMNWJQE.qxd:17-1P□g7exHMNWJQE.qxd 01/01/01 9:35 AM Page 1



# ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్

## అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి

### లీకేజీలు, తాగునీరు కలుషితం కాకుండా

### పకడ్బందీ చర్యలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో అన్ని విభాగాల శాఖధిపతులతో మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, డైరెక్టర్ సృజన, టిజిఐఆర్‌డి డైరెక్టర్ నిఖిల, మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీలు కృపాకర్ రెడ్డి, కనక రత్నం, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారిగా పనుల పురోగతి, నూతన ప్రణాళికలు, పనితనంలో మెరుగుదలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అధికారుల మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, నిబద్ధతతో పనిచేసి శాఖ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. శాఖకు వన్నె తెచ్చేలా పనిచేయాలని, శాఖపరంగా వాస్తవాలనే నివేదించాలన్నారు. మా మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొదన్నారు. అధికారులు, అమాత్యులు వేరు వేరు కాదు, మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దన్నారు. ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దు అంటూ సూచించారు. మీ కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరపండి, వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. రూ. 300 కోట్ల ఎన్ఆర్‌జిఎస్ బిల్లులను నిన్న విడుదల చేశామన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను విడుదల చేశామన్నారు. పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్‌లైన్‌లో పరిష్కరించే విధానాన్ని అవలంబించాలన్నారు.

ఫిబ్రవరి మొదటి వారంలో మిషన్ భగీరథ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. వేసవి సన్నద్ధతలో భాగంగా గ్రామస్థాయిలో అన్ని కనెక్షన్లను చెక్ చేయనున్న తెలిపారు. మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ సిబ్బంది లీ కేజీలు, తాగునీరూ కలుషితం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.

**అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారులకు పోషకాహారం అందాలి**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారులకు పోషకాహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గర్భిణీ, బాలింత, చిన్నారికి పోషకాహారం అందేవిధంగా జిల్లా సంక్షేమ అధికారులను ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. అంగన్‌వాడి సేవలపై చిన్నారుల పేరెంట్స్ ఫీడ్ బ్యాక్ తీసుకుంటామన్నారు.

ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. తల్లి దండ్రుల అభిప్రాయాల మేరకు అంగన్‌వాడి సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు. అంగన్‌వాడికి వచ్చే గర్భిణీలు కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారు, వారి ఇబ్బందులను తొలగించే విధంగా అంగన్‌వాడి కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేనట్టుగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో డ్రైవ్‌లో నిర్వహించి దివ్యాం గులకు పరికరాలను అందజేస్తామని తెలిపారు.



గురువారం కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని స్ఫూర్తిస్థల్‌లో ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు

# పాలమూరు జిల్లాకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలి

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్ర, దేశ రాజకీయాల్లో మచ్చలేని వ్యక్తిగా ముందువరుసలో కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి నిలుస్తారని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో పివిమార్గ్ స్ఫూర్తిస్థల్‌లో అధికారికంగా నిర్వహించిన మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి 83వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని జైపాల్‌రెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ్యుడుగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులుగా అలాగే కేంద్రమంత్రిగా చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని అన్నారు. తెలంగాణ సాధనలో భాగంగా పార్లమెంట్‌లో ముఖ్యభూమిక పోషించారని తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, మనోభావాలు కేంద్రానికి వివరించడంలో సఫలీకృతుడయ్యారన్నారు. అదేవిధంగా జైపాల్‌రెడ్డి పాలమూరు జిల్లా వాసి కావడంతో పాలమూరు జిల్లాకు ఆయన పేరు పెట్టాలని కోరారు.

**గొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జైపాల్‌రెడ్డికి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమకాలీన దేశ రాజకీయాల్లో మొదటగా నిలిచేగొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ మంచి విలువలు, నిజాయితీ గల గొప్ప రాజకీయ నాయకుడు మాజీ కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి అన్నారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సహకారంలో జైపాల్‌రెడ్డి ముఖ్యపాత్రను ప్రజలు ఎన్నడికి మరిచిపోరన్నారు. నివాళులు అర్పించిన వారిలో ముఖ్యమంత్రి సతీమణి గీతారెడ్డి, కుటుంబసభ్యులు, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, వేం నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# విద్యార్థులకు స్కిల్ స్ప్రింట్ పేరుతో ప్రత్యేక ఇంటర్న్‌షిప్

## ఐటి, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు టి - వర్క్స్, స్కిల్ యూనివర్సిటీ సంయుక్తాధ్వర్యంలో స్కిల్ స్ప్రింట్ పేరిట ప్రత్యేక ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. తెలంగాణను నైపుణ్య మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చుతాం అన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. స్కిల్ స్ప్రింట్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం వ్యవధి 90 రోజులు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్, రోబోటిక్స్, మేనేజ్ మెంట్, సేల్స్, బిజినెస్ డెవలప్ మెంట్, మార్కెటింగ్ తదితర రంగాల్లో డిగ్రీ, పిజి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని, సంబంధిత పరిశ్రమల నిపుణులు మార్గనిర్దేశం(మెంటర్‌షిప్) చేస్తారన్నారు. టి-వర్క్స్ లోని అధునాతన సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవచ్చు అన్నారు. సొంతంగా ప్రాజెక్టులను రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తాం అన్నారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా అకాడమిక్ క్రెడిట్స్ ఇస్తాం అని తెలిపారు. ఆసక్తి గల కళాశాలలు, విద్యార్థులు టీ - వర్క్స్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

# పార్టీ సభ్యత్వం ప్రామాణికంగానే పదవుల పందేరం

## సంస్థ బలోపేతానికి కృషిచేసిన వారికి సముచిత స్థానం

## రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మహిళల మద్దతు కూడగట్టుకొని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ఎవరైతే కృషిచేస్తారో వారికి సముచిత స్థానం లభిస్తుందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అన్నారు. గురువారం గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ దేశంలో అన్ని రాష్ట్రాల కంటే సభ్యత్వంలో ముందంజలో నిలిచిందని చెప్పారు. సభ్యత్వం అనే ప్రమాణాలను తీసుకొని ఎవరు ఎంత ఎక్కువ సభ్యులను పార్టీలోకి క్రియాశీలకంగా తీసు కొస్తారో అలాంటి వారికి వారి సభ్యత్వ నమోదు ఆధారంగా పదవులు ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలి పారు. జిల్లా ప్రెసిడెంట్ల పదవులకు పోటీ పడే మహిళా కాంగ్రెస్ కార్య కర్తలు 500పైన సభ్య త్వాలు చేర్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అదేవిధంగా స్టేట్ వైస్ ప్రెసిడెంట్లకు 500 సభ్యత్వం చేయించాలని లక్ష్యం విధించామని గుర్తు చేశారు. జనరల్ సెక్రెటరీలకు 300, సెక్రెటరీలకు 200 మండల, బ్లాక్ ప్రెసిడెంట్ పదవులకు 100 మెంబర్‌షిప్ చేయించి వారికి పదవులు ఇచ్చామని సునీతారావు అన్నారు. రాష్ట్రంలో 21 డిస్ట్రిక్ ప్రెసిడెంట్లను, స్టేట్ వైస్ ప్రెసిడెంట్లు 11, జనరల్ సెక్రెటరీ సెక్రెటరీలు 6, సెక్రెటరీలు 20 మందితో సభ్యత్వాలను బట్టి ఆర్డర్ కాపీలు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు చేతుల మీదుగా ఇచ్చారు. రాబోయే పిసిసి, నామినేటెడ్ పద వులలో మహిళలకు ఎక్కువ స్థానాలు కేటా యించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని. పిసిసి అధ్య క్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసు కుపోతామని తెలిపారు. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడి పనిచేసిన మహిళలకు సముచితమైన స్థానం, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరు తామని తెలియజేశామన్నారు. ఏ పదవులు ఇవ్వా లంటే స్టేట్‌లో కాని జిల్లాలో గాని సభ్యత్వాన్ని బట్టి వారికి పదవులను ఇస్తారు. గురువారం జిల్లాల వారీగా సభ్యత్వాల నమోదును ఆధారంగా జిల్లా కమిటీ మెంబర్లకు ఆర్డర్ కాపీలు ఇచ్చామన్నారు. న్యారి న్యాయ్ సమ్మేళన్ గాంధీ భవన్‌లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో లంచ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి జిల్లాకు కిట్స్ ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే దిశగా పనిచేయాలని సునీతారావు సూచించారు.



గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీరారావు

# కౌశిక్‌రెడ్డివి చిల్లర రాజకీయాలు

## గాంధీభవన్‌లో నివాళులర్పించిన మెట్టు సాయికుమార్

**హైదరాబాద్, జనవరి 16,ప్రభాతవార్త:** జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్ర పటానికి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు కుమార్‌రావ్ తదితరులు పాల్గొన్నారు. స్వర్గీయ జైపాల్‌రెడ్డి ప్రాంతీయ విద్వేషాలు లేని జాతీయవాదిగా గుర్తింపు పొందారని సాయికుమార్ గుర్తుచేసుకున్నారు. హుందాగా రాజకీయాలు నిర్వ హిస్తూ జైపాల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రతి లీడరు ముందుకు పోవాలని ఆయన సూచించారు. జైపాల్‌రెడ్డి లేని లోటు తెలంగాణలో పూడ్చ లేమని అన్నారు. మెట్టు సాయికుమార్ హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ గల్లీలో టిక్ టాక్ చేసేవాళ్లు చిల్లర రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

# ఫిబ్రవరి 15 నుంచి ఆర్‌ఆర్‌బి, ఎస్ఎస్‌సి, బ్యాంకింగ్ పరీక్షలకు ఉచిత శిక్షణ

## 100 రోజులపాటు కొనసాగింపు

## బిసి స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న బీసీ స్టడీ సర్కిల్స్ త్వరలో జరగబోయే జాతీయస్థాయి పోటీ పరీక్షలకి ఉచితంగా శిక్షణను ఇవ్వనున్నారు. అందులో భాగంగా ఫిబ్రవరి 15 నుండి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్ఆర్‌బీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)తోపాటు బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ కోసం అన్నిబీసీ స్టడీ సర్కిల్స్‌లో 100 రోజుల పాటు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్టు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్స్ డైరక్టర్ శ్రీనివాస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో బీసీ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం.. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000.. పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000కి మించకూడదని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. రిజర్వేషన్ నియమం ప్రకారం ఎంపిక చేపట్టనున్నట్టు తెలిపారు. ఉచిత శిక్షణకు అర్హత గల అభ్యర్థులకు ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు డైరక్టర్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని బీసీ స్టడీ సర్కిల్స్‌లో ఫిబ్రవరి 15 నుంచి ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం ఉచిత కోచింగ్ నిర్వహించ బడుతుందని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

# రాష్ట్రంలో ఉన్నత విద్య బలోపేతానికి చర్యలు

## ఉన్నత విద్యారంగంలో సంస్కరణలు

## ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ప్రణాళిక

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్నత విద్యాను బలోపేతం చేయడానికి ఉన్నత విద్యా మండలి చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఉన్నత విద్యలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మార్కెట్ డిమాండ్‌లు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలను సవరించి.. వాటిని అమలు చేయడానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ నేతృత్వంలో కోర్ కమిటీలను ఏర్పాటు చేసినట్టు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలకు సిద్ధంగా ఉండేలా మరియు ప్రయోగాత్మక నైపుణ్యాలను నేర్చుకునే విదంగా కొత్త సిలబస్‌ను రూపొందించబడుతుందని కోర్ కమిటీతెలిపింది. త్వరలో కొత్త సిలబస్ అమలు చేయడానికితెలంగాణ ఉన్నత విద్యా మండలి కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ప్రయోగాత్మకంగా నేర్చుకోవడం, పరిశ్రమకు సంబంధించిన జ్ఞానాన్ని నేర్చుకోవడంపై సిలబస్‌లో దృష్టి పెట్టారు. కీలక ఉపాధి సామర్థ్యాలను అభివృద్ధి చేయడం.. గ్లోబల్ పోటీతత్వాన్ని తట్టుకునే విధంగా పరిశ్రమ నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా సిలబస్‌ను రూపొందించారు. ఉన్నత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి సంస్కరణలు తీసుకురానున్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు మరియు విధాన రూపకర్తలతో సహా వాటాదారుల నుండి సూచనలను ఉన్నత విద్యా మండలి ఆహ్వానిస్తోంది. ఇటీవల ఉన్నత విద్యా మండలి విద్యార్థులు, గ్రాడ్యుయేట్లు మరియు ఉన్నత విద్యా నిర్వహణ, విధాన రూపకల్పన మరియు సంస్థాగత నిర్వహణలో యువ నిపుణులను ప్రోత్సహించాలని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తోంది. యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా, అకడమిక్ లెర్నింగ్ మరియు వాస్తవ ప్రపంచ సవాళ్ల మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఇంటర్న్‌షిప్‌ల కోసం పరిశోధన తయారు చేయబడింది.

# జెఎస్‌సిలోని సంఘాలకు ఇతర విధులు

## 8 సంఘాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులకు ఒడి ఇస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్(జేఎస్‌సీ)లో ఉన్న సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. 2025 సంవత్సరానికి సంబంధించి ఆయా సంఘాలకి అదర్ డ్యూటీ(ఓడీ) అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా జీవో నంబర్ 55ను గురువారం జారీ చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్య సంఘాలుగా ఉన్న టీజీవో సెంట్రల్ అసోసియేషన్, టీఎన్జీవో సెంట్రల్ అసోసియేషన్, తెలంగాణ క్లాస్-4 ఎంప్లాయీస్ సెంట్రల్ అసోసియేషన్, టీఎస్ యూటీఎఫ్, ఎస్టీయూ టీఎస్, టీఆర్‌టీఎఫ్, పీఆర్‌టీయూ టీఎస్, తెలంగాణ రెవిన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) సంఘాలకు సంబంధించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 2025 సంవత్సరానికి సంబంధించిన ఓడీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. మరికొన్ని గుర్తింపు పొందిన సంఘాల ఓడీకి సంబంధించిన అంశాన్ని పెండింగ్‌లో పెట్టారు.

# వరంగల్-హైదరాబాద్ హైవేపై ఘోరప్రమాదం



## లారీని ఢీ కొట్టిన కారు.. తల్లీకూతురు మృతి

## మరో ఐదుగురికి తీవ్రగాయాలు

**భువనగిరి రూరల్, జనవరి 16, ప్రభాతవార్త:** వరంగల్ హైదరాబాద్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురు మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ బూబ్ నగర్ జిల్లా కేసముద్రం మండలం వెంకట్రామ్ తండాకు చెందిన భూక్య సంతోష్ సంక్రాంతి పండగ ముగించుకొని తన కుటుంబసభ్యులతోపాటు అక్క బావతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళుతుండగా భువనగిరి పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో గల పల్లెరుచులు హోటల్ సమీపంలో ముందుగా వెళుతున్న లారీని కారు వెనుక నుండి అతి వేగంగా ఢీకొట్టడంతో కారులో ప్రయా ణిస్తున్న సంతోష్ భార్య అనూష(28) కూతురు చైత్ర(7) ఘటనాస్థలంలోనే మృతి చెందారు.

సంతోష్‌తో పాటు మరో కూతురు ప్రాణిస్వేని, బావ రవి, అక్క భవాని, కోడలు మోక్షలకు తీవ్ర గాయాలు కాగా స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న భువనగిరి సీఐ చంద్రబాబు, ఎస్‌హెచ్‌ఓ సంతోష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఎస్ఓ సంతోష్‌కుమార్ తెలిపారు.

# నర్సింగ్‌లో పిహెచ్‌డికి మార్గదర్శకాల రూపకల్పన

## వాటిపై అభిప్రాయాల సేకరణ

## 20 రోజుల్లో చెప్పాలన్న ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** యూనివర్సిటీల్లో నర్సింగ్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను తీసుకురావడానికి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) చర్యలు ప్రారంభించింది. యూనివర్సిటీల్లో నర్సింగ్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్ చేయడానికి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో పీహెచ్‌డీకి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించారు. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ రూపొందించిన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలు తెలపాలని కోరింది. ఇందుకు సంబంధించి 20 రోజుల్లో సాధారణ ప్రజలతోపాటు స్టేక్‌హోల్డర్లు మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను చెప్పాలని కోరింది.

# మూడు యూనివర్సిటీలకు పిహెచ్‌డి అడ్మిషన్లపై బ్యాన్

## ఐదేళ్లపాటు కొనసాగనున్న నిషేధం

## స్టాండింగ్ కమిటీ సిఫారసుల మేరకు యుజిసి నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 16, ప్రభాతవార్త:** దేశంలోని మూడు విశ్వవిద్యాలయాలపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) సీరియస్ యాక్షన్ తీసుకుంది. మూడు యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లపై నిషేధం విధిస్తున్నట్టు యూజీసీ ప్రకటించింది. రాజస్థాన్‌లోని ఓపీజేఎస్ విశ్వవిద్యాలయం, రాజస్థాన్‌లోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయంతోపాటు రాజస్థాన్‌లోని సింఘానియా విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం నుండి 2029-30 వరకు రాబోయే ఐదు సంవత్సరాల పాటు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో విద్యార్థులను చేర్చుకోకుండా నిషేధం విధించింది. వివిధ యూనివర్సిటీలు చేపడుతున్న పీహెచ్‌డీ అడ్మిషన్లతోపాటు.. వారికి పీహెచ్‌డీ పట్టా జారీ ప్రక్రియపై అధ్యయనం చేయడం కోసం యూజీసీ స్టాండింగ్ కమిటీని నియమించింది. విశ్వవిద్యాలయాలు సమర్పించిన సమాచారాన్ని పరిశీలించిన యూజీసీ స్టాండింగ్ కమిటీ, పీహెచ్‌డీ డిగ్రీల ప్రదానం కోసం మూడు విశ్వవిద్యాలయాలు యూజీసీ పీహెచ్‌డీ నిబంధనలతోపాటు విద్యా సంబంధ నిబంధనలను పాటించలేదని కనుగొన్నది. యూజీసీకి సంబంధించిన పీహెచ్‌డీ నిబంధనలను పాటించడంలో ఎందుకు విఫలమయ్యాయో వివరణ ఇవ్వాలని మూడు విశ్వవిద్యాలయాలకు అవకాశం ఇచ్చారు. అయితే యూనిరవర్సిటీలు సమర్పించిన న వివరణలతో యూజీసీ సంతృప్తికరంగా లేకపోవడంతో.. రాబోయే ఐదు సంవత్సరాల పాటు మూడు యూనివర్సిటీలు పీహెచ్‌డీ విద్యార్థులను నమోదు చేసుకోకుండా నిషేధించాలని స్టాండింగ్ కమిటీ యూజీసీకి సిఫార్సు చేసింది. వాటితోపాటు మరికొన్ని యూనివర్సిటీల్లోని పీహెచ్‌డీ ప్రవేశాల తీరును పరిశీలించాలని యూజీసీ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

# 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు

## ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

## మేడ్చల్ మున్సిపాలిటీలో రూ. 44 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

## పాల్గొన్న ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జనవరి 16, ప్రభాతవార్త :** జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నుండి రాష్ట్రంలో రైతులకు ఎకరాకు రూ 6 వేల రైతు భరోసా, ఇళ్ల స్థలం ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాలను ప్రభుత్వం అమలుపరుస్తుందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో రూ.44 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 26 నుండి సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారెంటీలలో ఎకరాకు రూ 6 వేల రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు తదితర కార్యక్రమాలను అమలు చేయబోతున్నామనీ ఆయన అన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సాగుతున్నాయని మహేందర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మేడ్చల్‌లో చీఫ్ విప్ మహేందర్ రెడ్డి స్థానిక నేతలతో కలిసి కేంద్ర మాజీ మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ వజ్రేష్ యాదవ్, నియోజకవర్గ బిజెపి కన్వీనర్ మోహన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ నర్సింహ్లు యాదవ్, బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మున్సిపల్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, శైలజా హరినాథ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నందారెడ్డి, సాయిపేట శ్రీనివాస్, రమణారెడ్డి, నర్సింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కౌడె మహేష్, చాప రాజు, దేవరాజ్, గణేష్, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రారంభించిన అభివృద్ధి పనులు**

మేడ్చల్ మున్సిపల్ పాలిటీలో రూ 44 కోట్ల అభివృద్ధి పనుల్లో రూ. 38 కోట్ల అమృత్ పథకం నిధులతో 5 మంచి నీటి ట్యాంకులు, రూ. 6 కోట్ల నిధులతో అంతర్గత సిసి రోడ్లు, యూజీడీలు, రూ. 25 లక్షల నిధులతో తుమ్మ చెరువు కట్టకు కంచె తదితర పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభో త్సవాలు చేశారు.



మేడ్చల్‌తో అభివృద్ధి పనులను ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి



## విజయ్ హజారే ట్రోఫీలో ఫైనల్‌కు కర్ణాటక

**ఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ 2024-25లో కర్ణాటక ఫైనల్‌కు చేరింది. తొలి సెమీ ఫైనల్లో ఆ జట్టు హర్యానాపై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన హర్యానా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 237 పరుగులు చేసింది. హర్యానా ఇన్నింగ్స్‌లో ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. కెప్టెన్ అంకిత్ కుమార్ (48) టాప్ స్కోరర్‌గా నిలువగా, హిమాన్షు రాణా (44), అనుజ్ థక్రాల్ (23 నాటౌట్), రాహుల్ తెవాటియా (22), సుమిత్ కుమార్ (21),దినేశ్‌బనా(20),అమిత్‌రాణా(15 నాటౌట్), ఆర్ష్‌రంగా (10), నిషాంత్ సంధు (10) రెండంకెల స్కోర్లు చేశారు. కర్ణాటక బౌలర్లలో అభిలాష్ శెట్టి 4 వికెట్లు పడగొట్టగా, ప్రసిద్ధ్ కృష్ణ, శ్రేయస్ గోపాల్ తలో 2 వికెట్లు,హార్దిక్ రాజ్1వికెట్ దక్కించుకున్నారు. 238 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కర్ణాటక, 47.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. దేవదత్ పడిక్కల్ బ్యాటింగ్‌లోనూ సత్తా చాటాడు. పడిక్కల్ 113 బంతుల్లో 8 ఫోర్లు, సిక్సర్ సాయంతో 86 పరుగులు చేశాడు. పడిక్కల్‌కు జతగా స్మరణ్ రవిచంద్రన్ కూడా రాణించాడు. స్మరణ్ 94 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 76 పరుగులు చేశాడు. కర్నాటక కెప్టెన్ మయాంక్ అగర్వాల్ ఈ మ్యాచ్‌లో డకౌటయ్యాడు. అనీశ్ 22, కృష్ణన్ శ్రీజిత్ 3 పరుగులు చేసి ఔట్ కాగా, శ్రేయస్ గోపాల్ 23 నాటౌట్‌గా, అభినవ్ మనోహర్ 2 నాటౌట్‌గా కర్నాకటను విజయతీరాలకు చేర్చారు. హర్యానా బౌలర్లలో నిషాంత్ సంధు 2 వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కంబోజ్, అమిత్ రాణా, పార్త్ వట్స్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.

# టీమిండియాకు ఏమైంది?

### స్టార్ల ఫ్లాప్ వెనుక కారణాలు

### హెడ్ కోచ్, బౌలింగ్ కోచ్ ప్లేయర్ల మధ్య గ్యాప్

### భారత్ క్రికెట్ బోర్డు పోస్టుమార్టం

**ఢిల్లీ:** ఆటీమ్ ఇండియాకు అసలేమైంది? ఏరికోరి తెచ్చుకున్నోడే ఎసరు పెట్టేస్తున్నాడా? సమ్‌థింగ్ ఈజ్ గోయింగ్‌రాంగ్. టీం ఇండియాలో ఏదో జరుగుతోంది. ఆసీస్‌తో ఘోర పరాజయం కారణం పేలవమైన ఆట తీరునా? జట్టు రాజుకున్న జగడమా? వీటిపై ఇప్పుడు భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)పోస్ట్‌మార్టమ్ చేపట్టింది.ఆస్ట్రేలియాలో ఘోర పరాజయానికి సెంచరీలు సరే టీమ్ స్పిరిట్ లోపంగా గుర్తించింది. స్టారాధిస్టార్ క్రికెటర్ల ఫ్లాప్ షోకు కారణాలేంటనేదానిపై లోతుగా అధ్యయనం జరుగుతోంది. బోర్డ్ గవాస్కర్ ట్రోఫీ ఆసీసు కైవసం చేసుకుంది. రికార్డుల రారాజులున్న టీమ్ ఇండియాకు ఇంత పేలవ పరిస్థితి ఎందుకని దాపురించిందనేదానిపై ఇప్పటికే సీరియస్‌గా ఉంది. అంతకు ముందు కివిస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లోనూ అదే టీమిండియా ఫెయిల్ తీరు. బౌండరీలు, సిక్సర్లు బాదుతూ సెంచరీలు కొట్టే హేమాహేమాలున్నా సరే సిరీస్ న్యూజీలాండ్ పరం కావడం, టీం ఇండియా పరాజయంలో ఎందుకు ఉందనేది ఇప్పుడు బీసీసీఐ ముందున్న పెద్ద ప్రశ్న. వీటన్నింటికి కారణం టీమిండియా హెడ్ కోచ్‌కు ప్లేయర్లకు మధ్య గ్యాప్ అనేది గుర్తించింది. రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ వైఖరితో పాటు,గంభీర్ మోనార్క్‌లా వ్యవహరించడం ఇలా భారత్ క్రికెట్ బోర్డు లోతుగా పరిశీలన చేస్తోంది. అంతేకాకుండా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌తో గంభీర్‌కు విభేదాలు తలెత్తినట్లు వెల్లడవుతోంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఓ ప్రాక్టీస్ సెషన్‌కు మోర్నీ మోర్కెల్ లేటుగా రావడం గంభీర్‌కు నచ్చలేదట. దీంతో మైదానంలోనే దక్షిణాఫ్రికా పాస్ట్ బౌలర్‌ను గంభీర్ మందలించాడట. గంభీర్ ప్రవర్తనతో మోర్నీ మనస్థాపం చెందాడని, ఈ క్రమంలో అతడు మిగిలిన సిరీస్‌లో టీమ్‌తో అట్టీ ముట్టనట్లుగా ఉన్నాడు. ఇక సీనియర్లు కొత్త వాళ్లతో కలిసిపోవడం లేదని, స్టార్ ప్లేయర్స్ తమకు ఫలనా హోటల్‌లోనే బస ఏర్పాటు చేయాలని పట్టుపట్టారని, కొందరు ఆటగాళ్ల గొంతెమ్మ డిమాండ్లు హెడ్ వెయిట్ వైఖరితో హెడ్ కోచ్ గంభీర్‌కు చిర్రెత్తిందనే వాదన ఉంది. డ్రెస్సింగ్ రూమ్‌లోకి ఫ్యామిలీ మెంబర్స్‌ను అనుమతించకపోవడం వల్లే సీనియర్లకు కోపం తెప్పించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి టీమ్‌ను ఇచ్చేదని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు, గంభీర్‌కు మధ్య అంతర్యుద్ధం రాజుకుందని ఇలా వివిధ అంశాలు, విమర్శలు, వారి పనితీరుపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం. టీమ్ ఇండియాలో సఖ్యత కొరవడటంతోనే ఆస్ట్రేలియా టూర్‌లో చెత్తగా ఆడారనేది బీసీసీఐ నిర్వహించిన రివ్యూలో బలంగా విశ్వాసం వ్యక్తమ ఐంది. దాంతో టీం ఇండియాలో స్పిరిట్ కొరవడిందనే లుకలుకలు ఉన్నాయనే క్లారిటీకి వచ్చింది. ఇదే సమయంలో కొందరు సీనియర్లు కావాలని తనకు సహకరించడంలేదని గంభీర్ బీసీసీఐ వద్ద వాపోయినట్టు తెలుస్తోంది. ఎట్ ది సేమ్ టైమ్ గంభీర్ వ్యవహార



శైలిపై సీనియర్లు గుర్రుగా వున్నారట. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ-గంభీర్‌కు కొరకాని కొయ్యలుగా మారినట్లు, ఫలితంగా టీమ్‌ను నడిపించడంలో గంభీర్ ఆశించినంత సక్సెస్ కాలేదనేది తెరముందుకు వచ్చింది. ఇవన్నీ కాదన్నట్టు మరో రకమైన చర్చ రచ్చగా మారింది. ప్రతిభ వున్న సరే అంబటి రాయుడిలాంటి వాళ్లకు టీమ్‌లో చోటు దక్కకపోవడానికి కారణం కొందరు సీనియర్లు, వాళ్లకు వంతపాడే సెలక్టర్లే అనే విమర్శలు రావడంతో ఆ దిశగా కూడా అధ్యయనం చేస్తోంది.



## ఖో ఖో ప్రపంచ కప్‌లో.. భారత్ మహిళల జట్టు విక్టరీ

### పురుషుల జట్టు హ్యాట్రిక్ విజయం

**ఢిల్లీ:** ఖోఖో ప్రపంచ కప్-2025 లో భారత మహిళల, పురుషుల జట్లు జైత్ర యాత్ర కొనసాగిస్తున్నాయి. న్యూఢిల్లీలో ఇరాన్‌పై భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో మరో విజయం సాధించింది. ప్రియాంక ఇంగ్లే నేతృత్వంలోని భారత జట్టు దక్షిణ కొరియాపై ఘన విజయంతో ప్రారంభించింది. తదుపరి భారత మహిళల జట్టు ఆధిపత్యం ఇరాన్‌పై కూడా కొనసాగింది. టాస్ గెలిచిన తర్వాత టర్న్ 1లో భారత్ అటాక్ చేయాలని నిర్ణయించుకుంది. భారత అటాకర్స్ అద్భుతంగా ఆడి 15 మంది ఇరానియన్ డిఫెండర్లను ఔట్ చేసి 48 పాయింట్లు సాధించారు. ఇరాన్ టర్న్ 2లో కేవలం 10 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. భారత్ డిఫెండింగ్‌తో ఇరానియన్ అటాకర్స్‌కు ఎలాంటి ఛాన్స్ ఇవ్వలేదు. టర్న్ 2 ముగిసే సమయానికి, భారత్ ఇరాన్‌పై 52-10 ఆధిక్యంలో ఉంది. మొదటి అర్ధభాగంలో 42 పాయింట్ల ఆధిక్యం సంపాదించింది. రెండో అర్ధభాగం ప్రారంభమైన టర్న్ 3లో, భారత్ మళ్లీ అటాక్‌కు దిగి ఇరానియన్ డిఫెండర్లను దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేసింది. భారత్ అదనంగా 44 పాయింట్లు సాధించి, టర్న్ 3 ముగిసే సమయానికి తమ ఆధిక్యాన్ని 92-10కి పెంచుకుంది. టర్న్ 4లో, ఇరాన్ తమ మొత్తం 16 పాయింట్లతో కేవలం ఆరు పాయింట్లు మాత్రమే జోడించగలిగింది. భారత మహిళల జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో 100 పాయింట్లు సాధించింది. అంతకు ముందు జరిగిన తొలి మ్యాచ్‌లో దక్షిణ కొరియాను 157 పాయింట్ల తేడాతో ఓడించింది. టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయంతో భారత మహిళల జట్టు గ్రూప్ ఎ లో ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఇక భారత పరుషుల జట్టు గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. 9 పాయింట్లతో నాకౌట్ దశకు దాదాపుగా అర్హత సాధించింది. భారత్ పెరూపై వరుసగా మూడో విజయం సాధించింది. గ్రూప్ దశలో నేపాల్, బ్రెజిల్‌పై గెలిచింది. ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లలో భారత్ అంచనాలకు తగ్గట్టుగా ఆటను కొనసాగిస్తోంది. పెరూతో జరిగిన గ్రూప్ ఎ మ్యాచ్‌లో ప్రతీక్ వైకర్ నాయకత్వంలోని భారత జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచిన భారత్ మొదటి టర్న్‌లో అటాకింగ్ ను ఎంచుకుంది. భారత అటాకర్స్ ఏడు నిమిషాలలో 15 పెరూ డిఫెండర్లను ఔట్ చేశారు. ఆ తర్వాత కూడా మొదటి టర్న్ ముగిసే సమయానికి భారత్ 36 పాయింట్లు సాధించింది. రెండో సగం ముగిసే సమయానికి భారత్ తన ఆధిక్యాన్ని 20 నుంచి 32 పాయింట్లకు పెంచుకుంది. వరుస విజయాలతో భారత్ గ్రూప్ ఎ లో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## మహిళల టెన్నిస్ టోర్నీలో.. భాటియా శుభారంభం





**ఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ 50 మహిళల టోర్నమెంట్లో ఒక్కరు మినహా మిగిలిన భారత క్రీడాకారిణులకు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లోనే ప్రత్యర్థుల చేతుల్లో ఓటమి పాలయ్యారు. సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి ఏడుగురు బరిలోకి దిగగా రియా భాటియా మినహా, మిగతా ఆరుగురు భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, అంకితా రైనా, కర్మన్ కౌర్, ఆకాంక్ష, వైదేహి, వైష్ణవి తొలి రౌండ్లోనే నిష్క్రమించారు. తొలి రౌండ్ మ్యాచ్లో హైదరాబాద్ ప్లేయర్ రష్మిక 1-6, 3-6తో రష్యాన్యకు చెందిన మరియా కొజిరెవా చేతిలో, అంకిత రైనా 1-6, 3-6తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన లౌరా సామ్సన్ చేతిలో, కర్మన్ కౌర్ 4-6, 1-6తో హంగేరీకి చెందిన పన్నా ఉద్వార్ది చేతిలో, వైదేహి 4-6, 4-6తో రష్యాకు చెందిన తాతియానా ప్రొజోరోవా చేతిలో, వైష్ణవి 6-7 (3/7), 2-6తో స్లొవేనియాకు చెందిన డాలియా జకుపోవిచ్ చేతిలో, ఆకాంక్ష 0-6, 1-6తో చైనాకు చెందిన ఫ్రాన్గ్లాన్ టియాన్ చేతిలో ఓటమి చవిచూశారు. రియా భాటియా 7-6 (7/3), 2-6, 7-5తో జపాన్‌కు చెందిన ఎరి షిమిజుపై విజయం సాధించింది.

## ఓపెన్ వరల్డ్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సింధు, అనుపమ





**ఢిల్లీ:** ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, అనుపమ ఉపాధ్యాయ్‌లు ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించి ముందంజలో కొనసాగుతున్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో మాజీ చాంపియన్ సింధు 21-12, 22-20తో చైనీస్ తైపీకి చెందిన షువో యున్ సుంగ్‌పై గెలిచింది. ఇక భారత్‌కే చెందిన అనుపమ ఉపాధ్యాయ్ ముందంజ వేయగా, మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్లోనే ఓటమిపాలయ్యారు. అనుపమ 21-17, 21-18తో భారత్‌కే చెందిన రక్షిత శ్రీ పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఇక మాళవిక బన్సోద్ 22-20, 16-21, 11-21తో చైనాకు చెందిన హాన్ యువె చేతిలో, ఆకర్షి కశ్యప్ 17-21, 13-21తో థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పవీ చోచువోంగ్ చేతిలో ఓటమి చవిచూశారు. కాగా పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్స్ లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా, కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 15-21, 10-21తో చైనీస్ తైపీకి చెందిన చున్ యి లిన్ చేతిలో, ప్రణయ్ 21-16, 18-21, 12-21తో చైనీస్ తైపీకి చెందిన లీ యాంగ్ సు చేతిలో, ప్రియాన్షు 16-21, 22-20, 13-21తో జపాన్‌కు చెందిన కొడాయ్ నరోకా చేతిలో పరాజయం పాలయ్యారు. కిరణ్ జార్జి 21-19, 14-21, 27-25తో జపాన్‌కు చెందిన యుషీ తనాకాపై గెలిచాడు. కాగా పురుషుల డబుల్స్ విభాగంలో భారత్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ జంట 23-21, 19-21, 21-16తో మలేషియాకు చెందిన వె చోంగ్ మాన్-కాయ్ వున్ తీ జోడీపై నెగ్గారు. అలాగే మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత్‌కు చెందిన ఐదో సీడ్ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-23, 19-21తో జపాన్‌కు చెందిన అరీసా ఇగారిషి-అయాకో సకురామోటో ద్వయం చేతిలో ఓటమిపాలైంది.

## 20% పెరగనున్న రైల్వే బడ్జెట్!

**న్యూఢిల్లీ, జనవరి 16:** 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఫిబ్రవరి 1న బడ్జెట్ (యూనియన్ బడ్జెట్ 2024) ప్రవేశపెట్టబడుతుంది. ఇప్పటికే బడ్జెట్‌లో ఏయే రంగాల్లో కేటాయింపులు పెరుగుతున్నాయి, సువేటికి ప్రోత్సాహకాలు లభించే అవకాశం ఉందనే విషయంపై చర్చలు మొదలయ్యాయి. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా రైల్వే అభివృద్ధికి సహకరించేలా బడ్జెట్ రూపకల్పన ఉండనుందని అంచనాలు ఉన్నాయి.

భద్రత, రైళ్ల సామర్థ్యం పెంపుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, ఈసారి బడ్జెట్ భారతీయ రైల్వే కేటాయింపుల్లో పెంపు ఉండొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతీయ రైల్వేకు సంబంధించి రానున్న బడ్జెట్‌లో ప్రత్యేక ప్రకటనలు ఉండే అవకాశం ఉంది. మూలధన వ్యయం కేటాయింపులో 15 20 శాతం పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందించిన రూ.2,65 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్లకు పెరగొచ్చని తెలుస్తోంది. రైల్వే స్టేషన్‌లను ఆధునికీకరించడం, రైళ్లను ప్రవేశపెట్టడం వంటి అంశాలను తీసుకోవద్దు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వేకు కేటాయించిన రూ.2.65 లక్షల కోట్లలో రూ.2 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా మిగిలిన మొత్తం ఖర్చు చేస్తాం అని రైల్వే అధికారి తెలిపినట్లు సమాచారం. కొత్త ట్రాక్‌ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న వాటిని అప్ చేయడం కోసం అధిక కేటాయింపులు జరుగుతాయి. లోకోమోటివులు, వ్యాగన్లు, కోచ్‌లతో పాటు ముంబయి-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ కోసం ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని, దేశీయ ఆర్థికవృద్ధి 2024 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.4 పరిమితి కావొచ్చని అంచనాలు ఉన్నాయి.



## ఏడేళ్లలో 7 సంస్థలను టార్గెట్ చేసిన హిండెన్‌బర్గ్

**వాషింగ్టన్, జనవరి 16:** అమెరికాకు చెందిన పెట్టు బడి, రీసెర్చ్ సంస్థ హిండెన్ బర్గ్ ప్రస్తుతం క్లోజ్ చేయాలని నిర్ణయించబడింది. సంస్థ వ్యవస్థాపకుడు నాటె యాండర్సన్ దీనికి సంబంధించిన ప్రకటనను వెలువరించారు. ప్రస్తుతం తాము పనిచేస్తున్న ప్రాజెక్టులు ముగిసిన తరుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేవలం 10మంది ఉద్యోగులతో 2012లో స్థాపించబడిన ఈ సంస్థ అనేక కంపెనీలు అకౌంటింగ్ లోపాలు లేదా చేస్తున్న తప్పులను బయటపెట్టింది. ఈ క్రమంలో టార్గెట్ చేయబడిన అనేక కంపెనీల మార్కెట్ విలువను కరిగించేంది. 1937లో జర్మనీకి చెందిన హిండెన్‌బర్గ్ ఎయిర్‌షిప్ న్యూజెర్సీలోకి ఎగురుతున్నప్పుడు మండిన హైప్రొఫైల్ ప్రమాదం పేరు మీద హిండెన్‌బర్గ్ అనే పేరు పెట్టారు. హిండెన్‌బర్గ్ కంపెనీ టార్గెట్ చేసిన 7పెద్ద కేసుల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.. ముందుగా 2023 జనవరి చివరిలో భారతీయ వ్యాపార దిగ్గజం అదానీ గ్రూప్ కంపెనీల వ్యాపారాలపై హిండెన్ బర్గ్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఇది అదానీ కంపెనీల మార్కెట్ విలువను వేల కోట్ల మేర కరిగించేసింది. అయితే తర్వాతికాలంలో పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపటంతో స్టాక్స్ తిరిగి నష్టాల నుంచి



పుంజుకోగలిగాయి. అలాగే భారతీయ స్టాక్ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ చీఫ్ మాదబీ పూరీబుచ్, ఆమె భర్త దవెల్ బుచ్ అదానీకి సహకరించారంటూ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.2020లో నికోలాకంపెనీ ఎలక్ట్రిక్ ట్రక్కుల తయారీలో తన వద్ద టెక్నాలజీ ఉందని పెట్టుబడిదారులను మోసం చేసినట్లు హిండెన్ బర్గ్ బయటపెట్టడంతో సఫలమైంది. కంపెనీ విడుదల చేసిన వీడియోలో అధిక వేగం సాధించి నట్లు చూపటాన్ని అబద్ధంగా రుజువు చేసింది. అలాగే 2023లో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఇకాన్ ఎంటర్‌ప్రైజెస్ ఆర్థికనివేదికలపై విమర్శించింది. కంపెనీ తన పెట్టుబడిదారులకు అతిగా అంచనా వేసి డివిడెండ్‌లను చెల్లించడానికి పోంజీ లాంటి నిర్మాణంపై ఆధారపడిందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. దీంతో కంపెనీ షేర్ల పతనం దాదాపు 3 బిలియన్ డాలర్ల మేర ఇకాన్ నికర విలువ తగ్గటానికి దారి తీసింది. 2023లో కంపెనీ బ్లాక్ ఇంక్ కంపెనీలో కలిగి ఉన్న షార్ట్ పొజిషన్లను బహిర్గతం చేసింది. ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సే నేతృత్వంలోని చెల్లింపుల సంస్థ తన వినియోగదారుల సంఖ్యను ఎక్కువగా చూపించిందని, కస్టమర్‌అక్విజిషన ఖర్చులను తక్కువగా చూపించిందని ఆరోపించింది. క్రెడిట్ కార్డ్ పరిశ్రమను కదిలించే లక్ష్యంతో 2009లో తన శాన్‌ఫ్రాన్సిస్కో అపార్ట్‌మెంట్‌లో బ్లాక్‌ను సహ స్థాపించిన డోర్సేకి ఈ చర్య ఒక సవాలుగా భావించబడింది. 2022లో హిండెన్‌బర్గ్ ట్విట్టర్ ఇంక్‌లో షార్ట్, లాంగ్

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, జనవరి 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్లో సానుకూలసంకేతాల మధ్య ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదే బాటలో పయనించాయి. ముఖ్యంగా పవర్, మెటల్ షేర్లలో కొనుగోళ్లతో సూచీలు రాణించాయి. చివరికి సెన్సెక్స్ 318 పాయింట్లు పెరిగి 77,042.82 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 98.60 పాయింట్లు లాభపడి 23,311.80 పాయింట్ల వద్ద నిలిచింది. అదానీ పోర్ట్స్, ఎస్‌బిఐ, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, మారుతి సుజుకి, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటిసి, టిసిఎస్, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 81.86 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 2,735.40 డాలర్ల వద్ద కొనసాగింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.56 వద్ద స్థిరపడింది.


## ఒక్క రోజులో వేల కోట్లు పోగొట్టుకున్న శివ్ నాడార్

**ముంబై, జనవరి 16:** భారతదేశంలో ముఖేష్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి చాలా మంది బిలియనీర్లు ప్రపంచపు అత్యంత సంపన్నుల లిస్టులో చోటు దక్కించుకున్నారు. అయితే శివ్ నాడార్ మాత్రం దాతృత్వానికి అతీతంగా నిలిచే వ్యాపారవేత్త. శివ్ నాడార్ హెచ్‌సిఎల్ టెక్ ఛైర్మన్. తాజాగా హెచ్‌సిఎల్ టెక్ కంపెనీ షేరు ధర పడిపోవడంతో శివ నాడార్ మొత్తం సంపద విలువ కూడా భారీగా క్షీణించింది. దీంతో 14 జనవరి మంగళవారం రోజున అతని సంపద విలువ రూ.46,485 కోట్లకు తగ్గింది. హెచ్‌సిఎల్ టెక్ షేరు ధర 9శాతం తగ్గడంతో శివ్ నాడార్ సంపద విలువ కూడా భారీగా క్షీణించింది. దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన హెచ్‌సిఎల్ టెక్ డిసెంబర్ 2024 త్రైమాసికఫలితాలను ప్రకటించిన తర్వాత షేర్లు పడిపోయాయి. షేర్‌మార్కెట్ ఆశించిన స్థాయిలో బిజినెస్ గ్రోత్ లేకపోవడమే ఇందుకు ప్రధానకారణం. బిఎస్‌ఇలో షేరు ధర 8.63శాతం తగ్గి రూ.1,813.95కి చేరుకుంది. నేషనల్ స్టాక్‌ఎక్స్ఛేంజీలో ఈ షేరు 8.51శాతం పడి పోయి రూ.1,819.95 వద్ద ముగిసింది. దీనితో బిఎస్ఇని అండ్ ఎన్ఎస్ఇలలో లిస్టెడ్ కంపెనీలలో హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ అతిపెద్ద క్షీణత నమోదు చేసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.4,92,245.28 కోట్లకు పడిపోయింది. హెచ్‌సిఎల్ మార్కెట్ క్యాప్ రూ.4,92,475 కోట్లకు పెరిగింది. ఇంత భారీ తగ్గుదల ఉన్నప్పటికీ ఫోర్బ్స్ నివేదిక ప్రకారం శివ నాడార్ రియల్ టైం మొత్తం సంపద విలువ 39.4 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 3,40,793 కోట్లు. 79 సంవత్సరాల వయస్సుగల శివ్ నాడార్ కేవలం టెక్ మాగ్నెట్ మాత్రమే కాదు, భారతదేశ అత్యంత ఉదారమైన పరోపకారి కూడా. నవంబర్‌లో విడుదల చేసిన నివేదికప్రకారం అతను 2024లో ప్రతి రోజు రూ.5.9కోట్లకు సమానమైన రూ.2,153 కోట్లను విరాళంగా ఇచ్చాడు. అతను భారతదేశ అత్యంత ఉదారమైన పరోప కారిగా గుర్తింపు పొందడం ఐదేళ్లలో ఇదిమూడోసారి. స్టాక్‌మార్కెట్ అస్థిరత ఫలితంగా హెచ్‌సిఎల్ టెక్ వాల్యుయేషన్‌లో తాత్కాలికంగా తగ్గుదల ఏర్పడినప్పటికీ, భారతదేశ ఐటి రంగానికి శివ్ నాడార్ చేసిన కృషి ఇంకా అతని దాతృత్వ సేవల కారణంగా అతనిని నిజమైన మార్గదర్శకుడిగా అలాగే భవిష్యత్ తరాలకు రోల్ మోడల్‌గా నిలిపింది.



## సియట్, నెట్‌వర్క్ 18 లాభాలు డౌన్

**ముంబై, జనవరి 16:** టైర్ల తయారీ దిగ్గజం సియట్ (సీట్) లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం(202425) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు వెల్లడయ్యాయి. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్‌డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 46 శాతంపైగా క్షీణించి రూ.97 కోట్లకు పరి మితమైంది. పెరిగిన ముడిసరుకుల వ్యయాలు లాభాలను దెబ్బతీశాయి.ఇదేకాలంలో రూ.181 కోట్లుపైగా ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ.2,963కోట్ల నుంచిరూ.3,300 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ.2,739కోట్ల నుంచి రూ.3,176 కోట్లకు పెరిగాయి. ముడిసరుకుల వినియోగ వ్యయాలు రూ.1,695 కోట్ల నుంచి రూ.2,117 కోట్లకు ఎగశాయి. అన్ని విభాగాల్లోనూ పటిష్ట ఆర్డర్ బుక్‌ను కలిగి ఉంది కంపెనీ ఎండీ, సీఈవో అర్నాబ్ బెనర్జీ. స్థిరమైన డిమాండ్ కారణంగా ఆదాయంలో వృద్ధి కొనసాగే వీలున్నట్లు అంచనా వేయబడింది. ప్రయివేట్‌రంగ సంస్థ నెట్‌వర్క్18మీడియా ఇన్వెస్ట్మెంట్స్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో భారీ నష్టాలు చవిచూసింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్‌లో రూ.1,400 కోట్లనష్టం ప్రకటించింది. అయితే అనుకోని పద్దులకు ముందు దాదాపు రూ.26కోట్ల నికర లాభం ఆర్జించినట్లు కంపెనీ కనుగొన్నట్లు. అనుబంధ సంస్థల గుర్తింపురాదు.



1,426 కోట్ల నష్టం నమోదైనట్లు. వీటిని ప్రొవిజనల్గా మదింపు చేసినట్లు తెలియజేసింది. స్టార్ ఇండియాతో అనుబంధ కంపెనీ వయాకామ్ 18విలీనం కారణంగా (2023-24) ఫలితాలను పోల్చదగినదని, కాగా మొత్తం ఆదాయం రూ.1,361 కోట్లకు చేరింది. స్టాండలోని ఆదాయం రూ.476 కోట్లను అధిగమించింది.

# వాణిజ్యం

## పాత పన్ను విధానం తొలగింపు?

**ముంబై, జనవరి 16:** కేంద్ర ప్రభుత్వం 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో పాత వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంపై కీలక నిర్ణయాలు తీసుకోనుందని సమాచారం. క్రమంగా ఈ పాత పన్ను తొలగించే ప్రకటనలు ప్రభుత్వం యోచిస్తోంది. కొత్త పన్ను విధానాన్ని ఆర్థిక పన్నుదారుల ఎంపికగా మార్చే లక్ష్యంతో మంత్రి నిర్మలా సీతారామన్ రోడ్ మ్యాప్‌ను ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటివరకు పన్నుదారులు పాత, కొత్త విధానాల్లో ఏదైనా పెంచుకునే వీలుంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే ఇకపై వెసులుబాటు ఉండదని నిపుణులు చెబుతు న్నారు. 2021 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశ పెట్టిన కొత్త పన్ను విధానం తక్కువ పన్ను రేట్లను అందిస్తుంది. కానీ పాత పన్ను విధానం లో ఉన్నన్ని




మినహాయింపులు మాత్రం కొత్త విధానంలో లేవని కొందరు అభిప్రాయపడుతు న్నారు. ఈ విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన తక్కువ రేట్లకు పన్నుదారులు ఆకర్షితులయ్యా రు. వీరిని మరింత ప్రోత్సహించడానికి కొత్త శ్లాబ్‌లను తీసుకురావాలని ప్రభుత్వం వద్ద ప్రతి పాదనలు ఉన్నాయి. ప్రస్తుత విధానంలో ఏడాదికి రూ.3 లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంది. ఈ పరిమితిని రూ.4లక్షలకు పెంచే అవకాశంఉంది. మొదటి శ్లాబుగా ఉన్న రూ.3లక్షల నుంచి రూ.6 లక్షల పరిధిని రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షలకు సర్దుబాటు చేయవచ్చు. కొత్త విధానం చాలా మందికి అనుకూలంగా ఉంటుంది, ఇంటి అద్దె భత్యం, పెట్టుబడులు, గృహ రుణ వడ్డీ వంటి వివిధ మినహాయింపు లు, వాటి వల్ల కలిగే ప్రయోజనం పొందే అవకాశం పాత విధానంలో మెరుగ్గా ఉండేదనే వాదనలు ఉన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps